అనుదినం... జనస్వరం

నవతెలంగాణ


శుక్రవారం 3-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 33 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50

కళాతపస్వి ఇక లేరు..

ప్రముఖ దర్శకుడు కె. విశ్వనాథ్ కన్నుమూత

- అనారోగ్యంతో చికిత్సపొందుతూ..


(ఫైల్)

హైదరాబాద్ : ప్రముఖ దర్శకుడు, కళా తపస్వి కె. విశ్వనాథ్ (92) ఇక లేరు. శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం వంటి సినిమాలతో తెలుగు సినీ పరిశ్రమ ఖ్యాతిని దశదిశలా చాటిన ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆయన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను కాపాడటానికి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఆయన కన్నుమూసినట్టు వైద్యులు అధికారికంగా ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల ప్రజానీకం ఈ వార్తతో దిగ్భ్రాంతికి గురయ్యారు. 1930 లో గుంటూరు జిల్లా పెదపులివర్రు గ్రామంలో విశ్వనాథ్ జన్మించారు. తెలుగు సినీ చరిత్రలో ఆణిముత్యాల్లా నిలిచిపోయే దాదాపు 50 సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. చిత్రరంగం మీద ఆసక్తితో చెన్నై వెళ్లిన ఆయన ఒక స్టూడియోలో సౌండ్ రికార్డు ఆర్టిస్టుగా సినీ జీవితాన్ని ఆరంభించారు. 1965లో ఆత్మగౌరవం సినిమాకు ఆయన తొలిసారిగా దర్శకత్వం వహించారు. దర్శకుడిగా ఆయన చివరి సినిమా శుభప్రదం. 1992లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. 2016లో దాదాసాహెబ్ పురస్కారం అందుకున్నారు. ప్రముఖ నటుడు కమల్‌హాసన్ సూచనతో... విశ్వనాథ్ దర్శకత్వంతో పాటు నటనారంగంలోకి ప్రవేశించి.. కొన్ని వందల చిత్రాల్లో ఆయన నటించారు.

అదానీ వ్యవహారంపై

చర్చించాల్సిందే

పట్టుబట్టిన ప్రతిపక్షాలు

- దద్దరిల్లిన పార్లమెంట్
- వాయిదాల పర్వంలో ఉభయ సభలు

అదానీ గ్రూప్ వల్ల ఎల్ఐసీకి జరిగిన నష్టంపై పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక వ్యవహారంపై ప్రతిపక్షాలు చర్చకు గురువారం పట్టుబట్టాయి. అదానీ 'స్కామ్'పై కాంగ్రెస్, సీపీఐ(ఎం), డీఎంకే, సీపీఐ, టీఎంసీ, ఎస్పీ, జేడీయూ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), బీఆర్ఎస్, ఎన్సీపీ, ఐయూఎంఎల్, ఎన్సీ, ఆప్, కేరళ కాంగ్రెస్ పార్లమెంటులో చర్చకు డిమాండ్ చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టాయి. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను మొదలుపెట్టారు.



న్యూఢిల్లీ : అయితే అదానీపై హిండెన్‌బర్గ్ నివేదిక గురించి చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం), సహా కొన్ని పార్టీలు ఈ విషయంపై వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్, బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) ఎంపీ పిఆర్ నటరాజన్‌తో పాటు మరికొంత మంది నోటీసులు ఇచ్చారు. అయితే, ఇందుకు సభాపతి అంగీకరించలేదు. ప్రశ్నోత్తరాల గంట చాలా ముఖ్యమైందనీ, సభ్యులు అంతరాయం కలిగించొద్దని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకపోవడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. దీంతో సభ ప్రారంభమైన నాలుగు నిమిషాలకే వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమవ్వగా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. వాయిదా తీర్మానాలపై చర్చ జరపాల్సిందేనని ప్రతిపక్ష ఎంపీలు గట్టిగా నినాదాలు చేశారు. ఆందోళనల నేపథ్యంలో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 11 గంటలకు చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ సభను ప్రారంభించగా, వెంటనే ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీపీఐ(ఎం) ఎంపీలు ఎలమారం కరీం, వి.శివదాసన్, సీపీఐ ఎంపీ బినయ్ విశ్వం, శివసేనకు చెందిన ప్రియాంక చతుర్వేది, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన సంజయ్ సింగ్, బీఆర్ఎస్ ఎంపీ కె.కేశవరావుతో సహా తొమ్మిది మంది ఎంపీలు అదానీ గ్రూప్ స్టాక్ రూట్, మిలియన్ల కొద్దీ సామాన్యులపై దాని ప్రభావం గురించి చర్చించడానికి సాధారణ బిజినెస్‌ను నిలిపివేయాలని కోరుతూ రూల్ 267 కింద నోటీసులు ఇచ్చారు. నోటీసులు సక్రమంగా లేవని చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్... 5లో

జేపీసీ వేయాలి

లేదంటే సీజేఐ ఆధ్వర్యంలోని కమిటీతో దర్యాప్తు జరిపించాలి : ప్రతిపక్షాలు డిమాండ్

వివరాలు 5లో



అదానీ అప్పులపై ఆర్‌బీఐ దృష్టి



న్యూఢిల్లీ : అదానీ గ్రూపు తీవ్ర మోసాలకు పాల్పడుతున్నదని హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పై ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. అదానీ కంపెనీలకు అప్పులిచ్చిన వివరాలను తమకు అందజేయాలని బ్యాంక్‌లు, విత్త సంస్థలను ఆర్‌బీఐ ఆదేశించిందని సమాచారం. ఏయే బ్యాంక్‌లు ఎంత మొత్తం చొప్పున రుణాలిచ్చాయో వివరాలు ఇవ్వాలని కోరిందని తెలుస్తోంది. కాగా.. దీనిపై ఆర్‌బీఐ వర్గాలు అధికారికంగా స్పందించడానికి నిరాకరించాయి. విత్త సంస్థల నుంచి అదానీ గ్రూపు రూ.2 లక్షల కోట్ల పైన అప్పులు తీసుకుంది. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల రుణాలు ఎంత ఉన్నాయో వెల్లడి కావాల్సి ఉంది. అదానీ కంపెనీ షేర్లలో భారీగా పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ వేల కోట్ల నష్టాలను చవి చూస్తున్నది. మరోవైపు అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20వేల కోట్ల ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ) సబ్‌స్క్రిప్షన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ.. దీనిపై సెబీ ఎలాంటి వివరణ కోరకపోవడం గమనార్హం.

నేటి నుంచి అసెంబ్లీ

ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

- ప్రోగ్రెస్ రిపోర్టు చెప్పేందుకు బీఆర్ఎస్ వ్యూహం
- వైఫల్యాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ సన్నాహాలు
- రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై బీజేపీ ఫోకస్
- పాత బస్తీ సమస్యలపై ఎంఐఎం కుస్తీ
- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న పార్టీలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్నది ఎన్నికల సీజన్. శుక్రవారం ఉదయం 12.30 గంటలకు ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీలు సాధారణ ఎన్నికలకు అనుగుణంగా వ్యవహరించనున్నాయి. అసెంబ్లీ వేదికగా వాటి ఆలోచన విధానాన్ని చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. బీఆర్ఎస్ ఐదేండ్లపాలనకు ఈ బడ్జెట్ సమావేశాలు చివరివి కానున్నాయి. అందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. అధికార బీఆర్ఎస్ ఐదేండ్లకాలంలో చేసిన ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందుంచేందుకు ఎత్తులు వేస్తున్నది. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన క్రమంలో దేశ ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు కీలకమైన పథకాలను ఏకరువు పెట్టాలని భావిస్తున్నది. అందుకు అసెంబ్లీ వేదికను ఉపయోగించుకునేందుకు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు శ్రమించాల్సి ఉందంటూ సంకేతాలిచ్చినట్టు తెలిసింది. రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టు నిర్మాణం ద్వారా పంటల ఉత్పత్తి పెరగడం, వృద్ధాప్య, వితంతువు పెన్షన్లు, మన ఊరు, మన బడి, పల్లె, పట్టణ ప్రగతి, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల నిర్మాణం, నూతన సచివాలయ నిర్మాణం, యాదాద్రి అభివృద్ధి వంటి విషయాలను అసెంబ్లీ వేదికగా చెప్పేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. రానున్న... 5లో

టాలీవుడ్‌లో లైంగిక వేధింపులు

అరికట్టాలి

హై లెవెల్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ- సిటీబ్యూరో

టాలీవుడ్‌లో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలని, హై లెవెల్ కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్డులోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తెలుగు సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులపై రాష్ట్ర ప్రభుత్వం 2019లో వేసిన హై లెవెల్ కమిటీ నాలుగు నెలల కిందట ప్రభుత్వానికి నివేదిక అందించిందని తెలిపారు. టాలీవుడ్‌లో మహిళా ఆర్టిస్టులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని నిర్ధారిస్తూ.. నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని కమిటీ సిఫారసులు చేసిందని గుర్తుచేశారు. దీనిపై నేటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. అసంఘటితరంగ కార్మికుల్లో ఒంటరి మహిళా ఆర్టిస్టులు దళారుల చేతుల్లో తీవ్రమైన లైంగిక వేధింపులకు గురవుతున్నారని, వీరికి వేతనాలూ సక్రమంగా చెల్లించడం లేదని కమిటీ గుర్తించిందని తెలిపారు. సినీ పరిశ్రమలో దళారుల దాష్టీకాలు ఎక్కువగా ఉన్నాయని, వీరిని నియంత్రించే... 5లో

ఉపాధి నిధుల కోతపై ఆవేదన

రాష్ట్ర వ్యాప్తంగా వ్యకాస, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన

- బడ్జెట్ ప్రతుల దహనం

నవతెలంగాణ - విలేకరులు

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధుల తగ్గింపుపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరమూ బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు కోత పెడుతున్నదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బడ్జెట్ కంటే ఈసారి తక్కువ నిధులు కేటాయించిందని విమర్శించారు. దీనివల్ల ఉపాధి హామీ కూలీలకు పని దొరికే పరిస్థితులు ఉండవన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాలబావి సెంటర్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నూతనకల్ మండలంలోని చిల్పకుంటలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో... 5లో



జులై 1న గ్రూప్-4

రికార్డు స్థాయిలో 9.15 లక్షల దరఖాస్తులు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేడే చివరితేది : టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 రాతపరీక్షల తేదీని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఖరారు చేసింది. జులై ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జులై ఒకటో తేదీన ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు... 5లో

పరిశ్రమల్లో కార్మికుల మరణ రేటుపై

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆందోళన

- సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- ఆరు వారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశాలు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పరిశ్రమల్లో కార్మికుల మరణాలు, స్థితిగతులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పందించింది. అధిక మరణ రేటుపై ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై సమగ్ర నివేదికను సమర్పించాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు... 5లో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ

రెండో చార్జిషీట్

కేజ్రీవాల్, కవిత, ఎంపీ మాగుంట పేర్లు


(ఫైల్)

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రస్తావించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ రెండో ఛార్జ్‌షీటును దాఖలు చేసింది. చార్జ్‌షీట్‌లో 17 మంది నిందితులపై అభియోగాలు మోపింది. మొత్తం 428 పేజీల చార్జిషీట్‌లో మద్యం కుంభకోణం ఎక్కడ మొదలయింది? ఎవరెవరు పాత్రధారులన్నది... 2లో

కేంద్రమంత్రి గడ్కరీకి షాక్

సొంత నియోజకవర్గంలో బీజేపీకి ఎదురు దెబ్బ

- మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ అభ్యర్థి గెలుపు


వివరాలు 2లో



అణగారిన వర్గాలకు అన్యాయం

కేంద్ర బడ్జెట్‌పై ఆర్థిక నిపుణులు

- మొత్తం కేంద్ర పథకాల నిధుల్లో ఎస్సీ సంక్షేమానికి 8.1శాతం
- గిరిజన సంక్షేమానికి 6 శాతం
- మైనార్టీ సంబంధాల్లో 38శాతం నిధుల కోత
- మొత్తం బడ్జెట్‌లో మహిళలు, బాలికలకు దక్కింది 4.9శాతం

ఎస్సీ, ఎస్టీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా మోడీ సర్కార్ 2023-24 బడ్జెట్ కేటాయింపులు లేవని ఆర్థిక నిపుణులు గణాంకాలతో సహా వివరిస్తున్నారు. మొత్తం కేంద్ర పథకాల వ్యయంలో ఎస్సీ సంక్షేమ పథకాల కేటాయింపు 2021-22లో 8.8శాతం కాగా, ఇప్పుడు 8.1శాతమే. 2021-22లో ఎస్టీ సంక్షేమ పథకాల వాటా 5.6శాతం. 2023-24 బడ్జెట్‌లో పెంచింది పెద్దగా ఏమీ లేదు. సమ్మిళిత అభివృద్ధికి ఈ బడ్జెట్ ఎలా అడ్డం పడుతుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మొత్తం రూ.45లక్షల కోట్ల బడ్జెట్‌లో మహిళలు, బాలికలకు నిధుల కేటాయింపు 4.9శాతం.

న్యూఢిల్లీ : కేంద్రం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌పై ఆర్థిక నిపుణులు పెదవి విరుస్తున్నారు. పేదలు, అణగారిన వర్గాల్ని పూర్తిగా విస్మరించారని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమం గురించి ఏమాత్రమూ ఆలోచించలేదని నిపుణులు అభిప్రాయపడ్డారు. అంతేగాక మహిళలు, మైనార్టీల విషయంలోనూ చెప్పుకోతగ్గ ప్రతిపాదనలు లేవన్నారు. కోవిడ్-19 సంక్షోభంతో తీవ్రంగా నష్టపోయింది పేదలు, అణగారిన వర్గాలు. సంక్షోభ సమయంలో లాభాలు పోగేసుకుంది బడా కార్పొరేట్లు, అత్యంత ధనికులు. బడ్జెట్‌లో మోడీ సర్కార్ బడా కార్పొరేట్లకు, అత్యంత ధనికులకు తాయిలాలు ప్రకటించింది. పన్ను ప్రయోజనాలు సరళతరం చేసింది. ఆర్థికంగా ముడిపడిన అనేక నిబంధనల్లో చట్ట సవరణలు చేయబోతున్నట్టు తెలిపింది. దీనిని 'అమృత్ కాల్'గా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

ఏ ఒక్క వర్గానికీ ఊరట లేదు..

దేశంలో నేడు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు రికార్డ్ స్థాయిలో ఉన్నాయి. పెద్ద పెద్ద చదువులు పూర్తిచేసుకున్నవారు సైతం గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు పోటీ పడ్డారు. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలేవీ పట్టించుకోకుండా అందమైన మాటలతో, పదాలతో బడ్జెట్‌ను రూపొందించారన్న విమర్శలున్నాయి. ద్రవ్యోల్బణం, అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలతో మధ్య తరగతి తీవ్రంగా ప్రభావితమైంది. వారికి ఊరట కలిగించే ఒక్క ప్రకటనా బడ్జెట్‌లో లేదు. వాస్తవ... 5లో



కేంద్రమంత్రి గడ్కరీకి షాక్

నాగ్‌పూర్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సొంత నియోజకవర్గం నాగ్‌పూర్ లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థి నాగో గనార్ పరాజయం పాలయ్యారు. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థి సుధాకర్ అడ్బాలే విజయం సాధించారు. ఆరెస్సెస్‌లోని పలువురు కీలక వ్యక్తులతోపాటు, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఈ నియోజవర్గానికి చెందిన వారే అయినప్పటికీ వారి మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థి పరాజయం పాలవ్వడం గమనార్హం. శివసేన నుంచి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం విడిపోయిన తర్వాత జరిగిన కీలక ఎన్నికలో బీజేపీ మద్దతుదారు ఓడిపోవడం చర్చలకు తావిస్తోంది.

రాష్ట్రంలో ఎగువసభ అయిన శాసనమండలిలో.. బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన షిండే వర్గానికి, ఉద్ధవ్ ఠాక్రే వర్గాలకు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. శాసనమండలిలో మూడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీల పదవీకాలం ఈ నెల 7తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఐదు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానమైన కొంకణ్‌లో అత్యధికంగా 91.02 శాతం ఓట్లు పోలవ్వగా, నాసిక్‌లో అత్యల్పంగా 49.28శాతం ఓట్లు పోలయ్యాయి. ఔరంగాబాద్‌లో 86శాతం పోలింగ్ నమోదైంది. మిగతా నాలుగు ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలు ఇంకా వెల్లడి కాలేదు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- అదే నిజమైన జాతీయీకరణ : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ-ఓయూ

సీఎం కేసీఆర్ అన్నట్టు రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడమే నిజమైన జాతీయీకరణ అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో గురువారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మీ సమస్యలు తీరే వరకు' అండగా ఉంటామన్నారు. శాతవాహన యూనివర్సిటీలో తొలగించిన ఐదుగురు కాంట్రాక్టు అధ్యాపకులను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులపై చిన్నచూపు వద్దన్నారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించాలని, యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు సమాన పనికి సమాన వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఔటా ఉపాధ్యక్షులు, యూజీసీ డీన్ ప్రొ.జి.మల్లేష్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు అన్ని రకాలుగా తమతోపాటు సమానంగా పనిచేస్తున్నారు కాబట్టి రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా అన్ని అర్హతలు వారికి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ దీనావస్థలో ఉందన్నారు. ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులకు కూడా ఎన్నికలు నిర్వహించాలని, ఔటా అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాపరిరక్షణ సమితి కన్వీనర్ డా.అందే సత్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్, ఆర్టీసీ రంగాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటాలకు రెగ్యులర్ ఉద్యోగ సంఘాలు మద్దతు ఇవ్వడంతో.. వారిని రెగ్యులరైజ్ చేసినట్టు గుర్తు చేశారు.

పట్టుదలతో, అకుంఠిత దీక్షతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమస్యలపై పదేపదే వీసీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లాలని, తన సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ.. జేఎల్‌డీఎల్ పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఎలాగైతే రెగ్యులరైజ్ చేస్తున్నారో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రామేశ్వర రావు అధ్యక్షత వహించగా.. డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ దత్త హరి, డాక్టర్ ఆర్‌డీ ప్రసాద్, డాక్టర్ సతీష్ చందూలాల్, శశిధర్, డాక్టర్ నారాయణ, డాక్టర్ సోమేశ్, డాక్టర్ హరీష్, డాక్టర్ నాగేశ్వరరావు, 11 యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ప్రజల గళం వినిపిస్తాం

- 30 నుంచి 35 రోజులు అసెంబ్లీ నిర్వహించాలి : సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాసమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎజెండాగా ప్రజల గొంతుకగా అసెంబ్లీలో గళం వినిపిస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నీళ్లు, నిధులు, నియామకాల సమస్యలన్నిటిని పరిష్కరించాలని ప్రస్తావిస్తామన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 30 నుంచి 35 రోజులపాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. గత ఎనిమిదేండ్లుగా నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు, రుణమాఫీ, పోడు భూముల సమస్యలు, ధరణి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటి స్థలాలు, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, పెట్రోల్ డీజిల్ ధరలు, పెంచిన కరెంటు చార్జీల తదితర అంశాలపై నిలదీస్తామన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత రెండేండ్లుగా మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులను కోత పెట్టిందని విమర్శించారు. కార్పొరేట్లకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాని చేసిన అతిపెద్ద ఆర్థిక నేరం గురించి కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రమంతా చేసే పాదయాత్రపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పాదయాత్ర చేయమని అధిష్టానం ఆదేశిస్తే కచ్చితంగా రాష్ట్ర మొత్తం పాదయాత్ర చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

పేదల పొట్ట కొట్టేందుకు బీజేపీ యత్నం: ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి పేదల పొట్టగొట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపు భారీగా తగ్గడమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం సంఘం ప్రతినిధులతో గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించిందని విమర్శించారు. దశల వారీగా ఉపాధి హామీ చట్టానికి బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉపాధి హామీ చట్టం అమలుకు కనీసం రూ.2.72 లక్షల కోట్లు అవసరం ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించడం దేనికి సంకేతమని ఆమె ప్రశ్నించారు.

గత తొమ్మిదేళ్లలో గ్రామీణ ప్రాంతాలలో కొత్తగా ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించని బీజేపీ ప్రభుత్వం, ఉన్న ఉపాధి కార్యక్రమాలను సైతం అమలు చేయడం లేదన్నారు. ప్రజలకు వీలైనంత ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరించడం లేదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధి హామీ చట్టం జేఏసీ చైర్మెన్ యలబద్రి లింగయ్య కో చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి , విజయ్ కుమార్ , రఘు , సర్దార్ సింగ్ , అంజి రెడ్డి , సుదర్శన్ మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

తీరిక లేకున్నా వచ్చా..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకస్మాత్తుగా గుండె ఆగిపోయిన వారికి తక్షణం కార్డియో పల్మనరీ రెససిటేషన్ (సీపీఆర్) ప్రక్రియతో బతికించవచ్చని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. గురువారం హైదరాబాద్ రాజ్‌భవన్ స్కూల్ సమీపంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్, గాంధీ మెడికల్ కాలేజ్ అలుమ్ని అసోసియేషన్ సంయుక్తాధ్వర్యం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె సీపీఆర్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్ ప్రాముఖ్యత తనకు తెలుసు గనుకే....తీరిక లేకుండా ఉన్నప్పటికీ వెసులుబాటు చేసుకుని వచ్చానని తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో 65 శాతం మంది ప్రజలు సీపీఆర్ ప్రక్రియలో శిక్షణ పొంది ఉన్నారనీ, మన దేశంలో ఇప్పటికీ రెండు శాతం మంది మాత్రమే ఈ శిక్షణ తీసుకున్న వారున్నారన్నారు. సీపీఆర్ ప్రక్రియ శిక్షణలో చాలా వెనుకబడి ఉన్నామని తెలిపారు. ఈ ప్రక్రియ సంక్లిష్టమైనదేమి కాదనీ, సామాన్యులు కూడా నేర్చు కోవచ్చని చెప్పారు. తాను విమాన, రైలు ప్రయాణాల్లో ఉన్న సమయం లో అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్న వారిని కాపాడిన ఉదంతాలను ఆమె చెప్పుకొచ్చారు. ఈ ప్రక్రియపై నేర్చుకోవడం ద్వారా అకస్మాత్తుగా గుండె పని చేయడం ఆగిపోయిన (కార్డియాక్ అరెస్ట్) అయిన వారిని కాపాడే అవకాశముంటుందని వివరించారు. సాటి మనుష్యులను జాగ్రత్తగా చూసుకుంటూ, ప్రేమిస్తూ, సంరక్షించే అలవాటు చేసుకోవాలని సూచించారు.

అలుమ్ని అసోసియేషన్‌ల బలోపేతం

యూనివర్సిటీల వారీగా అలుమ్ని (పూర్వ విద్యార్థుల) అసోసియేషన్లను బలోపేతం చేస్తున్నట్టు గవర్నర్ తమిళిసై తెలిపారు. ఈ పనిని రెండేండ్ల క్రితమే ప్రారంభించినట్టు చెప్పారు. అలుమ్ని వివరాలు తెలపాలని యూనివర్సిటీలను కోరితే వాటి వద్ద ఆ సమాచారం సంపూర్ణంగా లేదని చెప్పారు. మద్రాస్ మెడికల్ కాలేజీ తదితర కాలేజీల పూర్వ విద్యార్థిగా అక్కడ అలుమ్ని అసోసియేషన్‌తో కలిసి తాము ఎన్నో ఉపయోగకరమైన పనులు చేశామని తెలిపారు. ఆ అనుభవంతో తెలంగాణలోనూ అలుమ్ని అసోసియేషన్లను ఏర్పాటు చేసి, సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలనేది తన ఉద్దేశమని వివరించారు. యూనివర్సిటీలు వివరాలు తెలపకపోవడంతో తాను రాజకీయ నాయకులు చదువులను బట్టి వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులనిస్తూ అలుమ్ని అసోసియేషన్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సీపీఆర్ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

- పాశ్చాత్య దేశాల్లో 65 శాతం మందికి శిక్షణ పూర్తి
- మన దేశంలో రెండు శాతమే...: గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్

ప్రభుత్వానికి సూచనలు

సీపీఆర్ ప్రక్రియను ప్రతి విద్యార్థి నేర్చుకునేలా తప్పనిసరి చేయాలని తాను ప్రభుత్వానికి సూచిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. అంతకు ముందు గాంధీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ లింగమూర్తి, మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింగ్ రావు, అసోసియేషన్ సలహాదారు డాక్టర్ చంద్రశేఖర్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ట్రైనర్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు ప్రతి మెడికల్ కాలేజీలో సీపీఆర్ శిక్షణ పెట్టేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ కు వినతిపత్రం సమర్పించారు.

సీపీఆర్ డెమో

ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ సీపీఆర్ ప్రక్రియను ఎలా నిర్వహించాలో, ఛాతి మర్దన ఎలా చేయాలో డాక్టర్ రాజశేఖర్ వివరించారు. గవర్నర్ తమిళిసై డెమోలో కొంత సేపుండి తాను కూడా సీపీఆర్ ప్రక్రియను నిర్వహించి చూపించారు. అసోసియేషన్ పక్షాన గుండె ఆగిపోయిన సందర్భంలో ఉపయోగించాల్సిన ఎఇడీ మిషన్ ను గవర్నర్‌కు బహుకరించారు. ప్రజలు ఎక్కువ మంది ఉండే ప్రాంతాల్లో ఈ మిషన్ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

4,280 మంది మరణం

దేశంలో ప్రతి ఏడాది లక్ష జనాభాలో 4,280 మంది అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం ద్వారా ప్రాణాలొది లేస్తున్నారని డాక్టర్లు వివరించారు. వీరిని కాపాడేందుకు ప్రభుత్వాలు, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



జర్నలిస్టులకు ఇండ్లస్థలాలిస్తాం

- ఆరోగ్య కార్డుల సమస్యను పరిష్కరిస్తాం : హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు
- మంత్రులు సబిత, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావు చెప్పారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య కార్డుల సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయనీ, అందరికీ మేలు జరిగేలా ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో నిర్ణయం తీసుకుంటారని అన్నారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) నూతన సవంత్సరం డైరీని మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పి సబితా ఇంద్రారెడ్డి గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రుల దృష్టికి హెచ్‌యూజే నాయకులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో జర్నలిస్టుల ఆరోగ్య కార్డులను పూర్తిస్థాయిలో అనుమతించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బొల్లె జగదీశ్వర్, కోశాధికారి బి రాజశేఖర్, ఉపాధ్యక్షులు ఎం రమేష్, జాయింట్ సెక్రటరీ క్రాంతి, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మేలు చేయని కేంద్ర బడ్జెట్: ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్త్రీ, శిశు సంక్షేమానికి 0.5 శాతం మాత్రమే కేటాయించారనీ, మహిళలకు మేలు చేసే బడ్జెట్ కాదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళల భద్రత, హింసను నివారించటానికి నిధులు పెంచలేదనీ, క్రీడారంగంలో మహిళలకు నిధులు కేటాయించలేదని తెలిపారు. మహిళలు పొదుపు చేసుకున్న డబ్బులను సైతం కార్పొరేట్ సంస్థలకు మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. దీన్ దయాళ్ జాతీయ గ్రామీణ మిషన్‌కు 8.1 లక్షల పొదుపు గ్రూపులు అనుసంధానించారని తెలిపారు. దీన్ని ఇంకా అభివద్ధి పరిచి పెద్ద సంస్థగా రూపొందిస్తామని చెబుతున్నారని తెలిపారు.దీనివల్ల ప్రయివేటు సంస్థలే మహిళలకు రుణాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. వీటి నుండి మహిళలు తక్కువ వడ్డీకి రుణాలు పొందే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సమ్మాన్ పొదుపు పథకాన్నే ప్రకటించారనీ, ఇది ఎక్కువ మొత్తంలో పొదుపు చేసుకునే కొద్ది మంది మహిళలకు మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించే ఆర్థిక పథకాలేవీ పెద్ద ఎత్తున అప్పుల్లో ఉన్న మహిళలకు వర్తించవనీ, దీంతో వారు ప్రయివేటు ఫైనాన్స్ సంస్థలు, యమ్ఎస్ఐల ద్వారా ఎక్కువ వడ్డీలకు అప్పులు తీసుకుని మరింత అప్పుల్లో కూరుకుపోతారని తెలిపారు. 80 కోట్ల కుటుంబాలను సీఎం గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా సంవత్సరం పాటు ఉచిత ఆహారం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఆహార సబ్సిడీని 31శాతానికి కుదించిందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ, మౌలానా ఆజాద్, ఫెలోషిప్‌లకు కేటాయింపులు పెంచలేదని తెలిపారు. ఇది మహిళల విద్యపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే బడ్జెట్ ఇదనీ, మహిళలకు, వారి కుటుంబాలకు ఎటువంటి మేలు చేసేది కాదని విమర్శించారు.దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

21,12,136 మందికి కంటి పరీక్షలు

- సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 21,12,136 మందికి కంటి పరీక్షలు చేసుకోగా, వారిలో 4,59,335 మందికి రీడింగ్ కండ్లద్దాలను పంపిణీ చేసినట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు గురువారం కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 3,14,688 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ చేశారు. 13,37,945 మందికి ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు.

రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా....

- నోరు మెదపని బీజేపీ ఎంపీలు : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మెన్ కోలేటి దామోదర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీల ప్రస్తావన లేదనీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ తదితర హామీలను విస్మరించారని తెలిపారు.

మోడీ సర్కారుది కోతల బడ్జెట్

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే యత్నం

- సంక్షేమానికి నిధుల తగ్గింపు : సీఐటీయూ ఆన్‌లైన్ సభలో ప్రొఫెసర్ పాపారావు, ఎం.సాయిబాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ సర్కారు కోతల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందనీ, దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలను పరిష్కరించే దిశగా బడ్జెట్ లేదని ఆర్థికవిశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు టి.రాజారెడ్డి అధ్యక్షతన 2023-24 కేంద్ర బడ్జెట్ సీపీఎస్‌యూ భవితవ్యం అనే అంశంపై ఆన్‌లైన్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ..మోడీ సర్కారు సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను తగ్గించిందని విమర్శించారు. దీంతో సమాజంలో అంతరాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులను తగ్గించిందనీ, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించే ప్రయత్నాన్ని ఏమాత్రం చేయలేదని విమర్శించారు. రైల్వేలు, పోర్టులను కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నాలను మరింత తీవ్రం చేసిందని తెలిపారు. ఎల్ఐసీ, బ్యాంకులను నిలువునా ముంచేసిన అదానిని కాపాడే యత్నంలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. ఓవైపు కార్పొరేట్ల అనుకూల విధానాలను తీవ్రరూపం చేస్తూ మరోవైపు జాతీయవాదం ముసుగుతో దేశ ప్రజలను, యువతను బీజేపీ రెచ్చగొడుతున్న తీరును ఎండగట్టారు. వాస్తవానికి బీజేపీ విధానాలతో ఎక్కువ నష్టపోతున్నది పేద, మధ్యతరగతి ప్రజలేనని చెప్పారు. కొత్తపన్ను విధానం లాభాల కంటే నష్టాలను ఎక్కువ చేసేలా ఉందని చెప్పారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌ను ఎక్కడా పట్టించుకోలేదన్నారు. ఎంప్లాయిమెంట్ సృష్టి ప్రస్తావనే లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడకపోగా వాటని మరింత నిర్వీర్యం చేసే దిశగా మోడీ సర్కారు వెళ్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించబోతున్నాయని హెచ్చరించారు. ప్రజల దగ్గర పొదుపు లేకుండా చేసే పనికి మోడీ సర్కారు పూనుకున్నట్టు ఈ బడ్జెట్ ద్వారా అర్థం అవుతున్నదన్నారు.

ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు మాట్లాడుతూ.. ప్రజలు తాము దాచుకున్న సొమ్మును షేర్‌మార్కెట్‌లలో పెట్టేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. బంగారం కొనకుండా, డబ్బులను పొదుపు చేసుకోకుండా పేకాటలాగున్న షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేలా చేసే ఎత్తుగడలో భాగంగానే డీమానిటైజేషన్ చేసిందని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభాలన్నీ కలిసి ఓ పెద్ద సంక్షోభం వచ్చిందనీ, పెట్టుబడి దారీ వ్యవస్థపై అది తీవ్రస్థాయిలో ముట్టడిస్తున్నదని చెప్పారు. బడ్జెట్ అంటే అంకెలు, సంఖ్యలు కాదనీ, అదొక రాజకీయమని అన్నారు. ఉన్న వనరులేంటి? ప్రాధాన్యత అంశం ఏమిటి? ఎంత కేటాయించాలి? అనేది కీలకమన్నారు. అక్కడే వర్గదృక్పథం బయటపడుతుందన్నారు. మోడీ సర్కారు కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. పెట్టుబడిదారీ వ్యవస్థను నిలబెట్టే తోలుబొమ్మలాటలో మోడీ సర్కారు ఒకటని చెప్పారు. ధనికులకు మేలు చేయడం, పేదలను బానిసలుగా ఉంచడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలోనే దాగి ఉందని విమర్శించారు. అంతర్జాతీయ పెట్టుబడి దారుల ఒత్తిడి మేరకు ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు ఉందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, బి.మధు హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జె.రాఘవరావు పాల్గొన్నారు.

మూకదాడులకు తెగబడుతున్న మతోన్మాదులు

భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం

- మల్లిఖార్జున్‌పై కేసును ఎత్తివేయాలి
- ప్రభుత్వం స్పందించాలి : యూఎస్‌పీసీ ధర్నాలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


మతోన్మాదుల మూక దాడులను అరికట్టాలనీ, లేదంటే భావ ప్రకటనా స్వేచ్ఛకే భంగం వాటిల్లే అవకాశముందని యుఎస్‌పీసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం మల్లికార్జున్‌పై జరిగిన మతోన్మాద మూక దాడికి వ్యతిరేకంగా గురువారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యం లో మహాధర్నా జరిగింది. యుఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, వై అశోక్ కుమార్, ఎం సోమయ్య, కె భిక్షపతి, బి కొండయ్య అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎ నర్సిరెడ్డి మాట్లాడుతూ.... భారత రాజ్యాంగం ప్రకారం, దాని విలువల ప్రకారం చదువు చెప్పాల్నా వద్దా? చదువు చెప్పేవారిపై కొంతమంది సంఘ వ్యతిరేక శక్తులు మూక దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వము నిర్లక్ష్యంగా ఉండటం సరైంది కాదని చెప్పారు. ఇదే కొనసాగితే ప్రభుత్వ మనుగడకు కూడా ప్రమాదమేనని హెచ్చరించారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తూ, శాస్త్రీయ దృక్పథాన్ని సహించలేని మతోన్మాద శక్తులు చెలరేగి పోవడాన్ని ప్రతిఘటించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, సామాజిక , విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ రాజకీయాలు మతపరం కాకుండా ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగ పరంగా ప్రజల .సామాజిక, ఆర్థిక, అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఇటువంటి దాడులు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్యానికి , సమానత్వానికి ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వీటన్నింటి వెనుక సంఘ్ పరివార్ శక్తులు ఉన్నాయని చెప్పారు. మల్లికార్జున్ పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.బడుల్లోకి విధ్వంసకర శక్తుల చొరబాటు అనేది రాజ్య యంత్రాంగ వైఫల్యమే కాకుండా పరోక్షంగా వారికి సహకరించడమేనని అభిప్రాయ పడ్డారు. మతాన్ని నమ్మే స్వేచ్ఛ ఉన్నట్టే.. నమ్మకుండా ఉండే హక్కు కూడా అంతే ఉందన్నారు. శాస్త్రీయంగా బోధన చేసే ప్రజా స్వామిక వాతావరణం కోసం పోరాడాలన్నారు. అకడమిక్ స్వేచ్ఛ లేని ఉపాధ్యాయ వృత్తికి అర్థం లేదనీ, దానికోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ధర్నాలో బాధిత ఉపాధ్యాయుడు ఎం మల్లికార్జున్, స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ టి రమేష్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు, ప్రొ చక్రధర్ రావు, ప్రొ కాశిం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె రమ, నాస్తిక సంఘం అధ్యక్షులు జీడి సారయ్య, కుల నిర్మూలనా సంఘం నాయకురాలు గుత్తా జోత్స్న, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, పీడబ్ల్యు అధ్యక్షులు జి ఝాన్సీ , స్వరూప,స్వేచ్ఛ జేఏసీ నాయకులు హన్మంతరావు, జనార్దన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్, రామకృష్ణ, ప్రదీప్, యుఎస్‌పీఎస్‌సి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎం రవీందర్, టి లింగారెడ్డి, వై విజయకుమార్, ఎస్ మహేష్, పి మాణిక్ రెడ్డి, ఎం రఘుశంకర్ రెడ్డి, పి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ రెండో చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

వివరించింది. ఇప్పటికే సమీర్ మహేంద్రు స్టేట్‌మెంట్‌లో కేజ్రీవాల్ పేరు వెల్లడైంది. కాగా ఈడీ చార్జిషీట్‌లో మరోసారి ఎమ్మెల్సీ కవిత పేరు ప్రస్తావించారు. ఇప్పటికే విచారించిన వారిలో, అలాగే ఆధారాలను ధ్వంసం చేసిన వారిలో కూడా కవిత పేరును ప్రస్తావించారు. ఢిల్లీ ఒబెరాయ్ హోటల్‌లో జరిగిన సమావేశాల్లో కవిత పాల్గొన్నట్లుగా ఈడీ అధికారులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. 2022 నవంబర్ 12న అరుణ్‌పిళ్లైని విచారించినప్పుడు కవిత గురించి తెలిసిందని, ఢిల్లీ ఒబెరాయ్ హోటల్‌లో కుట్రకు సంబంధించిన వ్యవహారమంతా జరిగిందని,ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి, ఢిల్లీలో మద్యం షాపులు.. ముఖ్యంగా ఎల్1 షాపులను దక్కించుకునేలా పావులు కదిపారని ఈడీ తెలిపింది. కవిత ప్రత్యేక విమానంలో పలుమార్లు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వచ్చారని పేర్కొంది. లంచం ఇచ్చే వ్యవహారాన్ని కవిత పర్యవేక్షించి పని పూర్తయ్యేలా చేశారని ఈడీ ఆరోపించింది. ఢిల్లీలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీకి మద్యం టెండర్ల కోసం రూ.100 కోట్లు లంచంగా చెల్లించారనీ, ఇందుకు అరుణ్ పిళ్లై.. కవితకు సంబంధించిన వ్యక్తిగా ఇండో స్పిరిట్స్‌లో పార్ట్‌నర్‌గా చేరారని తెలిపింది. ఈ సమయంలో కవిత ఉపయోగించిన రెండు ఫోన్ నెంబర్లను ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ నెంబర్లను ఏ ఏ సమయంలో ఉపయోగించారో కూడా తేదీల వారీగా ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. సమీర్ మహేంద్రు రూ.295.45 కోట్ల మేర నేరానికి పాల్పడ్డారనీ, ఈ మేరకు సాక్ష్యాధారాలు లభించాయని ఈడీ పేర్కొన్నట్టు కోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ ఇప్పటికే నిందితుల ఆస్తులు అటాచ్ చేసింది. వ్యాపారవేత్త సమీర్ మహేంద్రు, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన విజయ్ నాయర్ ఇళ్లను అటాచ్ చేసింది. అలాగే దినేష్ అరోరా రెస్టారెంట్‌ను, అమిత్ అరోరా ఆస్తులను కూడా అటాచ్ చేసింది. ఈ కుంభకోణం కేసులో దక్షిణాది నుంచి ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కొందరు నేతలకు హవాలా మార్గంలో ముడుపులు అందినట్టు కూడా ఈడీ పునరుద్ఘాటించింది.

ఈ కేసులో ప్రధాన నిందితుడు(ఏ1)గా సమీర్ మహేంద్రు ఉండగా.. మద్యం వ్యాపారి బినయ్ బాబు, అమిత్ అరోరా, దక్షిణాదికి చెందిన విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, పి.శరత్ చంద్రారెడ్డిలను అరెస్టు చేసిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి మనీశ్ సిసోడియాతో పాటు 14 మందిని నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్టు గుర్తు చేసింది.



డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్

కార్మికుల వేతనాలు చెల్లించాలి

- గిరిజన హాస్టల్ వర్కర్ల వేతనాల కోసం శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తా : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ - అదిక్ మెట్


గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన హాస్టల్ వర్కర్ల వేతనాల కోసం శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తానని చెప్పారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గురువారం చేపట్టిన నిరాహార దీక్షలో నర్సిరెడ్డి మాట్లాడారు. 39 నెలలుగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం దురదృష్టకరమని, అత్యంత చిన్న స్థాయి కార్మికులు, ఆదివాసీ గిరిజనులు శ్రమ చేసినా వేతనాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలకు సంబంధించి ఆర్థిక శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రూ.9 కోట్ల 15 లక్షల చెక్కుకు వెంటనే క్లియరెన్స్ ఇచ్చి కార్మికులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డైలీ వేజ్ కార్మికులకు సంబంధించిన రూ.13 కోట్ల 65 లక్షల వేతనాల బడ్జెట్‌పై ఆర్థిక శాఖ విధించిన ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన కార్మికులను నియమించాల్సిన గిరిజన విద్యాశాఖలో డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ పేరుతో నియమించడం అన్యాయమని, అలాంటిది వారి వేతనాలు పెండింగ్ పెట్టడం దారుణమన్నారు. వీరందరికీ చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. పర్మినెంట్ చేయడంతో పాటు నెలనెలా వేతనాలు చెల్లించే విధంగా శాసనమండలిలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. కార్మికుల పోరాటానికి అండగా ఉంటానన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లా డుతూ.. గిరిజన కార్మికుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపటం తగదని, హాస్టల్ వర్కర్స్‌అందరికీ లాక్‌డౌన్ కాలానికి పూర్తిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 212ను, జీవో నెంబర్ 16ను సవరించి హాస్టల్ వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని కోరారు. హాస్టల్ వర్కర్లను మాత్రం 39 నెలలుగా పస్తులు



ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫామ్ బట్టలు, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే మార్చిలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య ప్రసంగించారు. కార్మికులు సమ్మె చేయడం మూలంగా విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులం దరినీ పోరాటాల్లోకి తీసుకొస్తామని హెచ్చరించారు. గిరిజన కార్మికులకు ఉపాధ్యాయులు అండగా ఉంటారని చెప్పారు. నిరాహార దీక్షకు హాస్టల్ డైలీ వేజ్ అవుట్ సోర్సింగ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు నాయకత్వం వహించారు. వర్కింగ్ ప్రెసి డెంట్ సురేందర్, వివిధ జిల్లాల నాయకులు హిరా లాల్, పద్మ, సంగ్యా నాయక్, రవి, సుమిత్ర, నిలయ్య, అనురాధ, అనిత భాయ్, లక్ష్మణ్ నాయక్, యూటీ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య దీక్షలో ఉన్న నాయ కులకు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మచారి, రాజేందర్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ అధ్యక్షులు లెనిన్, హాస్టల్ వర్కర్స్ నాయకులు జోడి లక్ష్మి, రమేష్, బాబు సింగ్, ఇ.పద్మ , వివిధ జిల్లాల నుంచి హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్లో రూ.5వేల కోట్లు కేటాయించాలి

- కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2023 - 24 బడ్జెట్‌లో కల్లుగీత కార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లం కొండ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వీరికి ఎలాంటి ఆధారం లేదని పేర్కొన్నారు. ప్రమాదమని తెలిసి కూడా బతుకుతెరువు కోసం వృత్తిని చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది 550 మంది ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారి పడ్డారనీ, వీరిలో 90 మంది చనిపోయారని తెలిపారు.460 మంది వికలాంగులయ్యారని పేర్కొన్నారు.వీరికి ఎలాంటి రుణ సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించినట్టు చెప్పి, ఒక్క పైసా ఖర్చు చేయలేదని గుర్తుచేశారు.

కార్పొరేట్ శక్తుల అనుకూల బడ్జెట్



- మోడీ మాటలలో నక్కకు నాగలోకానికి తేడా
- బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు సమరశీల పోరాటాలు : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ - నల్లగొండ

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మాత్రమే అనుకూలమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ పేదరికాన్ని రూపుమాపేదిగా లేదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. వ్యవసాయంలో సంక్షోభాన్ని నివారించే విధంగా కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. మోడీ మాటలు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల రుణమాఫీకి రూ.11లక్షల కోట్లను మంజూరు చేయగలిగింది కానీ, రైతుల సంక్షేమం కోసం నాలుగు లక్షల కోట్లను కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. గత బడ్జెట్‌కు ఈ బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే.. వ్యవసాయ రంగానికి కేటాయింపులు రూ.28 వేల కోట్లు, ఎరువుల సబ్సిడీలో రూ.50వేల కోట్లకు కోతలు విధించారన్నారు. పంటల బీమా పథకానికి 12 శాతం, ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకానికి 13 శాతం కేటాయింపుల్లో తగ్గించారన్నారు. విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని, పంటకు కనీస మద్దతు ధర, క్రాప్ ఇన్సూరెన్స్‌కు కేటాయింపులు లేవన్నారు. పేద, మధ్యతరగతికి ఏమాత్రం ప్రయోజనం లేదని విమర్శించారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం కోసం రైతులు ఉద్యమిస్తున్న తరుణంలో బడ్జెట్లో ఆ ప్రస్తావన లేదని వాపోయారు. ప్రధాని మోడీ రైతాంగ ద్రోహిగా ఎప్పటికీ మిగిలిపోతారన్నారు. దేశాన్ని అప్పుల కుప్పగా మార్చే కుట్ర చేస్తున్నారన్నారు. మోడీకి నిజాయితీ ఉంటే ఇప్పటికైనా అదానీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన వాటాను గణనీయంగా తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం రాష్ట్రాల నుంచి వచ్చే పన్నుల్లో కేంద్రం 42శాతం తిరిగి రాష్ట్రాలకు ఇవ్వగా.. ఇప్పుడు దాన్ని 41 శాతానికి తగ్గించిందన్నారు. తెలంగాణకు కేవలం 2.133 శాతం మాత్రమే తిరిగి వస్తోందని.. అది కూడా సకాలంలో కేంద్రం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర నదులపై కేంద్రం బోర్డులు వేసి, తన ఆధీనంలోకి తీసుకుందని ఆరోపించారు. మంజూరు చేసిన రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు తగ్గిందని, దశాబ్దాల తరబడి మంజూరైన కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. రాష్ట్రంపై కేంద్రం కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తున్నట్టు ఈ బడ్జెట్‌లో స్పష్టమైందన్నారు. 2022-23లో ఉపాధి హామీ చట్టానికి రూ.89,400 కోట్లు కేటాయించగా.. ఈ బడ్జెట్‌లో రూ.60,000 కోట్లకే పరిమితం చేశార న్నారు. ఆహార సబ్సిడీ, గ్యాస్‌పై సబ్సిడీని కూడా తగ్గించారన్నారు. ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ప్రతి ఒక్కరూ సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ICICI Bank రిజిస్టర్డ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ఐసిఐసిఐ బ్యాంక్ టవర్, చాక్లీ సర్కిల్ దగ్గర, ఓల్డ్ పాద్రా రోడ్డు, వడోదరా, గుజరాత్. పిన్- 390 007.
కార్పొరేట్ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా(ఈస్ట్), ముంబయి-400 051.
రీజినల్ ఆఫీస్: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, ప్లాట్ నెం.12, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి, హైదరాబాద్- 500 032.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన
(రూల్-8(1) ప్రకారం) (స్థిరాస్తి కోసం)

తనఖాపెట్టినవారి యొక్క స్థిరాస్తి యొక్క వివరాలు:
షెడ్యూల్-ఏ ఆస్తి యొక్క వివరాలు:
షెడ్యూల్-బి ఆస్తి:

తేది : 03 ఫిబ్రవరి, 2023 | అధీకృత అధికారి
ప్రదేశం : హైదరాబాద్ | ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ప్రిన్సిపాల్ ద్వారానే

కాంట్రాక్టు అధ్యాపకులకు జీతాలు

- 61 ఏండ్ల వరకు కొనసాగింపు : నవీన్ మిట్టల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల జీతాలను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ద్వారానే ప్రొసీడింగ్ చేసుకోవచ్చంటూ ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులను 61 ఏండ్ల వరకు కొనసాగించాలని తెలిపారు. ఈ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, తెలంగాణ రైతు బంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌కు టిగ్లా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జంగయ్య, మాచర్ల రామకృష్ణగౌడ్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం-475 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్ ధన్యవాదాలు తెలిపారు.

సంపాదకీయం

తైవాన్ పేరుతో చైనాపై అమెరికా దాడి!

తిట్టే నోరు, తిరిగే కాలు ఊరికే ఉండవు. ఎప్పుడూ ఏదో ఒకటి కల్పించుకోకపోతే వాటికి తోచదు. ఉన్మాదులు అది మతం లేదా యుద్ధోన్మాదులు ఎవరైనా సరే వారంతే. ప్రపంచం మీద పెత్తనం తద్వారా తమ కార్పొరేట్లకు లాభాలను తేవటం సామ్రాజ్యవాదుల నిరంతరపని. తమ సరకులకు మార్కెట్ కోసం భారత్‌కు సముద్ర మార్గం కనుగొనాలంటూ నాటి కొలంబస్‌ను సముద్ర యాత్రకు పంపిన స్పెయిన్ పాలకుల మొదలు నేటి అమెరికా ఏలికల వరకు చేస్తున్నది అదే. ఇప్పుడు కొలంబస్‌లతో పని లేదు. దేశాలను ఆక్రమించుకొనేందుకు అవకాశం అంతకన్నా లేదు. సామ్రాజ్యవాదులు గతంలో ప్రపంచాన్ని ఆక్రమించుకొనే క్రమంలో సృష్టించిన అనేక సమస్యలు, వివాదాలతో కొన్ని దేశాలు

> తైవాన్ ప్రాంతం చైనాలో అంతర్భాగమే అని ఐరాస గుర్తించిన సంగతి తెలిసిందే. అమెరికా కూడా ఒకే చైనాను అధికారికంగా గుర్తించి సంబంధాలు పెట్టుకున్న తరువాత ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో రక్తాన్ని చిందించటాన్ని అమెరికా సమాజం అంగీకరించే అవకాశాలు తక్కువ. అందువల్లనే జనంలో కూడా అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు అమెరికా నానా తంటాలు పడుతున్నది.

ఇప్పుడు సతమతమవుతున్నాయి. వాటిని సాకుగా తీసుకుని తమ అజెండాను అమలు జరిపేందుకు పూనుకున్న సామ్రాజ్యవాదులు అందుకోసం గిల్లికజ్జాలను పెట్టుకుంటున్నారు. అందుకు గాను ముందుగా తొత్తులను ప్రయోగిస్తారు.

చైనాలో విలీనం కావాల్సిన తైవాన్ గురించి రెచ్చగొట్టేందుకు ఇటీవల అమెరికా వేగంగా పావులు కదుపుతోంది. దానిలో భాగంగానే ఈ ఏడాది తొలిసారిగా తూర్పు ఐరోపా దేశమైన చెక్ రిపబ్లిక్‌ను పురికొల్పింది. అది హైదరాబాద్ మహా నగరానికి సమానమైన కోటి మంది జనాభా కలిగిన చిన్న దేశం. చైనాతో పోల్చుకుంటే దేనిలోనూ సరితూగలేదు. కానీ అమెరికా, ఐరోపా ధనిక దేశాల అండ చూసుకొని చైనాను గిల్లేందుకు పూనుకుంది. అక్కడ తాజాగా ఎన్నికైన అధ్యక్షుడు పీటర్ పావెల్ సోమవారం నాడు తైవాన్ పాలకురాలు శాయి లింగ్ వెన్‌తో ఫోన్లో మాట్లాడి తైవాన్ వేర్పాటు వాదానికి మద్దతు ప్రకటించాడు. గతంలో ఐరోపాలోని ఏ దేశ అధినేత కూడా ఇలా మాట్లాడలేదు. త్వరలో తాను స్వయంగా ఆమెను కలుసుకుంటానని చెప్పాడు. ఎన్నికల ప్రచారంలో కూడా ఆ మాట చెప్పినప్పటికీ ఎన్నిక తర్వాత అధికారికంగా మాట్లాడినదానికి తేడా ఉంటుంది.



తాము గీచిన గీతను కాలుతో చెరిపేందుకు చెక్ అధ్యక్షుడు పూనుకున్నాడని, చైనా పౌరుల మనోభావాలను గాయపరిచినట్లు చైనా ప్రతినిధి మావో నింగ్ ప్రతిస్పందించింది. చేసిన తప్పును సరిచేసుకొనేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని చైనా డిమాండ్ చేసింది. పీటర్ పావెల్ ఫోన్ సంభాషణ తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని చైనా విదేశాంగ శాఖలో ఐరోపా విభాగ అధిపతి వాంగ్ లుటోంగ్ ట్వీట్ చేశాడు. తైవాన్‌లో జోక్యం చేసుకొని సంబంధాలు నెలకొల్పేందుకు పూనుకున్న లిథువేనియాపై ఇటీవల చైనా ఆంక్షలు విధించింది. ఎన్నికల ప్రచారంలో విలేకర్లు అదే అంశాన్ని పావెల్‌తో ప్రస్తావించగా అయినా సరే ముందుకు పోతానని చెప్పాడంటే వెనుక పశ్చిమదేశాల అండ ఉండబట్టే అన్నది స్పష్టం. తైవాన్ పాలకురాలితో తాను మాట్లాడటం చైనాకు అంగీకారం కాదని తెలిసినప్పటికీ ఒక స్వతంత్ర దేశంగా తమకు ఎవరితో మాట్లాడేందుకైనా హక్కు ఉందని, తానేమీ విచారపడటం లేదని పావెల్ సమర్ధించుకున్నాడు. పావెల్ తైవాన్‌కు వెళ్లే ముందు చైనా స్పందనను పరీక్షించేందుకు మార్చి నెలలో చెక్ పార్లమెంటు స్పీకర్ తైపే వెళ్లనున్నట్లు వార్తలు.

ఇక అసలు సూత్రధారి అమెరికాను చూస్తే 2024లో అమెరికా అధ్యక్ష ఎన్నికలతో పాటు తైవాన్‌లో కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. అందువలన ఆ తరుణంలో చైనా ముందుకు పోవచ్చుని, 2025లో తైవాన్ పేరుతో చైనాపై దాడికి దిగేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జనరల్ మినిహాన్ చెప్పినట్లు జనవరి చివరి వారంలో వెల్లడైంది. ఈ అంశాన్ని అనధికారిక లీకుల ద్వారా వెల్లడించారు. రెండు సంవత్సరాల్లో తైవాన్ అంశంపై చైనాతో జరిగే యుద్ధానికి సిద్ధం కావాలని తన ఆధీనంలో నడిచే ఎయిర్ మొబిలిటీ కమాండ్ సిబ్బందితో చెప్పాడు. పోరు జరుగుతున్నపుడు యుద్ధ విమానాలకు ఇంధనం నింపే ప్రక్రియ గురించి జారీ చేసిన ఒక పత్రంలో దీని గురించి పేర్కొనట్లు ఒక టీవీ ఛానల్ పేర్కొన్నది. నిజానికిది అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు.2021లోనే అమెరికా పార్లమెంటుకు అమెరికా నౌకాదళ అడ్మిరల్ ఫిల్ డేవిడ్సన్ చైనా గురించి ఆందోళన వెల్లడిస్తూ 2027కు ముందే తైవాన్ స్వాధీనం జరుగు తుందని అందువలన దాన్ని అడ్డుకొనేందుకు అమెరికా వేగంగా కదలాలని పేర్కొన్నాడు. అనుకుంటున్నదాని కంటే ముందే ఎంతో వేగంగా తైవాన్ విలీన ప్రక్రియకు చైనా పూనుకొనే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ 2022లో చెప్పాడు.జనరల్ మినిహాన్ ఆసియా పసిఫిక్ కమాండ్ ఉప అధిపతిగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన తరువాత వైమానిక విభాగ అధిపతిగా బాధ్యతలు స్వీకరించాడు. అతనితో పాటు అనేక మంది మిలిటరీ అధికారులు కూడా సన్నాహాలు జరగాలని చెబుతున్నారు.

ఒక వైపు యుద్ధోన్మాదం మరోవైపు చైనాతో తలపడితే భారీ ప్రాణ నష్టం జరుగుతుందనే భయం కూడా అమెరికాలో ఉంది. వేల కిలోమీటర్ల దూరం వెళ్లి చైనా మీద టాంకులతో పోరుకు దిగటం సరికాదని, క్షిపణి, వైమానిక దాడుల మీద కేంద్రీకరించాలని సూచించేవారు కూడా ఉన్నారు. చైనాను దారికి తెచ్చేందుకు అవసరమైన నౌకలు, ఆయుధ నిల్వలకు పెట్టు బడులు పెట్టటం లేదని మాజీ నౌకా అధికారి సేత్ క్రాప్‌సే వంటి వారు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి గుంజాటనలు ఉండగా పౌరుల స్పందన గురించి భయం కూడా ఉంది. తైవాన్ ప్రాంతం చైనాలో అంతర్భాగమే అని ఐరాస గుర్తించిన సంగతి తెలిసిందే. అమెరికా కూడా ఒకే చైనాను అధికారికంగా గుర్తించి సంబంధాలు పెట్టుకున్న తరువాత ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో రక్తాన్ని చిందించటాన్ని అమెరికా సమాజం అంగీకరించే అవకాశాలు తక్కువ. అందువల్లనే జనంలో కూడా అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు అమెరికా నానా తంటాలు పడుతున్నది. అభూత కల్పనలతో ప్రచారదాడి జరుపుతున్నది. అనవసరంగా తమతో పెట్టుకుంటే తగిన శాస్తి చేస్తామని గతంలో చైనా అధినేత షీ జిన్‌పింగ్ హెచ్చరించిన సంగతి తెలిసిందే !



పేదల బడ్జెటా..పెద్దల బడ్జెటా?

> తెలంగాణలోని విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీతో పాటు ఆదిలాబాద్‌లో అపార సహజ వన రులను కలిగివున్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పునరుద్ధరణకు అవకాశమున్నప్పటికీ కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు.



- వనం నాగయ్య, 9441877695

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ పేదలను దోచి పెద్దలకు పెట్టేలా ఉన్నది. ఇది అంకెలగారడీ తప్ప అభివృద్ధికి ఉపయోగపడేలా లేదని విశ్లేషకులు అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. రూ.45లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆద్యంతం తెలుగు రాష్ట్రాలకు పెద్దగా ఒరగబెట్టిందేమీ లేదన్న వాదన విద్యావంతులు, మేధావుల నుంచి వ్యక్తమవుతోంది. తెలంగాణ లోని కొన్ని జిల్లాల్లో బడ్జెట్ ప్రతులను రోడ్లపై దహనం చేసి ప్రజలు తమ నిరసనలు తెలియజేస్తున్నారు. దేశానికి అన్నంపెట్టే రైతు సంక్షేమమే ధ్యేయంగా ఇటీవల కేసీఆర్ 'అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్..' అనే నినాదాన్ని దేశానికి సందేశంలా పంపారు. ఆ నినాదం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో మొన్నటి కేంద్ర బడ్జెట్‌ను చూసిన తరువాత ప్రజలకు అర్థమవుతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక, ఐటీ రంగాల్లో తెలంగాణ రాష్ట్రానికి చాలా వరకూ కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర నిరాశ కలిగించింది.ఇది తెలంగాణకు ఉద్దేశపూర్వకంగా చేసిన నష్టమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా బడ్జెట్‌ను నిశితంగా పరిశీలించిన వారికి అందులోని డొల్లతనం తెలుస్తుంది.

అన్నిరంగాల్లో కోతలే..

ప్రధానంగా దేశంలో సుమారు 60కోట్ల మందికి పైగా ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం అని హర్షం వ్యక్తం చేసిన కేంద్ర ప్రభుత్వం ఆ పథకానికి జాతీయ హోదాను కానీ, అందుకు సంబంధించిన చర్చ కానీ బడ్జెట్‌లో లేకుండా చేశారు. పాలమూరు ఎత్తిపోతలపై కూడా మాటలేకుండా పోయింది.ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఎరువులు, ఆహారం, పెట్రో ఉత్పత్తులపై భారీగా సబ్సిడీ కోత విధించి రాబోవు కాలంలో మరింత కష్టాలున్నాయని చెప్పకనే చెప్పారు. ప్రధానంగా ఎరువుల సబ్సిడీని రూ.2,25,220కోట్ల నుండి రూ.1,75,100 కోట్లకు కుదించారు. ఆహార రంగం విషయంలోనూ రూ.2,87,194కోట్ల సబ్సిడీని ఏకంగా 1,97,350 కోట్లకు, పెట్రో ఉత్పత్తులైన గ్యాస్, తదితర అంశాలపై రూ.9,171కోట్ల సబ్సిడీని రూ.2,257కోట్లకు కోత విధించారు. ఈ లెక్కన మొత్తం ఈ మూడు రంగాల్లోనే భారీగా 28శాతం సబ్సిడీలకు మంగళం పాడారు. తెలంగాణలో దాదాపు సగటున 55లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగుచేస్తున్నారు. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో పత్తి రైతులకు కష్టకాలంలో మద్దతుగా నిలవాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించింది శూన్యమనే చెప్పాలి. ఇక్కడ దేశీయంగా ఉత్పత్తి అవుతున్న పత్తిని కాదనీ, విదేశాల నుండి పత్తిని దిగుమతి చేసుకోవాలన్న తపన కనిపిస్తోందన్న చర్చ కూడా ఉంది. మద్దతు ధరను కూడా గత చరిత్రలో ఎన్నడూ లేనంతగా సున్నా చేశారు. క్రమక్రమంగా ఎంఎస్‌పీని కుదిస్తూ వచ్చారు. 2020-21 బడ్జెట్‌లో రూ. 2,288కోట్ల నిధులు కేటాయించిన కేంద్రం, 2022-23లో రూ.15కోట్లకు కుదించి తాజా బడ్జెట్‌లో ఏకంగా జీరో చేసింది.అంటే భవిష్య త్తులో మద్దతు ధరల విషయంలో ప్రతికూల పరిస్థితుల్లోనూ సాయం ఏమీ ఉండదనే సంకేతాన్ని పంపింది. తెలంగాణలోని విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీతో పాటు ఆదిలాబాద్‌లో అపార సహజ వన రులను కలిగివున్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పునరుద్ధరణకు అవకాశమున్నప్పటికీ కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు.

> మానవ వాదానికి బీజాలు విజ్ఞాన శాస్త్రంలోనే ఉన్నాయి. ఏ మతం లోనూ లేవు. అందుకే జ్ఞానాన్ని మత రహిత స్థాయికి తెచ్చుకోవాలి. ప్రాపంచిక దృక్పథంతో, విశాలభావాలతో మానవ జాతి అంతా ఒకటేనని జన్యుశాస్త్రం అందించిన "జ్ఞానాన్ని" స్వీకరిస్తే ప్రతి ఒక్కరూ మానవవాదులే అవుతారు.

> చిత్తశుద్ధి గల యువతీ యువకులు హేతు వాదులైతే, నిరీశ్వర వాదులైతే, సైన్సు కార్యకర్తలయితే... వారు రాజకీయంగా ఎదిగి అధికారం చేపట్ట గలిగితే ఈ ప్రపంచం రూపురేఖలు మారతాయి. అప్పుడే మానవత్వం వెల్లి విరిస్తుంది. మతాల పరిధిలో 'జ్ఞానాన్ని' గిరికీలు కొట్టి స్తున్న కుట్రను బద్దలు కొట్టి పైకి ఎదిగితేనే... ఎవరికైనా "జ్ఞానం - అంటే ఏమిటీ?" అనే జ్ఞానోదయం అవుతుంది.

'జ్ఞానాన్ని' మతరహిత స్థాయికి తేవాలి!

మతం చుట్టూ తిరిగేదే 'జ్ఞానం' అనే ఆలోచన సమాజంలో బాగా నాటుకు పోయింది. ఏ దేశమైనా, ఏ మతమైనా ఇదే భావనని జనంలో స్థిరపరిచాయి. కానీ, కాలం గడుస్తున్న కొద్దీ జ్ఞానానికీ మతానికీ దూరం పెరుగుతూ వచ్చింది. జ్ఞానం - ఏమతం చుట్టూ ప్రదక్షిణలు చేయదని సర్వ స్వతంత్రంగా ఎదుగుతుందని, తనను నమ్ముకున్న జనం ఎదుగుదలకు తప్పక తోడ్పడుతుందని తేలింది. మనిషి, మనిషిగా మారడానికి - మారి, నిలబ డడానికీ, నిలబడి ఎదగడానికీ జ్ఞానం... అంటే విజ్ఞానం - నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది. అతణ్ణి ఈర్ష్యా ద్వేషాల నుంచి, అసూయ ప్రతీకారాల నుంచి, మూఢ నమ్మకాల నుంచి బయట పడేసి, నైతిక జీవిగా కొనసాగడానికి దోహదం చేస్తుంది.



డాక్టర్ దేవరాజు మహారాజు

మానవ వాదానికి బీజాలు విజ్ఞాన శాస్త్రంలోనే ఉన్నాయి. ఏ మతం లోనూ లేవు. అందుకే జ్ఞానాన్ని మత రహిత స్థాయికి తెచ్చుకోవాలి. ప్రాపంచిక దృక్పథంతో, విశాలభావాలతో మానవ జాతి అంతా ఒకటేనని జన్యుశాస్త్రం అందించిన "జ్ఞానాన్ని" స్వీకరిస్తే ప్రతి ఒక్కరూ మానవవాదులే అవుతారు. విజ్ఞాన శాస్త్రాన్ని తన సృజనాత్మకతతో సాంకేతిక శాస్త్రంగా తీర్చిదిద్దుకోగల సామర్థ్యం కేవలం మనిషికే ఉంది. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచిని పెంపొందించడానికి

> ఇక్కడ భూమి మీద సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్లనే కొద్దిమంది పరిపాలకులు కోట్ల మంది జనాన్ని అదుపులో పెట్టగలుగుతున్నారు. మరి ఈ సాంకేతిక పరిజ్ఞానం దేవీ దేవతల మీద పనిచేయడం లేదు. ఎందుకంటారా? వారు నిజంగా ఉంటే పని చేసేది లేని వాళ్ళమీద ఎలా పనిచేస్తుందీ చెప్పండి?అయితే, అందుకు కారణం కూడా ఉంది. భ్రమ భ్రమలతో కలుస్తుంది. వాస్తవాలు వాస్తవాలతో మాత్రమే అతుకుతాయి.

మాత్రమే ఉపయోగించు కోవాలి. మనిషిలోని స్వార్థం వెర్రితలలు వేస్తే సాంకేతిక పరిజ్ఞానం మానవ వినాశనానికి దారితీస్తుంది. ఆ విషయం కూడా గుర్తుంచుకోవడం మంచిది. 'విజ్ఞానాన్ని, మత రహిత స్థాయికి ఎందుకు తీసుకుపోవాలి? మతం ఉంటే నష్టమేమిటి?' అని ఎవరైనా ప్రశ్నిస్తే అందుకు మనం ఈ విధంగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అబద్ధాలతో నిజాలు జత కట్టవు. వాస్తవాలు ఊహల్లో తేలిపోవు. ఊహల్లో తేలిపోతే తేలిపోవచ్చు... కానీ, అవి అప్పుడు వాస్తవాలుగా మిగలవు.

మత గ్రంథాలలో ఉన్న స్వర్గ నరకాలకు అడ్రస్‌లు లేవు. భూమి అడుగున ఉన్న పాతాళ లోకానికి వెళ్ళే సొరంగ మార్గం ఎవరికీ తెలియదు. లోకాలన్నింటినీ మోసే ఆదిశేషు పరిమాణం ఎంతో తెలియదు. దానిమీద పవళించే విష్ణుమూర్తి అతాపతా తెలియదు. శిలువెక్కిన ప్రభువు మొబైల్ నెంబరేమిటో తెలియదు. పరలోకం ఏ గుగూల్ మ్యాప్‌లోనూ దొరకదు. ఆకారమే లేని అల్లాయ కనీసం తన ఇమెయిల్ ఐడీ అయినా... ఎవరికైనా ఇచ్చాడా? ఇవ్వలేదే. శతాబ్దాలుగా భక్తులెవరూ తమ దేవీ దేవతల మొబైల్ నెంబర్లు సంపాదించలేకపోయారు. గ్రహాలన్నీ దేవతలకు నివాసాలని అంటారు కదా? మరి, రాకెట్లలో గ్రహాంతరయానం చేసే మన 'మానవ మాత్రులకు' వారు ఎక్కడా కనపడరెందుకూ? అయినా, గతంలో విశ్వసించినట్టు గ్రహాలు దేవతల నిలయాలని ఇప్పుడు ఎవరూ విశ్వసించడం లేదు. ఇక్కడ భూమి మీద సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్లనే కొద్దిమంది పరిపాలకులు కోట్ల మంది జనాన్ని అదుపులో పెట్టగలుగుతున్నారు. మరి ఈ సాంకేతిక పరిజ్ఞానం దేవీ దేవతల మీద పనిచేయడం లేదు. ఎందుకంటారా? వారు నిజంగా ఉంటే పని చేసేది లేని వాళ్ళమీద ఎలా పనిచేస్తుందీ చెప్పండి?

అయితే, అందుకు కారణం కూడా ఉంది. భ్రమ భ్రమలతో కలుస్తుంది. వాస్తవాలు వాస్తవాలతో మాత్రమే అతుకుతాయి. నిన్న రాత్రి నిద్రలో కన్న కలలు ఇవ్వాళ రాత్రికూడా కను - ప్రమాదం లేదు. కానీ, పొద్దున వాస్తవంలో మోటారు సైకిల్‌పై వెళుతూ రాత్రి కన్న కలలు కంటానంటే ఏక్సిడెంట్ అవుతుంది. నువ్వు బతికి ఉంటావో లేదో కూడా తెలియదు. ఒక వాస్తవాన్ని భ్రమలతో కలుపుతానంటే ఇలాగే ప్రమాదాలు జరుగుతాయి. వాస్తవాల ఆధారంగా బతికే వాడికే తనకు జ్ఞానం ఉందన్న స్పృహ ఉన్నవాడికే విజ్ఞానం అందుబాటులో కొస్తుంది. మతాల మాయలో పడితే తెలివి తేటలు కాదు గదా మూర్ఖత్వం అబ్బుతుంది! అప్పుడు అందుకు తగిన వేషం ఒకటి వేసుకుని ఎంచక్కా వ్యాపారం చేసుకోవచ్చు. సిగ్గూ ఎగ్గూ, నైతికత అన్నీ వదిలేసినవాడు ఇక ఏం చేస్తాడూ? తోటి మనుషుల్ని మోసం చేస్తాడు. అన్ని మతాల గురువులు, ప్రబోధకులు, ముల్లాలు, పాస్టర్‌లు, పురోహితులు, ప్రవచన కారులు చేస్తున్న పని ఇదే!

పాకే జంతువు నుండి పక్షిరావడం, వానరం నుంచి మనిషి రావడం అనేది వీరు తెలుసుకోరు. తెలుసుకున్నా అర్థం చేసుకోరు. ఆత్మజన్మ, పునర్జన్మల గూర్చిన పరిజ్ఞానమే 'జ్ఞానం' అని అనుకుంటూ ఉంటారు. మనిషి గుండెలో అంగుష్ఠ దేహం ఉంటుందనీ, మరణించినప్పుడు అది బ్రహ్మ రంధ్రం గుండా బయటికి పోతుందని నమ్మే వీరు, మనిషి కర్మానుసారం అతని చావు పుట్టుకలుంటాయని విశ్వసిస్తారు. అంతే కాదు, గత జన్మలో వారు చేసిన మంచీ చెడుల పర్యవసానంగానే వారి తల్లీదండ్రుల నిర్ధారణ జరుగుతుందని విశ్వసిస్తారు. ఆధునిక జన్యుశాస్త్రం చెప్పే వంశ పారంపర్య లక్షణాలు వీరికి విచిత్రంగా తోస్తాయి. ఒకరకంగా అలాంటి విషయాలు నమ్మాలంటేనే వీరికి ఇబ్బందిగా ఉంటుంది. విస్కీ తాగడం అలవాటయిన వాడికి కొబ్బరినీళ్ళు ఆరోగ్యానికి మంచిదని చెపితే వింటాడా? ఇలాంటి వారి వితండ వాదనలు చిత్ర విచిత్రాలుగా ఉంటాయి.

గతంలో బ్రాహ్మణార్యులు జనాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అని నాలుగు వర్గాలుగా విభజించారు. మానవ జాతి అంతా ఒకటే అయినప్పుడు ఈ విభజనలు



ఎందుకూ? అని మనమంటాం. అందుకు "మనుషుల్లో రక్తం గ్రూపులు నాలుగులేవా? అవి ఒక దానితో ఒకటి కలుస్తాయా?" అని ఎదురు ప్రశ్న వేస్తారు. నిజమే! ఆ అతి తెలివి ప్రశ్నకు సంతోషించాలో లేక ఏడవాలో అర్థం కాదు. ఇది ఒక తప్పు ప్రశ్న. ఎందుకంటే, రక్తం నాలుగు గ్రూపులు మనువాదులు విభజించిన ఆ నాలుగు వర్ణాల వారిలో కూడా ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో శూద్రుడి రక్తం బ్రాహ్మణుడికి ఇవ్వొచ్చు. క్షత్రియుడి రక్తం వైశ్యుడికీ ఇవ్వొచ్చు. ఎవరి రక్తం ఎవరికైనా ఇవ్వొచ్చు. కేవలం ఆ రక్తం గ్రూపు కలవాలి అంతే! అంటే ఏమిటీ? మనుషుల రక్తమంతా ఒక్కటే అని కదా? కుల మతాలకు, లింగ భేదాలకు అతీతంగా రక్తం ఒకరిది ఒకరికి ఇవ్వడం జరుగుతున్నప్పుడు మనుషుల్లో భేదం ఎక్కడుందీ? రక్తమార్పిడి ఖండాంతరంగా జరపొచ్చు. ఖండాంతర వివాహాలు చూస్తూనే ఉన్నాం. ఆ రకంగా జనులందరినీ విశ్వజనులుగానే పరిగణించాలి.

ఇటీవల వంద, రెండు వందల సంవత్సరాల చరిత్ర చూసుకుని మాది గొప్ప వంశం, మా కులం గొప్పది, మా మతం గొప్పది అని విర్రవీగడం హాస్యాస్పదమైన విషయం. ఇంకా వెనక్కి వెళ్ళి చూసుకుంటే వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు ఎక్కడ ఉండేవారో, ఎలా ఉండేవారో, ఎటు నుండి ఎటు వలస వెళ్ళారో, వారి మత విశ్వాసాలేవో, ఎవరు ఎవరిని పెండ్లి చేసుకున్నారో ఎవరికి తెలుసు? అందువల్ల ఏదో రెండు, మూడు తరాల వంశ చరిత్ర చూసుకుని విర్రవీగడం మూర్ఖత్వం అవుతుంది. ఇంకా కొంచెం వెనక్కి వెళితే, అందరమూ ఆ మహా మిశ్రమ మానవ జాతి నుంచి వచ్చిన వాళ్ళమేనని తెలుసుకుంటాం! మానవ వాదులుగా మారడానికి తెలుసుకోవల్సిన మొదటి అంశం - జ్ఞాన గుళిక ఇదే! ఈ విషయాలన్నీ ఇక్కడ ఎందుకు చెప్పుకుంటు న్నామంటే, తాము విశ్వ జనులమని భావించుకునే కొందరైనా కొంచెం భిన్నంగా ఆలోచిస్తారే మోనని..! మనుషులు ఇలా విభజింపబడి ఉండాల్సిందేనని గట్టిగా విశ్వసించే వారిని, అంధ విశ్వాసాల్లోనే వెలుగులున్నాయని భ్రమించే వారిని మనం ఉన్నఫళంగా ఏమీ చేయలేం. ఆలోచించుకోవడానికి వారికి కొంత సమయం ఇవ్వాల్సి ఉంటుంది.

శుభ్రత కావాలనుకునే వారికి శుభ్రతను ఇవ్వగలం. బురదలో దొర్లే వారిని ఏం చేయగలం? ఆ కంపు ఆ బురద సౌఖ్యంగా ఉందనుకునే వారికి ఏమని చెప్పగలం? మార్పు అంతర్గతంగా వారిలోంచే రావాలి. వారు తమ వివేకాన్ని కొద్ది కొద్దిగా ఉపయోగిస్తూ ఉంటే, తప్పకుండా మార్పు వస్తుంది. దీనివల్ల ఈ సమాజం ఈ ఇరవ ఒకటవ శతాబ్దంలోకి వచ్చిందో ముందు గ్రహించుకోవాలి. దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ, ఆధ్యాత్మికత, ధాన్యాల వల్ల రాలేదు. కేవలం వైజ్ఞానిక స్ఫూర్తితోనే, వైజ్ఞానిక పరిశోధనలతోనే వచ్చింది. ఇవే మనల్ని ఇంకా ముందుకు తీసుకుపోతాయి. మనిషి తను కష్టపడే తత్వాన్ని, నిజాయితీని, నైతికతను వదిలేస్తే ఎదురయ్యే ప్రమాదాలు చాలా ఉన్నాయి. వదిలేయకుండా ఉండగలగడమే జ్ఞానం!

పొరపాటున జనం పెత్తందారీ వ్యవస్థకు లొంగిపోతే గనక, తీరని నష్టాన్ని ఎదుర్కొవాల్సి వస్తుంది. ఇక్కడ మరొక పెద్ద ప్రమాదం పొంచివుంది. పెత్తందారీ సంస్కృతి గనక సాంకేతిక శాస్త్రాన్ని తన ఆధీనంలోకి తీసుకుంటే, అది మానవ స్వేచ్ఛనే హరిస్తుంది. అంతే కాదు, మానవ జాతిని తుదముట్టించే ప్రమాదం కూడా ఉంది. పరిస్థితులు అంతగా విషమిస్తే వటిని అదుపులోకి తేవడానికి అసలు మనిషే ఉండడు కదా? విజ్ఞాన శాస్త్రం రెండంచుల కత్తి లాంటిది. ఎటు వాడుతున్నాం? ఎంత వాడుతున్నాం?

> వాస్తవాల ఆధారంగా బతికే వాడికే తనకు జ్ఞానం ఉందన్న స్పృహ ఉన్నవాడికే విజ్ఞానం అందుబాటులో కొస్తుంది. మతాల మాయలో పడితే తెలివి తేటలు కాదు గదా మూర్ఖత్వం అబ్బుతుంది! అప్పుడు అందుకు తగిన వేషం ఒకటి వేసుకుని ఎంచక్కా వ్యాపారం చేసుకోవచ్చు. సిగ్గూ ఎగ్గూ, నైతికత అన్నీ వదిలేసిన వాడు ఇక ఏం చేస్తాడూ? తోటి మనుషుల్ని మోసం చేస్తాడు. అన్ని మతాల గురువులు, ప్రభోదకులు, ముల్లాలు, పాస్టర్‌లు, పురోహితులు, ప్రవచన కారులు చేస్తున్న పని ఇదే!

ఎలా వాడుతున్నాం? వంటి తెలియాలి. విజ్ఞాన శాస్త్రాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకోవడమే జ్ఞానం. దీని మీద మత ఆధిపత్యం ఉండకూడదు. ఎందుకంటే, గతంలో ముక్కు మూసుకుని చేసిన తపస్సుల వల్ల ఎవరూ ఏమీ సాధించలేదు.

ఇక ముందు కూడా సాధించలేరు. సాధించారని చెప్పుకునే మహిమలు కేవలం అసత్యాలు మాత్రమే! ఆ పద్ధతులు మానేసి మనిషి తనలోని స్వార్థాన్ని, కుత్సిత బుద్ధిని తగ్గించుకుంటే సత్వరం ఇంకా మంచి ఫలితాలు వస్తాయి. చిత్తశుద్ధి గల యువతీ యువకులు హేతు వాదులైతే, నిరీశ్వర వాదులైతే, సైన్సు కార్యకర్తలయితే... వారు రాజకీయంగా ఎదిగి అధికారం చేపట్ట గలిగితే ఈ ప్రపంచం రూపురేఖలు మారతాయి. అప్పుడే మానవత్వం వెల్లి విరిస్తుంది. మతాల పరిధిలో 'జ్ఞానాన్ని' గిరికీలు కొట్టి స్తున్న కుట్రను బద్దలు కొట్టి పైకి ఎదిగితేనే... ఎవరికైనా "జ్ఞానం - అంటే ఏమిటీ?" అనే జ్ఞానోదయం అవుతుంది.

> పొరపాటున జనం పెత్తందారీ వ్యవస్థకు లొంగిపోతే గనక, తీరని నష్టాన్ని ఎదుర్కొవాల్సి వస్తుంది. ఇక్కడ మరొక పెద్ద ప్రమాదం పొంచివుంది. పెత్తందారీ సంస్కృతి గనక సాంకేతిక శాస్త్రాన్ని తన ఆధీనంలోకి తీసుకుంటే, అది మానవ స్వేచ్ఛనే హరిస్తుంది.

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

2023-24 వ్యవసాయ బడ్జెట్‌లో కోతలు

బడ్జెట్ 2023-24ను పార్లమెంట్‌లో ప్రవేశపెడుతూ ప్రపంచంలోనే భారతదేశంలో వ్యవసాయ రంగానికి నిధులు పెద్ద ఎత్తున కేటాయించామని, సేంద్రియ వ్యవసాయంలో ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉన్నామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. బడ్జెట్ ప్రవేశ పెడుతున్న సందర్భంగా బిజెపి ఎంపీలు పదేపదే బల్లలు చరిచారు. సంతోషం వ్యక్తం చేశారు.కానీ గతేడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తగ్గించిన సందర్భంలో కూడా బల్లలు చరవడం విచారకరం.2023 బడ్జెట్‌లో ఉన్న పద్దులను రివైజ్డ్‌లో తగ్గించారు. ఆ ప్రాతిపదికన 2023-24కు బడ్జెట్ కొంత పెంచినట్టు చూపారు. వాస్తవానికి వ్యవసాయ బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ రూ. 71,379 కోట్లు, ఇతర ఆర్థిక సంస్థలకు (వడ్డీమాఫీ)కి రూ. 21,050 కోట్లు, ఉత్తర రాష్ట్రాలకు సహాయంగా రూ. 11,552.35 కోట్లు, రాష్ట్రాలకు 8,326.57 కోట్లు కేటాయింపులు చూపారు. ఈ పథకాలు తొలగిస్తే వ్యవసాయరంగానికి కేటాయింపులే లేవు. గత బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 1. వడ్డీమాఫీ, 2. కిసాన్ సమ్మాన్, 3. ఫసల్‌బీమా, 4. మార్కెట్ జోక్యం పథకం, 5. పంటల సంవర్ధనకు స్పష్టంగా కేటాయింపులు చూపారు. ఈ సారి బడ్జెట్‌లో స్పష్టమైన వివరాలు ఇవ్వకుండా పంటల సంవర్ధన పేరుతో, ఆర్థిక సంస్థల పేరుతో పెద్ద మొత్తాలు కేటాయించారు. కిసాన్ సమ్మాన్ యేటా రూ.6,000లకు మరో రూ.2,000లు అదనంగా ఇస్తున్నానని ప్రకటించిన మోడీ అందుకు తగిన కేటాయింపులు బడ్జెట్‌లో చూపలేదు. రాబోయే ఎన్నికలకు ఉపయోగపడే బడ్జెట్‌గా దీనిని రూపొందించినప్పటికీ వ్యవసాయరంగానికి 2022-23 బడ్జెట్ కేటాయింపుల్లో రూ.1,24,000 కోట్లకు బదులు రాబోయే సంవత్సరం రూ.1,17,489 కోట్లకు తగ్గించారు. ఈ బడ్జెట్ వ్యవసాయ ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచదు. 6.35 కోట్ల ఎకరాలలో హార్టికల్చర్ వేసినప్పటికీ వాటికి తగిన నిధులు కూడా కేటాయింపులో చూపలేదు. 2022-23 సంవత్సరానికి వరి పంట విస్తీర్ణం 1.5 కోట్ల ఎకరాలు తగ్గింది. ఏటా పండుతున్న 12 కోట్ల టన్నుల బియ్యం ఈ సంవత్సరం 10.5 కోట్ల టన్నులకు పడిపోయినట్లు ముందస్తు అంచనాలు చెప్తున్నాయి. ప్రస్తుతం భారత దేశం నుండి ఎగుమతి అవుతున్న నూకలు, బియ్యాన్ని నిషేధించారు. వ్యవసాయోత్పత్తుల దిగుమతులు వంటనూనెలు, పత్తి, పప్పులు, పంచదారలను తగ్గించబోతున్నట్టు ప్రకటించలేదు. పైగా దిగుమతులపై సుంకాలు ఎత్తివేశామని చెప్తున్నారు. భారత దేశం ధనిక దేశాలకు దిగుమతి కేంద్రంగా తయారవుతున్నది. 140 కోట్ల ప్రజల ఆహార భద్రతను కాపాడాల్సిన ప్రభుత్వం వ్యవసాయానికి మొత్తం బడ్జెట్‌లో 3.2 శాతం మాత్రమే కేటాయింపులు చేసింది.



సారంపల్లి మల్లారెడ్డి
9666174897

పరిశోధన బడ్జెట్

వ్యవసాయ పరిశోధనలు అత్యంత కీలకం. 1965 నుండి 85 వరకు విస్తృతమైన వ్యవసాయ పరిశోధనలు చేసి దేశాన్ని ఆహారంలో స్వయం సమృద్ధం చేశారు. అలాంటిది దేశంలోని పరిశోధనలన్నింటిని మూసి వేసి విదేశాల నుండి విత్తన టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నాం. మ్యాన్‌శాంటో, బేయర్, డూపా యింట్, కార్గిల్, సిన్‌జెంట లాంటి కంపెనీలు అమెరికా, జర్మని, స్విట్జర్లాండ్ నుండి విత్తన టెక్నాలజీని దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడి వాతావరణానికి ఆ విత్తనాలు పనిచేయక మొలకెత్తడం లేదు. పరిశోధన కేటాయింపులు పరిశీలిస్తే ఐసిఎఆర్‌కు కేటాయించింది 5 వేల కోట్లకు మించలేదు. ఇందులో కూడా సిబ్బందికి వేతనాలు పోగా పరిశోధనలకు మిగిలేది అతి తక్కువ. పరిశోధనలు వ్యవసాయానికి ప్రాణత్యాగం వంటివి. కొన్ని పరిశోధనల ఫలితాలు 4, 5 సంవత్సరాల తరువాతగానీ రావు. సుదర్ఘీకాలం మారుతున్న వాతావరణానికి అనుకూలంగా నిరంతరం పరిశోధనలు కొనసాగించాలి. పరిశోధనల నిలుపుదల అంటే వ్యవసాయ రంగానికి ఆత్మహత్యా సదృశం లాంటిది. ప్రస్తుత కేటాయింపులకు రెట్టింపు కేటాయింపులు చేయాలి.

పశుసంవర్ధక శాఖ

ఈ శాఖ బడ్జెట్‌లో గత బడ్జెట్‌పై 400 కోట్లు మాత్రమే పెంపుదల చేశారు. గత బడ్జెట్‌ను రివైజ్డ్‌లో రూ.800 కోట్లు తగ్గించారు. దేశంలో పశు అభివృద్ధికి తగిన విధంగా బడ్జెట్ లేదు. డైరీ, చేపలు కూడా ఇందులోనే కలిసి ఉన్నాయి. ఆర్థికమంత్రి బడ్జెట్ సందర్భంగా చేపల అభివృద్ధికి రూ.6,000 కోట్లు కేటాయించినట్లు చెప్పడంతో అందరూ సంతోషించారు. కానీ, వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. డైరీ అభివృద్ధిలో భారత దేశం ప్రపంచంలోనే ముందున్నది. 28 కోట్ల టన్నుల పాల ఉత్పత్తితో ప్రథమ స్థానంలో ఉన్నాం. ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసి పాల ఉప ఉత్పత్తులను 3వ ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేయాలి. అలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ పశు సంవర్ధక శాఖకు నిధుల కేటాయింపు చాలా తక్కువగా ఉంది. పశు సంవదర్ధనకు రూ.2,650 కోట్లు మాత్రమే కేటాయింపు చూపారు. పాల అభివృద్ధికి రూ.849 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 837 కోట్లు కేటాయించారు. నేడు పాల ఉత్పత్తిపై, చేపల పరిశ్రమపై కోట్లాది మంది ఆధారపడి ఉండడమేగాక, పౌష్టికాహారంగా ఉపయోగపడే ఈ ఉత్పత్తులను విస్తృతంగా పెంచాలి. 70 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దళిత, గిరిజన, మైనార్టీ, బిసి వర్గాలలో 5 సంవత్సరాలలోపు పిల్లలు పౌష్టికాహార కొరత వల్ల నేటికి ఎక్కువ మంది మరణిస్తున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అర లీటరు పాల చొప్పున ప్రతిరోజు ఇవ్వాలి. అందుకు తగ్గిన బడ్జెట్‌ను కేటాయి ంచాలి. చేపల ఉత్పత్తి కూడా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. స్థానిక వినియోగాన్ని పెంచలేకపోతున్నాం. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం ఇందుకు ఆటంకంగా ఉంది. చేపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే 3వ అతిపెద్ద దేశంగా ఉంది. ప్రపంచ ఉత్పత్తిలో 8 శాతం ఉత్పత్తి భారత దేశంలోనే జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాలలో ఉత్పత్తి బాగా జరుగుతున్నది. ఎగుమతుల ద్వారా రూ.334.41 బిలియన్ రూపాయలు మారక ద్రవ్యం సంపాదిస్తున్నది. 7,516 కి.మి సముద్ర తీరం ఉంది. సముద్ర చేపలేగాక దేశీయ చేపలను కూడా పెద్ద ఎత్తున పెంచుతున్నాం. వీటిని మరింత ప్రోత్స హించడానికి తగిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి. 2.80 కోట్ల మంది ఈ వృత్తిపై ఆధారడి ఉన్నారు. కానీ, బడ్జెట్ మాత్రం కేటాయింపులలో నిరాశ పరిచింది. అందుకు భిన్నంగా ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి ప్రకటనల్లో పశుసంవర్ధక శాఖను బాగా అభివృద్ధిలోకి తెస్తున్నట్లు చెప్పారు. కానీ వాస్త వాలు వీటికి విరుద్ధంగా ఉన్నాయి. సహజ సంప దలను కూడా వినియోగించుకొని దేశా భివృద్ధికి తోడ్పడడానికి వ్యవసాయోత్పత్తులతో పాటు అనుబంధ రంగాలను కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. గొర్రెలు, మేకల పెంపకం, పందుల పెంపకం, బాతులు, కోళ్ళ పెంపకం లాంటి వాటి వల్ల గ్రామీణ ఉపాధిని జీవన ఆదాయాన్ని పెంచడానికి వీలు ఏర్పడుతుంది. జపాన్, స్విట్జర్లాండ్ లాంటి చిన్న దేశాలలో ఈ వృత్తులపైన ప్రజలకు ఆదాయం పెంచడమేగాక, పౌష్టికాహార లోపం లేకుండా చేశారు. తమ అవసరాలకు మించిన వాటిని మాత్రమే ఎగుమతులు చేస్తున్నారు. కానీ, భారత దేశం తన ప్రజలను పౌష్టికాహార లోపానికి గురిచేసి కార్పోరేట్ల లాభాల కోసం ఎగుమతులు చేస్తున్నది. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో కోతలు విధించారు. గత 8 సంవత్సరాలుగా మాటలు చెప్పడమే తప్ప ఆచరణలో ఏ వృత్తి అభివృద్ధిలోకి రాలేదు అనేది అంకెల ద్వారా తెలుస్తున్నది. విదేశీ సర్వే సంస్థలు కూడా భారత దేశ వ్యవసాయ దివాలా విధానంపై అనేక నివేదికలు రూపొందించాయి. అయినప్పటికీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రాథమిక రంగమైన వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో కనీసం 8 శాతం నిధులు కేటాయించాలి. అప్పుడే అనుబంధ రంగాలు అభివృద్ధిలోకి వస్తాయి.



రంగం	2021-22 వాస్తవం	2022-23 బడ్జెట్	2022-23 రివైజ్డ్	2023-24 బడ్జెట్
వ్యవసాయరంగం	114840	124000	110254	115531
పరిశోధనలు	8440	8513	8659	9504
పశు సంవర్ధకశాఖ	2584	3918	3105	4327

గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి



ఆరోగ్యానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్‌లో పిస్తా కూడా ఒకటి. ఇది శరీరాన్ని ఇన్ఫెక్షన్ నుంచి రక్షించడంతో పాటు మన గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్, కార్బోహైడ్రేట్స్, అమైనో ఆమ్లాలు, విటమిన్లు A, K, C, B-6, D, E, ప్రోటీన్, కాల్షియం, మాంగనీస్, ఫోలేట్, ఇతర డ్రై ఫ్రూట్స్ కంటే తక్కువ కొవ్వు, కేలరీలు ఉంటాయి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పిస్తా పప్పులను సాయంత్రం వేళ అల్పాహారంగా కూడా తినవచ్చు. దీనిలోని పోషకాల కారణంగా నిత్యం తినమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. మరి పిస్తా పప్పుల వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం..

జ్ఞాపకశక్తి: ఈ రోజుల్లో మతిమరుపు చాలా సాధారణం అయిపోయింది. పిస్తా పప్పుతో కొంతవరకు దీనిని అదుపులో ఉంచవచ్చు. ఇందులో చాలా ఖనిజాలు ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. మరింత చురుకుగా చేస్తాయి. పిస్తా తినడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.

గుండె ఆరోగ్యం: పిస్తా తినడం గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ప్రతిరోజూ కొన్ని పిస్తాపప్పులను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. గుండెను అన్ని ప్రమాదాల నుంచి కాపాడుతుంది. అందుకే వీటిని గుండెకు అనుకూలమైన ఆహారాలలో ఒకటిగా పరిగణిస్తారు.

క్యాన్సర్ ప్రమాద నివారిణి: పిస్తా తినడం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. క్యాన్సర్ నిరోధకంలో సహాయకారిగా పరిగణించే పిస్తాపప్పులో యాంటీ కార్సినోజెనిక్ మూలకాలు కనిపిస్తాయి. ఇవి క్యాన్సర్‌ని నివారించేందుకు తోడ్పడుతాయి.

ఎముకల బలోపేతం: బలమైన ఎముకలకు విటమిన్ డి, కాల్షియం అవసరం. ఈ రెండు పిస్తాపప్పులో ఉంటాయి. అటువంటి పరిస్థితిలో దీని రోజువారీ వినియోగం ఎముకలకు బలాన్నిస్తుంది. ఎముకలకు సంబంధించిన అన్ని వ్యాధుల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది.

కంటి ఆరోగ్యం: కండ్లు మన శరీరంలో అత్యంత ముఖ్యమైన భాగం. వీటి ద్వారానే మనం ప్రపంచాన్ని చూస్తాం. కాబట్టి వాటిని ఆరోగ్యంగా ఉంచడం చాలా ముఖ్యం. కంటికి మేలు చేసే A,E విటమిన్లు పిస్తాపప్పులో ఉంటాయి. కాబట్టి తరచుగా పిస్తా పప్పులను తీసుకోండి.

ఇట్ల చేద్దాం



రంగు పోయే దుస్తుల్ని ఇతర దుస్తులతో కలిపి నానబెట్టినప్పుడు లేదంటే వాషింగ్ మెషీన్‌లో ఉతికేటప్పుడు వాటి రంగు మిగతా వాటికి అంటుకోవడం సహజం. ముఖ్యంగా తెలుపు రంగు దుస్తుల విషయంలో ఎక్కువగా ఇలా జరుగుతుంటుంది. అయితే ఎంత ఉతికినా ఈ రంగు ఓ పట్టాన వదలదు. ఇలాంటప్పుడు ఒక చిన్న తెల్ల గుడ్డ ముక్క తీసుకొని.. దానిపై హెయిర్ స్ప్రే, రబ్బింగ్ ఆల్కహాల్ లేదంటే 90 శాతం ఆల్కహాల్ ఉన్న ఏదైనా ద్రావణం పోసి.. దాంతో మరక పడ్డ చోట పదే పదే తుడుస్తుండాలి. ఇలా చేయడం వల్ల క్రమంగా మరక వదిలిపోతుంది. ఆపై దీన్ని సాధారణంగా ఉతికి ఆరేస్తే సరిపోతుంది.

సమానత్వం వైపు పయనం



స్వయం ఉపాధి ఉమెన్స్ అసోసియేషన్ (సేవా)... ఇది ఒక మహిళల సమూహం. స్థానిక మహిళా సంఘాలకు లింగ అసమానతలపై అవగాహన కల్పించేందుకు... సమానత్వానికై పోరాడేందుకు కావల్సిన సహాయ సహకారాలు అందిస్తుంది. ముఖ్యంగా ఇండ్లల్లో పని చేసే గృహకార్మికులకు జాతీయ స్థాయిలో సమాన వేతనాలు కల్పించాలని, కార్మిక హక్కులు వర్తింప చేయాలని కృషి చేస్తుంది.

37 ఏండ్ల ఖుష్బూ గుప్తా... 2020లో సంభవించిన కరోనా లాక్‌డౌన్‌ల కారణంగా ఆమె భర్త ప్లాస్టిక్ బ్యాగ్‌లను విక్రయించే వ్యాపారాన్ని ఆపివేయవలసి వచ్చింది. ఆ సమయంలో ముగ్గురు పిల్లల తల్లిగా ఉన్న గుప్తా భారత దేశంలోని కోట్లాది మంది స్త్రీలలో ఒకరు. కుటుంబాన్ని పోషించుకోవడానికి గృహ ఆధారిత, గృహనిర్మాణ, వీధి వ్యాపార పనిలోకి వెళ్లింది.

సామాజిక భద్రత

గుప్తాకు స్వయం ఉపాధి ఉమెన్స్ అసోసియేషన్ (SEWA) నుండి సహాయం అందింది. 2020లో ఆమె చేరిన ఆ సంస్థ అప్పటికే 21 లక్షల మంది మహిళలను స్వయం ఉపాధి కల్పించింది. నేడు SEWA మద్దతుతో ఆమె సొంత కుట్టుమిషన్ కొనుక్కుంది. రోజుకు ఎనిమిది గంటలు పని చేస్తుంది. నెలకు రూ. 3500-4000 సంపాదిస్తుంది. ఇప్పుడు ఆమె కుటుంబ ఆదాయానికి గొప్ప సహకారి. SEWA వారి సహకార సేవింగ్స్ బ్యాంక్‌లో ఖాతాతో ప్రభుత్వ సామాజిక భద్రతను పొందుతుంది. ఇక్కడ ఆమె నెలవారీ పెట్టుబడి పెడుతుంది. భర్త ఆమెకు మద్దతు ఇస్తున్నాడు. తన సంఘంలో అజ్వాన్ బెన్ (ఇతర మహిళల నాయకురాలు)గా గౌరవించబడుతుంది. ఓ నివాదిక ప్రకారం అనధికారిక కార్మికులలో 50 శాతం మంది మహిళలు ఉన్నారని డేటా చూపిస్తుంది. అయితే భారతదేశ మొత్తం అనధికారిక శ్రామిక శక్తిలో మహిళలు 23 శాతం మాత్రమే ఉన్నారని అంచనాలు సూచిస్తున్నాయి. మహిళా అనధికారిక కార్మికులు పురుష అనధికారిక వేతన రేట్లలో సగం కంటే తక్కువ పొందుతున్నారు. ప్రధానంగా గృహ, గృహ ఆధారిత పనిలో, దాదాపు సగం మంది వారి కుటుంబాలలో ఏకైక జీవనోపాధిదారులు. అలాగే ఇల్లు, పిల్లలు, పెద్దల సంరక్షణకై అదనపు సమయాన్ని వెచ్చిస్తారు.

మహిళలు సంఘటితమైతే

సాధారణంగా మహిళలు సామాజిక సమస్యలు, భద్రత, మానసిక ఆరోగ్య సమస్యలతో అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. ఇటువంటి పరిస్థితుల్లో మహిళా అనధికారిక కార్మికులు తమను తాము సంఘటితం చేసుకుంటే అది వారికి బలం, సంఘీభావం, ధైర్యాన్ని ఇస్తాయి. దేశంలోని అతిపెద్ద మహిళల నేతృత్వంలోని సంస్థల్లో ఒకటైన SEWA వారి మనస్తత్వాలు, మార్గాలకు ఉదాహరణగా బ్రిడ్జ్‌స్పాన్ గ్రూప్ కమ్యూనిటీ ఆధారిత మార్పుపై తన నివేదికలో నమోదు చేసింది. ఈ విధానంలో స్థానిక సమూహాలు సామాజిక మార్పు కోసం పరిష్కారాల రూపకల్పన చేయడంలో చురుకుగా పాల్గొంటాయి. సోనా అశోక్‌బాయి సమతాని అనే 81 ఏండ్ల వీధి వ్యాపారి, మూడవ తరం SEWA సభ్యురాలు, కమ్లా హల్దార్ అనే 62 ఏండ్ల గృహ కార్మికురాలు, యూనియన్‌లో బోర్డు సభ్యురాలు. ఈ ముగ్గురూ SEWAతో కలిసి పని చేయడం వల్ల వారి జీవితాలు, కమ్యూనిటీలలో వారు చూసిన మార్పుల గురించి చెప్పారు.



వ్యవస్థలు మారుతున్నాయి

ఢిల్లీ అంతటా దాదాపు 30,000 మంది మహిళా వీధి వ్యాపారులు ఉన్నారు. SEWA ఢిల్లీలోని 8,300 మంది మహిళలకు ఉపాధి కల్పించింది. వారు తమ వస్తువులను ఐదు వర్క్‌సైట్‌లలో విక్రయించడానికి వీలు కల్పించారు. యూనియన్ ప్రయత్నాలు మొత్తం కమ్యూనిటీకి ఒక మైలురాయి విజయాన్ని అందించాయి. అందులో ఒకటి వీధి వ్యాపారుల చట్టం 2014. "2013, 2014లో మేము జంతర్ మంతర్‌తో పాటు అనేక మంది రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద ర్యాలీ చేసాము. ఎట్టకేలకు వీధి వ్యాపారుల బిల్లు ఆమోదం పొందింది. ఇప్పుడు మేము లైసెన్స్‌లను పొందుతున్నాము" అని సమతాని అన్నారు. SEWA సభ్యులు వెండింగ్ సర్టిఫికేట్‌ను పొందుతారు. ఇది వారిని వేధింపులు, తొలగింపు నుండి రక్షిస్తుంది. స్వేచ్ఛగా పని చేసుకుంటూ ఎక్కువ సంపాదించుకుంటారు. సాధారణంగా నెలవారీ లాభాలలో 30 శాతం పెరుగుదలను చూస్తారు. "మొదట పోలీసులు మా మాట వినేవారు కాదు. కానీ ఇప్పుడు మేము ఇప్పుడు మేము SEWA నుండి వచ్చాము అని చెబితే వారు మాకు సమావేశానికి సమయం ఇస్తారు" అని గర్వంగా పంచుకున్నారు.

స్థిరమైన జీవనోపాధి కోసం

SEWA ఢిల్లీలోని 50,000 మంది గృహ కార్మికులతో పని చేస్తుంది. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైన్‌పై శిక్షణను అందజేస్తుంది. వారికి వృత్తి నైపుణ్యాలను నేర్పిస్తుంది. ఢిల్లీలోని అనేక గార్మెంట్, టెక్స్‌టైల్ యూనిట్లకు వారిని లింక్ చేస్తుంది. "మేము ఇకపై ఎవరిపై ఆధారపడటం లేదు. మా గాజులు, బిందీలకు తగినంత డబ్బు సంపాదించగలుగుతున్నాము" అని గుప్తా అంటున్నారు. ఈ గుంపు నుండి సుమారు 350 మంది మహిళలు SEWA స్వంత నిర్మాణ కంపెనీ అయిన రుయాబ్‌లో పనిచేస్తున్నారు. ఇది బ్రాండ్‌లు, వినియోగదారులతో నేరుగా పని చేస్తుంది. మధ్యవర్తులను తొలగిస్తుంది. సురక్షితమైన జీవనోపాధిని నిర్ధారించడంలో సహాయపడుతుంది. మహిళా సేవా అర్బన్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అయితే ఆర్థిక చేరికలు, ఆస్తుల సృష్టి కోసం SEWA ఒక గ్రౌండ్ అప్ పరిష్కారాన్ని ప్రోత్సహించింది. ఇది ఇప్పుడు 8,000 మంది మహిళల పొదుపులను నిర్వహిస్తోంది. కుట్టు మిషన్ల వంటి ఆస్తులను కొనుగోలు చేయడానికి నెలకు 1.5 శాతం చొప్పున రుణాలను అందిస్తుంది.

సాధికారత ఏజెన్సీ

SEWA సభ్యులు తమ గుర్తింపును స్థాపించుకోగలిగారు. తమ స్వాతంత్ర్యాన్ని నొక్కిచెప్పగలరు, సవాళ్లను పరిష్కరించడానికి సామూహిక శక్తిని ఉపయోగించుకోగలిగారు. "మొదట నేను కేవలం నా బిడ్డకు తల్లిని, భర్తకు భార్యను. ఇప్పుడు నేను కార్మికురాలిని. నాకంటూ సొంత గుర్తింపు ఉంది" అంటున్నారు గుప్త.

యూనియన్ ఇలాంటి వారికి వెన్నెముకగా పనిచేస్తుంది. యజమానుల చేతుల్లో, ఇంట్లో కూడా అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భాల్లో వారికి సామూహిక శక్తిని అందిస్తుంది. "మాలో ఒక పెద్ద మార్పు ఉంది" అని ఆమె జోడించారు. "ఒకప్పుడు చాలా విడాకులు ఉండేవి. ఇప్పుడు అలాంటివి మహిళా మండల్ అనే SEWA స్థానిక మహిళా సామాజిక సేవా సమూహంకి నివేదించబడతాయని వారు భయపడుతున్నారు. ఇప్పుడు మాకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు మేము మా పరిష్కారాలను కనుగొంటాము. SEWA వారి కమ్యూనిటీలలోని మహిళల సామూహిక లక్ష్యాలు, అవసరాలను సూచించడానికి నాయకత్వాన్ని, శిక్షణ సభ్యులను కూడా ప్రోత్సహిస్తుంది. ఈ ఏజ్వాన్లు ఉద్యమాలను నిర్మించడానికి, నడిపించడానికి శిక్షణ



"ఇంతకుముందు నేను ఇంటి నుండి బయటకు కూడా అడుగు పెట్టలేదు. నెమ్మదిగా ఇక్కడ 300 నుండి 400 మంది వ్యక్తులు నా గురించి తెలుసుకున్నారు. నేను ఏమైనా చేయగలనని మా కుటుంబం చెబుతోంది. SEWA వారి బహుముఖ కమ్యూనిటీ ఆధారిత విధానం స్త్రీలకు సమానత్వం వస్తుందనే విశ్వాసాన్ని అందించింది. ఈ విశ్వాసమే వారికి కొత్త లక్ష్యాల గురించి కలలు కనడానికి సహాయపడుతుంది. వారికి ధైర్యాన్ని ఇస్తుంది" అని గుప్తా అన్నారు.

పొందుతారు. SEWA నాయకత్వంలో అరవై శాతం మంది స్థానిక నాయకుల సమూహాల నుండి ఎన్నుకోబడ్డారు.

శక్తిని అభివృద్ధి చేయడం

SEWA సభ్యులు ఎక్కువగా వారి కుటుంబాలతో చర్చలు జరపగలుగుతారు. సామాజిక స్థలాలను క్లెయిమ్ చేయగలరు. "వారు మనలను ఒంటరిగా అణచివేయగలరు. కానీ ఇప్పుడు మనలో 10 మంది వారిని ఎదుర్కోగలరు" అని హల్దార్ పంచుకున్నారు. ఇప్పుడు సమాజంలో తమకు లభించిన గుర్తింపు పట్ల వారు సంతోషిస్తున్నారు.

- సలీమ

అణగారిన వర్గాలకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

వేతనాలు కనిష్టస్థాయికి చేరుకోవటంతో అసమానతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయని, సమ్మిళిత అభివృద్ధి నమూనాలు ఎంచుకోవాలని 'నిటి ఆయోగ్' 2021లోనే ఒక నివేదిక ఇచ్చింది."ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, సఫాయి కార్మికులు, గిరిజనుల్లో పేదలు ఎక్కువగా ఉన్నారు. వీరికి భారత ఆర్థిక , సామాజిక రంగాలలో చోటు దక్కటం లేదు. ప్రభుత్వ, ప్రయివేటు సేవలు అందుబాటులో ఉండటం లేదు. నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉంది" అన్నది నిటి ఆయోగ్ నివేదికలోని సారాంశం. ఆర్థిక సంపద విషయంలో జాతీయ సగటు కన్నా దిగువన ఎస్సీ, ఎస్టీ, ముస్లిం సామాజిక వర్గాలున్నాయి. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను 2030 కల్లా సాధిస్తామని భారత్ ఐక్యరాజ్యసమితిలో ప్రకటించింది. ఈ లక్ష్య సాధనలో భారత్ ఎంత వరకు సాధించిందన్న దానిపైనా నిటి ఆయోగ్ ఒక స్కోర్ విడుదల చేసింది. తన వార్షిక నివేదికలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో దేశానికి 100కు 66 మార్కులు ఇచ్చింది.

అసమానతలు పట్టవా?

దేశంలో అసమానతలు పోవాలన్నా, పేదరికం పోవాలన్నా..సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమ విధానాలు తప్ప మరో మార్గం లేదు. తాజా బడ్జెట్ మాత్రం కీలకమైన ఈ అంశాన్ని విస్మరించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సామాజిక న్యాయం, సాధికారత, గిరిజన, మైనార్టీ సంబంధాలు, మహిళా శిశు అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయి. ఉదాహరణకు సామాజిక న్యాయం, సాధికారతకు 2021-22లో బడ్జెట్ అంచనాలు రూ.10517 కోట్లు. వాస్తవ వ్యయం రూ.7435 కోట్లే. 2022-23లోనూ 11,922 కోట్లు ప్రకటించి, అందుకు అనుగుణంగా వ్యయం చేయలేదు. తాజా బడ్జెట్‌లో (2023-24) రూ.12847 కోట్లు కేటాయించింది. ఇలా వికలాంగులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు, శిశుఅభివృద్ధికి 2021-22లో కేటాయింపు 24,435 కోట్లు. వాస్తవ వ్యయం రూ.21,654 కోట్లు. 2022-23లో రూ.25వేల కోట్లు కేటాయించిన మోడీ సర్కార్, 2023-24లో రూ.25544 కోట్లు ప్రకటించింది. నిధుల కేటాయింపులో పెరుగుదల కేవలం 1.1శాతం. మైనార్టీ సంబంధాల శాఖ నిధుల్లో 38.3శాతం కోత విధించారు. 2022-23లో రూ.5020 కోట్లు ప్రకటించి, రూ.2612 కోట్లు వ్యయం చేసింది. ఈ బడ్జెట్‌లో రూ.3097కోట్లకు పరిమితం చేసింది.

ఎస్సీ, ఎస్టీలకు ఉత్తచేయి

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం అన్ని శాఖల్లో వారికి నిధుల కేటాయింపు ఉండాలి. పాలకులు దీనిని కాగితాలకే పరిమితం చేస్తూ వస్తున్నారు. ఎస్టీ సంక్షేమానికి 2021-22లో కేటాయింపులు రూ.79వేల కోట్లు. కాగా మొత్తం కేంద్ర పథకాల వ్యయంలో ఇది కేవలం 5.6శాతమే. ఎస్సీ సంక్షేమానికి 8.8శాతం వాటా మాత్రమే దక్కింది. ఈ బడ్జెట్‌లో ఎస్టీ సంక్షేమానికి రూ.1.19 లక్షల కోట్లు కేటాయించింది. మొత్తం కేంద్ర పథకాల వ్యయంలో దీని వాటా 6.1శాతం. ఎస్సీ సంక్షేమానికి రూ.1.59 లక్షల కోట్లు ప్రకటించారు. ఇది మొత్తం కేంద్ర పథకాల వ్యయంలో 8.1శాతం. ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్టీ సంక్షేమం నిధుల్ని 33శాతం పెంచినట్టు కేంద్రం గణాంకాల్ని చూపింది. రోడ్లు, జాతీయ రహదారుల శాఖ కేటాయింపులే ఇందులో ఎక్కువగా ఉన్నాయి. ఇక జెండర్ బడ్జెట్ ప్రకటన అంటూ మహిళలు, బాలిక సంక్షేమం కోసం ఏదో చేస్తున్నామని కేంద్రం గణాంకాల్ని విడుదల చేస్తోంది. దీని ప్రకారం, 2021-22లో కేటాయింపులు రూ.1.53లక్షల కోట్లు. ఆనాటి మొత్తం బడ్జెట్‌లో వాటా 4.4శాతమే. ప్రస్తుత బడ్జెట్‌లో 2.23లక్షల కోట్లు కేటాయింపులు చేసింది. రూ.45లక్షల కోట్ల బడ్జెట్‌లో వాటా 4.96శాతం.

బెయిల్‌పై విడుదలైన సిద్ధిఖీ

లక్నో : ఉత్తరప్రదేశ్ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసిన కేరళ జర్నలిస్ట్ సిద్ధిఖీ కప్పన్ ఎట్టకేలకు గురువారం విడుదలయ్యారు. నెల రోజుల క్రితం బెయిల్ వచ్చినప్పటికీ మరో రెండు కేసులు ఉండటంతో ఆయన జైలులోనే ఉన్నారు. ఈ క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని లక్నో జైలు నుంచి విడుదలైన అనంతరం కప్పన్ మీడియాతో చెప్పారు. బెయిల్ పొందినప్పటికీ తనను జెయిల్‌లోనే ఉంచారని.. దానిపై 28 నెలల సుదీర్ఘ పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. జైలులో నిర్బంధించటం వల్ల ఎవరికి లబ్ధి చేకూరిందో తెలియలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ రెండేండ్లు చాలా కఠినంగా గడిచిందనీ, అయినా ఎప్పుడూ భయపడలేదని అన్నారు. రెండేండ్ల క్రితం అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో 20 ఏండ్ల దళిత యువతిపై పెత్తందారీ యువకులు సామూహిక లైంగికదాడికి గురైన విషయం తెలిసిందే. మృత్యువుతో పోరాడుతూ నెలరోజుల అనంతరం ఆమె మరణించింది. కేసును కప్పిపుచ్చేందుకు యోగి ప్రభుత్వం ఆ యువతి మృతదేహానికి అర్ధరాత్రి హుటాహుటిన అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటనపై రిపోర్టింగ్‌కు వెళ్లిన కప్పన్‌ను యూపీ పోలీసులు అక్రమంగా నిర్బంధించారు.

జేపీసీ వేయాలి

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై దర్యాప్తు చేపట్టాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం విజయ్ చౌక్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి ప్రతిపక్ష నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. "ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలి. లేదంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) పర్యవేక్షణలో కమిటీతో దర్యాప్తు జరిపించాలి. ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కోట్లాది మంది ప్రజల పెట్టుబడులున్నాయి. వారి సొమ్ము ఇప్పుడు ప్రమాదంలో పడింది" అని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. "మార్కెట్ విలువను కోల్పోతున్న కంపెనీలలో ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల పెట్టుబడి సమస్యను చర్చించడానికి మేము రూల్ 267 ప్రకారం నోటీసు ఇచ్చాం. ముఖ్యమైన సమస్యలను లేవనెత్తినప్పుడు, వాటిపై చర్చకు సమయం ఇవ్వటం లేదు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఇతర జాతీయ బ్యాంకుల్లో పేదల సొమ్ము ఉంది. ఆ సొమ్మును ఎంపిక చేసిన కంపెనీలకు ఇస్తున్నారు" అని విమర్శించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో, ఎల్ఐసీలో దాచుకున్న కోట్లాదిమంది కష్టజీవుల సొమ్ము ఇప్పుడు ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు.

వ్యూహంపై అధికార, ప్రతిపక్షాలు భేటీలు

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు అధికార, ప్రతిపక్షాలు భేటీ అయ్యాయి. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో ప్రతిపక్షాలు సమావేశమయ్యాయి. పార్లమెంటులో వ్యవహరించాల్సిన వైఖరిపై చర్చించాయి. ఈ సమావేశంలో రాంగోపాల్ యాదవ్ (ఎస్పీ), కనిమొళి (డీఎంకే), ఎలమరం కరీం (సీపీఐ(ఎం)), సుదీప్ బందోపాధ్యాయ, డెరిక్ ఓబ్రెయిన్ (టీఎంసీ), వందన చౌహాన్ (ఎన్సీపీ), బినయ్ విశ్వం (సీపీఐ), సంజయ్ రౌత్ (శివసేన), కెసి వేణుగోపాల్, జైరాం రమేష్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పార్లమెంట్‌లో ప్రభుత్వం వ్యవహరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ప్రధాని మోడీ కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ వ్యూహంపై చర్చించేందుకు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, అనురాగ్ సింగ్, ఠాకూర్, నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్ జోషి, పియూష్ గోయల్, నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజులతో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశమయ్యారు.

టాలీవుడ్‌లో లైంగిక వేధింపులు అరికట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగం లేదని కమిటీ భావించిందన్నారు. ఆడిషన్స్‌లో లైంగిక వేధింపులకు గురయ్యే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని, డాన్స్ స్కూల్స్‌పై నియంత్రణ లేదని, అర్ధరాత్రులు షూటింగ్‌లు జరిగినా మహిళా ఆర్టిస్టులకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించడం లేదని కమిటీ గమనించిందని వివరించారు.

లైంగిక వేధింపులపై అంతర్గత కమిటీ వేయాలని సినీ పరిశ్రమ పెద్దలు 2018లోనే నిర్ణయించుకున్నా నేటికీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైలెవెల్ కమిటీ వేసిన తర్వాత కూడా టాలీవుడ్‌లో పరిస్థితులు మారలేదని, ఇటీవల అనేక సంఘటనలు జరిగినప్పటికీ అవి బయటకు రావడం లేదని తెలిపారు.

టాలీవుడ్‌లో ఫిల్మ్ చాంబర్, అన్ని ఫెడరేషన్స్, యూనియన్లు ప్రొడక్షన్ కంపెనీలలో అంతర్గత కమిటీలు వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తరపున మానిటరింగ్ కమిటీ వేయాలని హై లెవెల్ కమిటీ ప్రధానమైన సిఫారసు చేసిందన్నారు. ఈ సిఫారసులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, మానిటరింగ్ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) తరపున డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, ఎం.మహేందర్, అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు వై.వరలక్ష్మి ఉన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రవేశ పెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.... అదే క్రమంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టేందుకు పావులు కదుపుతున్నది. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై అసెంబ్లీ బయట తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నేతలు... శాసనసభ, మండలి సమావేశాల్లోనూ ఫోకస్ చేయాలని భావిస్తున్నది. ప్రతిపక్ష పార్టీల వ్యూహాన్ని చిత్తు చేసేందుకు బీఆర్ఎస్ పక్కా ప్రణాళికలు తయారుచేసినట్టు తెలిసింది. మరోవైపు ప్రతిపక్ష ఎంఐఎం మాత్రం బీఆర్ఎస్ ఏం చెప్పినా తలూపేందుకు సిద్ధంగా ఉన్నది. పాతబస్తీ సమస్యలను ప్రస్తావిస్తూ... ఇతర సమస్యల విషయంలో కర్ర విరగదు... పాము చావదు' అన్నట్టు వ్యవహరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్, ఎంఐఎం ఒప్పందంతో ముందుకు పోనున్నాయి. శత్రువు భేదం కాకుండా మిత్ర భేదంతోనే ఉండేందుకు ఆ పార్టీ ఇష్టపడుతున్నది. ఆ రకంగా అసెంబ్లీ వేదికగా పాత బస్తీకి కొన్ని ప్రత్యేక నిధులు రాబట్టాలని చూస్తున్నది. సభలో ప్రతిపక్ష ఎంఐఎం పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ వ్యవహరించాలని భావిస్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ వైఫల్యాలపై చార్జిషీట్లు విడుదల చేస్తున్న కాంగ్రెస్... అసెంబ్లీలోనూ అదే దూకుడు ప్రదర్శించాలని నిర్ణయించింది. ధరణి వెబ్ పోర్టల్ తెచ్చిన చిక్కులు రైతుల మెడకు ఉరితాళ్లుగా మారుతున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ధరణిలో రైతుల దరఖాస్తులు అప్‌డేట్ కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అంశాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్లనున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో రైతుల అప్పులు పెరిగిపోతున్నాయనే విషయాన్ని ప్రస్తావించనుంది. నిరుద్యోగ భృతి, పంటనష్టం, వైపరీత్యాలు, డబుల్ బెడ్ రూమ్, పోడుభూములు తదితర సమస్యలను ప్రస్తావించాలని నిర్ణయించింది. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పెండింగ్ ప్రాజెక్టులపై సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగడుతూనే... ప్రభుత్వ డొల్లతనాన్ని ఎండగట్టేందుకు ఎత్తులు వేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ కేటాయింపులు, ఖర్చులను లెక్కలతో సహా చెప్పి ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపేందుకు అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నది. అయితే బీజేపీ మాత్రం ప్రభుత్వ వైఫల్యాల కంటే, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధుల ప్రస్తావన చేయడం ద్వారా ప్రజల్లోకి బీజేపీ విధానాలను తీసుకెళ్లేందుకు ప్లాన్ చేసింది. రాష్ట్రానికి కేంద్రం మొండి చేయి చూపిస్తున్న బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టేందుకు బీజేపీ సిద్ధమవుతున్నది. మొత్తంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆయా పార్టీలు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ...ఎన్నికల సభగా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

5న మంత్రివర్గ సమావేశం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 5న సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై క్యాబినెట్‌లో చర్చించి ఆమోదం తెలపనుంది.

ఉపాధి నిధుల కోతపై ఆవేదన

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

ఖమ్మం పట్టణంలోని పాత బస్టాండ్ ఎదుట బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఖమ్మంలోని నిర్మల స్కూల్ వద్ద తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్ మాట్లాడారు. డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సరిత క్లినిక్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులు దహనం చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు చోట్ల వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యా రంగానికి నిధులు పెంచలేదనిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో బడ్జెట్ పత్రాల్ని దహనం చేశారు. చేసి నిరసన వ్యక్తం చేశారు. చేర్యాల మున్సిపల్ కేంద్రంలో వ్యకాస ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్యం, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహులు, రాష్ట్ర నాయకులు శశిధర్, కొంగరి వెంకట్‌మావో పాల్గొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్‌లో తక్కువ కేటాయించారని, ఉపాధిని నిర్వీర్యం చేసే కుట్రను వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెర రామ్మూర్తి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

అదానీ వ్యవహారంపై చర్చించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరించారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు తమ స్థానాల్లోనే లేచి నిరసనకు దిగారు. ప్రతిపక్షాల ఆందోళనతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ ప్రకటించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమవ్వగా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఆందోళనల నేపథ్యంలో సభను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.

జులై 1న గ్రూప్-4

(మొదటిపేజీ తరువాయి)

పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రూప్-4 పరీక్షకు ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 9,15,872 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించామని పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఓఎంఆర్ విధానంలోనే ఈ పరీక్ష ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలతో ముగియనుంది. ఇతర వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

అభ్యర్థుల్లో ఆందోళన

జులై ఒకటో తేదీన శనివారం కావడంతో గ్రూప్-4 రాతపరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొన్నది. ప్రభుత్వ సెలవు దినం కాకపోవడంతో పరీక్ష రాసేదెలా?అంటూ టీఎస్‌పీఎస్సీని పలువురు అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఈ పరీక్షను నిర్వహించే అవకాశమున్నది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ఈ పరీక్ష ఉంటుంది. అయితే విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటిస్తుందా? లేదా?అన్న దానిపై స్పష్టత లేదు. గ్రూప్-4 పరీక్ష తేదీని మార్చాలంటూ అభ్యర్థులు కోరుతున్నారు. అయితే జులై రెండో తేదీన ఆదివారం యూపీఎస్సీ పరీక్ష ఉంటుందని టీఎస్‌పీఎస్సీ ప్రకటించడం గమనార్హం.

పరిశ్రమల్లో కార్మికుల మరణ రేటుపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత అధికారులు, విభాగాలకు నోటీసులు పంపింది. ఆరు వారాల్లోగా స్పందన తెలియజేయాలంటూ ఆదేశించింది.కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఫ్యాక్టరీ అడ్వైస్ సర్వీస్ అండ్ లేబర్ ఇన్‌స్టిట్యూట్స్ (డీజీఎఫ్ఏఎస్ఎల్ఐ) సమాచారం మేరకు పత్రికలో వచ్చిన ఆర్టికల్‌ను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటోగా స్వీకరించింది. ఈ ఆర్టికల్ ప్రకారం 2017 నుంచి 2022 మధ్య దేశంలోని నమోదిత పరిశ్రమల్లో రోజుకు ముగ్గురు చనిపోగా, 11 మంది గాయాలపాలయ్యారు. ఫ్యాక్టరీలతో పాటు ఇతర వ్యాపార సముదాయాల్లో కార్మికుల మానవ హక్కులపై ఈ ఆర్టికల్ తీవ్ర ఆందోళనలను లేవనెత్తుతున్నదని కమిషన్ అభిప్రాయపడింది. ఈ విషయంలో కమిషన్ దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్మిక విభాగాలకు నోటీసులు పంపింది. తమ పరిధిల్లోని ఫ్యాక్టరీలలో కార్మికులు, ఉద్యోగుల యాక్సిడెంట్లు, మరణాలు, గాయాలపాలైనవారికి, మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఫ్యాక్టరీ చట్టం 1948 కింద ఫ్యాక్టరీ యజమానులపై విచారణ, భద్రతా ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాలని ఆదేశించింది. కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ సెక్రెటరీకి కూడా ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ నోటీసును పంపింది. దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీ కార్మికుల విషయంలో మానవ హక్కుల మెరుగుదలకు తీసుకున్న, తీసుకోబోయే చర్యలు, భద్రత, ఆరోగ్య, పని పరిస్థితుల కోడ్ అమలుకు సంబంధించి తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా 2018 నుంచి 2020 మధ్య 3331 మరణాలు నమోదయ్యాయి. ఫ్యాక్టరీ చట్టం 1948 కింద కేవలం 14 మంది శిక్షింపబడటం గమనార్హం.

డీసీపీని కలిసిన ఎక్సైజ్ శాఖ అధికారులు

నవతెలంగాణ-హయత్ నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న ఎల్బినగర్ జోన్ నూతన డీసీపీగా సాయి శ్రీ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్బీ నగర్ పరిధిలోని ఎక్సైజ్ శాఖ అధికారులు సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు, ఏఈఎస్ హనుమంతరావు, హయత్ నగర్ శాఖ అధికారి లక్ష్మణ్ గౌడ్ లు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా నుండి మేడ్చల్ జిల్లాకు బదిలీ అయిన కలెక్టర్ అమయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.



ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే అబ్దుల్లా బలాల

నవతెలంగాణ-సంతోష్ నగర్

ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే బీఆర్ఎస్ ధ్యేయమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల పేర్కొన్నారు. గురువారం మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లతో కలిసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులేదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి సబితా ఇంద్రారెడ్డి • మహిళా సంఘాలకు రూ.5కోట్ల చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని యూనియన్ బ్యాంక్ సహకారంతో స్వయం సహాయక సంఘాలకు రూ.5కోట్ల విలువచేసే చెక్కులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ్మా రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళలు ఆర్థికాభ్యున్నతిలో పురుషులతో సమానంగా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని అభివృద్ధి సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్, బ్యాంకు అధికారులు, మెప్మా అధికారులు, కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, తోట శ్రీధర్ రెడ్డి, ఇంద్రసేన, బద్రమోని రోహిణి రమేష్ ముదిరాజ్, కోఆప్షన్ సభ్యులు జగన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు మహోన్నత కార్యక్రమం

- మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సేవారత్న, సేవా భూషణ్, ప్రజారత్న డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని ముజీబ్ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి ప్రారంభించారు. ఇందులో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రతాప్, సభ్యులు రామినేని శ్రీనివాసరావు, ఉమా దేవి, శైలజ, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీరామ్, కార్యదర్శి శ్రీకాంత్, నాలుగో తరగతి యూనియన్ అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికి కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ మహోన్నతమైన కార్యక్రమం టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా నిర్వహిస్తున్నందుకు ప్రత్యేకంగా డాక్టర్ ముజీబ్, వారి కార్యవర్గ సభ్యులను అభినందించారు.



ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



నవ తెలంగాణ-సంతోష్ నగర్

ఫిబ్రవరి 3 నుండి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మీనా కోరారు. గురువారం బహదూర్‌పుర జోన్ జానుమా పీఎస్సీలో ఎస్పీహెచ్‌వో శిల్పికి ఆశా వర్కర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నేటికీ ఆశా వర్కర్లకు కనీసం ఫిక్స్‌డ్ వేతనం లేదని, పెన్షన్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా లేవన్నారు. నిత్యం ప్రభుత్వ పనులు చేస్తున్నా కనీసం ఉద్యోగ భద్రత కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో ఇస్తున్నట్టు తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆశాలకు రూ.10వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని ఆమె డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలలో ఆశాల సమస్యపై చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు సఫియా సుల్తానా, జాహదా బేగం, షకీలా కౌసర్, అను ఫాతిమా, జరీనా, ఆయేషా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ ముందుండాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యార్థినీ, విద్యార్థులు విద్యుత్‌తోపాటు క్రీడారంగంలో ముందుండి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఘట్కేసర్ ఎస్సై విజయ్ కృష్ణ అన్నారు. ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎస్పీఆర్ పాఠశాలలో హర్యానాలో జరిగిన జాతీయస్థాయి యూత్ గేమ్ నేషనల్ ఛాంపియన్షిప్ 2023 కబడ్డీ రన్నింగ్ టైక్వాండో పోటీలలో ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించినందుకు వారిని అభినందించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ విజయ్ కృష్ణ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ ముందుండి సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాకేష్, అకాడమిక్ డైరెక్టర్స్ ఉన్ని కిషన్, బాలచందర్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌ను సవరించి వికలాంగులకు ఐదు శాతం నిధులు కేటాయించాలని, బడ్జెట్లో వికలాంగులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ గురువారం ఘట్ కేసర్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్డీ) ఘట్ కేసర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కె.చంద్రమోహన్ మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులో వికలాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. 2022-23 కేటాయించిన మొత్తం రూ.196 కోట్లు మాత్రమేనని ఆయన తెలిపారు. వికలాంగుల (హక్కుల) చట్టం అమలు పథకానికి గత సంవత్సరం బడ్జెట్ కంటే ఈ సారి రూ.90 కోట్లు తగ్గించడం ద్వారా వికలాంగుల చట్టం అమలును నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తుందని ఆయన తెలిపారు. గత సంవత్సరం రూ.240.39కోట్లు కేటాయించి, ఈ ఏడాది రూ.150 కోట్లకు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. ఆర్‌పీడీ చట్టం ద్వారా నిర్దేశించబడిన ఐదేళ్ల వ్యవధిలో యాక్సెస్‌బిలిటీ నిబంధనలను అమలు చేయకపోవడానికి కారణం నిధులు కేటాయించకపోవడమేనన్నారు. పార్లమెంట్ ఆమోదించిన నేషనల్ ట్రస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి చట్టాల అమలుకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వికలాంగులందరికీ ఉచిత విద్యా, ఆరోగ్య సంరక్షణను పట్టించుకోవడానికి ప్రభుత్వం నిరాకరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ మండల కమిటీ సభ్యులు, ఎస్ కే షకీల్, టి రఘు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములు దళితులకే ఇవ్వాలి

సీపీ(ఐ)ఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్

నవతెలంగాణ - మీర్ పేట్

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని దళితులకే ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా సీపీ(ఐ)ఎం కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీర్‌పేట్ దళితులు ప్రశాంతి హిల్స్ చౌరస్తాలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ మీర్ పేట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 61లో ఎన్నో ఏండ్లుగా భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఆ భూమిలో అభివృద్ధి పనుల పేరుతో నిర్మాణాలు చేస్తున్నారని వాటిని ఆపి ఆ భూమిని వారికే ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ భూమిలో గతంలో దేనా బ్యాంకులో లోన్లు తీసుకొని వ్యవసాయం చేశామని చెప్పారు. ఆ భూమిపై దాదాపు 100కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని ఆ భూమి తప్ప ఇతర ఏ ఆధారం వారికి లేదని అన్నారు. దానిపై ఆధారపడి ఉన్న దళిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీ(ఐ)ఎం నాయకులు యాదయ్య, రవి, కిషోర్, రైతు సంఘం నాయకులు రామకృష్ణ, భూ బాధితులు దాసరి బాబు, భాస్కర్, నర్సింహ, ఉపేందర్, బొమ్మని బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి పన్నులు తగించాలని నేడు ధర్నా : డీసీసీ అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాష్ట ప్రభుత్వం పేద ప్రజలకు సంబంధించిన ఇంటి ట్యాక్సీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సిహ్మా రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహ్మా రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబావి వెంకట్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎన్నికల్లో గెలిపిస్తే ఇంటి ట్యాక్సీలు తగిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలని మంత్రిని కోరారు. లేనిపక్షంలో శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారు మనోహర్, బాలు నాయక్, ఎర్ర మహేశ్వరి జైహింద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బాల్ లింగని జంగయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.



శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్, హయత్‌నగర్ వంటి శివారు ప్రాంతాల అభివృద్ధికి దాదాపు రూ.4.75కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను గురువారం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవాజీవన్‌రెడ్డిలు నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, ఆర్టీసీ సూపర్‌వైజర్స్ కాలనీ నూతన పార్క్ శంకుస్థాపనకు సుమారు రూ.18.70లక్షలు, బాలాజీ నగర్ కాలనీలో నూతన పార్కు నిర్మాణ పనులకు రూ.31.26 లక్షలు, హయత్ నగర్ డివిజన్‌లో సూర్యానగర్ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.54లక్షలు, డిఫెన్స్ కాలనీ సీసీ రోడ్డు పనులకు రూ.45లక్షలు, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్స్ కాలనీలో నూతన జై హింద్ పార్కు నిర్మాణ పనుల కోసం ఒక కోటి 28 లక్షల రూపాయలు, ఆంధ్ర బ్యాంక్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు రూ.55 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని శివారు కాలనీల అభివృద్ధే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గాన్ని ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు కొప్పుల విటల్‌రెడ్డి, సామ తిరుమల రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, శ్రీధర్ గౌడ్, నాంపల్లి రామేశ్వర్, గుడాల మల్లేష్, టంగుటూరి నాగరాజు, పలు కాలనీల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, పలు డివిజన్ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలి

సబితాను విమర్శించే స్థాయి శంకర్‌రెడ్డికి లేదు: రామిడి రాంరెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని విమర్శించే స్థాయి బీజేపీ నాయకులు కొలన్ శంకర్ రెడ్డికి లేదని, అసత్య ఆరోపణలు చేసిన శంకర్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. చిల్లర రాజకీయాలను మానుకొని అభివృద్ధికి సహకరించాలన్నారు. మహిళలను గౌరవించాలని చెప్పే వారు ఏకవచనంతో మంత్రిని సంబోధించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుండోజీ రఘునందచారి, బాలాపూర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, నాదర్‌గుల్ సహకార బ్యాంక్ డైరెక్టర్ చిగురింత పెద్ద నర్సింహ్మారెడ్డి, నాయకులు అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పచ్ వెంకట్ రెడ్డి, చిగురింత పెద్ద నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు తిమ్మని గిరీష్, కొప్పుల రాజు, జూకాంటి సురేష్ గౌడ్ అరవింద్ గౌడ్, కోటగిరి మురళి, తులసి రామ్, రితిన్ రెడ్డి, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆడబిడ్డల వివాహాలకు సాయమందించడంలో ముందుంటాం

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తా

నవతెలంగాణ-నాగోల్

నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు సహాయ సహకారాలు అందించడంలో ఉప్పల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాసగుప్తా అన్నారు. గురువారం సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల చెందిన ముగ్గురు వధువుల వివాహాల కోసం వారి కుటుంబ సభ్యులు నాగోల్‌లోని క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస గుప్తాను కలిసి సహాయం అర్థించగా, వెంటనే ఆయన వారి వారి ఆర్థిక స్తోమతను అడిగి తెలుసుకుని కరీంనగర్ జిల్లాకు చెందిన పుష్ప, అరుణ, సంగారెడ్డి జిల్లాకు చెందిన గౌరీ ప్రసన్నల వివాహాలకు మంగళసూత్రం, మెట్టెలు, చీరలు, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 23ఏండ్లుగా ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కులాలకతీతంగా నిరుపేద కుటుంబాలకు చెందిన అమ్మాయిల పెళ్లిళ్లకు మా వంతుగా సాయం చేస్తున్నామన్నారు. ఆడబిడ్డల వివాహాలకే కాకుండా చదువుపై ఆసక్తి కలిగి ఆర్థిక స్తోమత లేని నిరుపేద విద్యార్థులకు తమకు తోచిన సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మహేశ్వరం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాంటెస్టేడ్ ఎమ్మెల్యే కొత్త మనోహర్

నవతెలంగాణ-బడంగ్ పేట్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీలో ఉంటానని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంటెస్టేడ్ ఎమ్మెల్యే కొత్త మనోహర్ అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం సాయిరాం కాలనీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కేఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద ప్రజలను అనేక స్వచ్ఛంద కార్యక్రమాల ద్వారా ఆదుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా పేద కుటుంబాల వారు తమ ఆడపిల్లలకు పెండ్లిళ్లు చేసే సమయంలో ఉచితంగా పుస్తె మెట్టెలు, పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం, బస్సు పాసులు అందించటం, ఇండ్లు లేని నిరు పేదలకు 60గజాల ఇంటి స్థలాన్ని ఉచితంగా పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ నెల 10న భవిషత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మంచిరెడ్డి

నవతెలంగాణ-తుర్కయాంజల్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మంచిరెడ్డి కిషన్ అన్నారు. గురువారం తుర్కయాంజల్ మున్సిపాలిటీ కమ్మగూడ గ్రామం 19వ వార్డులో నివాసముండే వరిగంటి శివకుమార్‌కు రూ.30,500 చెక్కును, 22వ వార్డులో నివసించే నేనావత్ సాయి రమణకు రూ.16వేల చెక్కును ఎమ్మెల్యే మంచిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుండ్ల రాజిరెడ్డి, ఇంద్రమ్మ నగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు గౌని రాజు గౌడ్, రాములు గౌడ్, గుండా జనార్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నిమ్మల రాఘవేందర్ గౌడ్, 19వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తావుల శ్రీనాథ్, మిట్టపల్లి లక్ష్మారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పార్క్ నిర్మాణానికి సుధీర్ రెడ్డి శంకుస్థాపన

నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి భవానీనగర్ కాలనీలో నూతన పార్కు నిర్మాణానికి గురువారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సాయి భవానీనగర్‌లో సుమారు రూ.79.05 లక్షల వ్యయంతో పార్కు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి వేగవంతంగా నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింతల సురేందర్ యాదవ్, తూర్పాటి చిరంజీవి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





రోడ్డుపై మురుగు నీరు తొలిగించిన పారిశుధ్య కార్మికులు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రోడ్డుపైనే మురుగు నీరు.. అనే శీర్షికన గురువారం నవతెలంగాణ తెలుగు దినపత్రికలో వచ్చిన వార్తకు మల్కాజిగిరి సర్కిల్ అధికారులు స్పందించారు. డీసీ రాజు ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బంది నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని మధుర నగర్ రోడ్ నెంబర్ 6కు చేరుకుని రోడ్డు పైన చేరిన మురుగు నీరును పరిశీలించారు. భరించలేని దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని ఈ సందర్భంగా కాలనీవాసులు చెప్పడంతో అప్పటి కప్పుడే పారిశుధ్య కార్మికుల చేత మురుగు నీటిని తొలగింప చేసి శుభ్రం చేయించారు. సమస్యను వెలుగులోకి తీసుకుని వచ్చి పరిష్కరానికి తోడ్పడిన నవ తెలంగాణ పత్రికకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-మల్కాజిగిరి

నేడు మున్సిపల్ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముస్తాల కపాసాగర్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ(ఎం) కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఆఫీసు వద్ద ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు కావున ఇండ్లు లేని పేదలు తప్పకుండా ఈ ధర్నాలో పాల్గొనాలని కోరారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు వివరాలతో ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. అప్లికేషన్ ఫారాలు ధర్నా వద్ద ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కే వెంకట్
- వికలాంగులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ఈసీఐఎల్‌లో నిరసన



నవతెలంగాణ-కాప్రా

బడ్జెట్ కేటాయింపులో వికలాంగుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కే వెంకట్ మండిపడ్డారు. బడ్జెట్‌లో వికలాంగులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ఈసీఐల్ క్రాస్ రోడ్‌లో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వికలాంగుల హక్కుల చట్టం అమలు కోసం గతేడాది రూ.240.39 కోట్లు కేటాయించి, ఈ ఏడాది రూ. 150 కోట్లకు ఎందుకు తగ్గించిందని ప్రశ్నించారు. ఆర్‌పీడీ చట్టం 2016 ద్వారా నిర్దేశించబడిన ఐదేండ్ల వ్యవధిలో యాక్సెస్ బిలిటీ నిబంధనలను అమలు చేయకపోవడంకు కారణం నిధులు కేటాయించకపోవడమేనని అన్నారు. పార్లమెంట్ ఆమోదించిన నేషనల్ ట్రస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి చట్టాల అమలుకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వికలాంగులందరికీ ఉచిత విద్యా, ఆరోగ్య సంరక్షణను పట్టించుకోవడానికి ప్రభుత్వం నిరాకరించిందని అన్నారు. ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకానికి రూ. 290 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. ఈ నిధులతో వికలాంగుల పెన్షన్ పెంచడం ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. 2011 నుంచి పెన్షన్ కేవలం రూ. 300 ఇస్తుందని దీనితో వికలాంగులు ఎలా బతుకుతారు అని నిలదీశారు. 2011 జనాభా లెక్కల ద్వారా గుర్తించబడిన వికలాంగ జనాభాలో కేవలం 3.8 శాతం మాత్రమే ఈ పథకం ప్రయోజనాన్ని పొందుతున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల వికలాంగులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని అలాంటి పథకానికి నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యాన్ని చేశారన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగావకాశాలు తగ్గిపోతున్న కారణ ప్రయివేటు రంగంలో వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టలని డిమాండ్ చేశారు. ఆర్థిక మంత్రి అనర్గళంగా మాట్లాడిన సప్తఋషి మార్గనిర్దేశం చేసిన "సమిష్టి అభివృద్ధి"లో వికలాంగులను ఎలా భాగస్వామ్యం చేస్తారో ఎందుకు ప్రకటించలేదని అన్నారు. బడ్జెట్‌ను సవరించి వికలాంగులకు ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మానసిక వికలాంగుల చట్టం అమలు చేయడం కోసం ఎందుకు నిధులు కేటాయించలేదని అన్నారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కోసం ఎలాంటి హామీ బడ్జెట్‌లో లేదని అన్నారు. కార్యక్రమంలో షైన్ బేగం, కోటయ్యా, నవ్య అనిల్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లారపు సేవలు మరింతగా విస్తరించాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- ఎంఎల్ఎన్ కన్వెన్షన్‌ను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మల్లారపు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యుల సేవలు మరింతగా విస్తరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర మండలం చీర్యాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో దేవస్థానం చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎం.ఎల్.ఎన్ కన్వెన్షన్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చీర్యాల గ్రామంలోని లక్ష్మీనసింహ్మా స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచిదన్నారు. అనతి కాలంలోనే ఎంతో అభివృద్ధి చెందుతున్న ఆలయానికి పెద్ద ఎత్తున్న భక్తులు రావడం చాలా సంతోషం అన్నారు. ఆలయ సమీపంలో ఇంత పెద్ద కన్వెన్షన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయని పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులో కన్వెన్షన్ ఉందన్నారు. చైర్మన్ ఫ్యామిలీ మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అంతకు ముందు స్వామి వారిని మంత్రి దర్శించుకున్నారు. కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఆర్థిక ,రిజిస్ట్రేషన్లు శాఖ చీఫ్ ల్యాండ్ కమిషనర్ నవీన్ మిట్టల్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ,జెడ్పీ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి , వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్, జిల్లా మాజీ కలెక్టర్ ఎంవి. రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి మరి రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి బాబు మోహన్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నగర నడిబొడ్డున ఫార్ములా ఈ రేసింగ్



- 575 పోలీసులతో భద్రత కట్టుదిట్టం

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫార్ములా ఈ రేసింగ్ నేపథ్యంలో పోలీస్ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ మార్గంలో ఈనెల 11, 12న అంతర్జాతీయ స్థాయిలో ఈ రేసింగ్ నిర్వహిస్తుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 575 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం మెయిన్ రేసింగ్ కావడంతో 21 వేలకు పైగా ప్రేక్షకులు తరలివచ్చే అవకాశముంది. అందుకు తగినట్టుగా అన్ని ఏర్పాట్లపై దృష్టి సారించారు. 2.8 కిలోమీటర్ల మేరకు రేసింగ్ కొనసాగనుంది. 16 స్టాండ్స్‌లు, 7 గేట్లు, 4 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారు.

ఈ నేపథ్యంలో గురువారం నగర సీపీ సీవీ ఆనంద్ స్వయంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ ఏర్పాట్లపై ఆరా తీశారు. నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ మార్గ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. మొట్టమొదటి సారి ప్రతిష్టాత్మకంగా ఈరేసింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. 5న ఆదివారం నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌ను పూర్తిగా మూసివేస్తామని తెలిపారు. 6వ తేదీన ఎన్టీఆర్ మార్గంలో వాహనాలకు అనుమతులిస్తామని తెలిపారు. 7వతేది నుంచి 12వరకు ఎన్టీఆర్ మార్గాన్ని పూర్తిగా మూసివేయనున్నట్టు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని, అధిక సంఖ్యలో మెట్రోలో ప్రయాణించాలని సీపీ సూచించారు. పోలీసులకు నగర వాసులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఈ-ఫార్ములా సెక్యూరిటీ డైరెక్టర్ స్కాట్ ఆండర్సన్, మార్కోతోపాటు అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, జీ.సుధీర్‌బాబు, జాయింట్ సీపీ శ్రీనివాసులు, డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

'ఢిల్లీ పరేడ్‌లో తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొనడం అభినందనీయం'



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఢిల్లీలో కర్తవ్య పథ్‌లో జరిగిన్ రిపబ్లిక్ డే పరేడ్‌లో 121 మంది తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీడీజీపి మహేశ్వర్ అభినందించారు. గురు వారం సికింద్రాబాద్ ఎన్‌సీసీ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు అనంతరం ఆయన మాట్లా డుతూ రెండు రాష్ట్రాల్లో 1,21,000 మంది ఎన్‌సీసీ శిక్షణ పొందుతుండగా 121 మంది పరేడ్ లో పాల్గొనడం గొప్ప అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. పాల్గొన్న విద్యార్థులలో ఒక విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించడం గర్వకారణమన్నారు. ఈ 121 మంది సంవత్సర కాలం పాటు శ్రమించి 30 రోజులపాటు ఢిల్లీలో ట్రైనింగ్ తీసుకొని పరేడ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఎన్‌సీసీలో పాల్గొన్న విద్యార్థులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నియమాకాలలో రిజర్వేషన్లు ఉంటాయని, విద్యార్థులు యువత ఎన్‌సీసీలో చేరి దేశ రక్షణకు కృషి చేయాలని సూచించారు.

మేయర్‌పై అవిశ్వాసం వెంటనే వెనక్కు తీసుకోవాలి

- కురుమ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చీర సురేష్
- మేయర్ మేకల కావ్యకు మద్దతుగా ధర్నా



నవతెలంగాణ-జవహర్‌నగర్

బహుజన బిడ్డ మేయర్ మేకల కావ్యపై అవిశ్వాసం పెడుతున్నారని, ఆడబిడ్డపై అవిశ్వాసం అవివేకుల పనేనని మేడ్చల్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు చీర సురేష్ కురుమ అన్నారు. జవహర్‌నగర్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నగరాన్ని అద్భుతంగా తీర్చిదుద్దుతున్న మేయర్‌పై కావాలనే జరుగుతున్న దాడి యావత్ బహుజనులను కించపరిచినట్టేనన్నారు. మేయర్ మేకల కావ్యపై పెట్టిన అవిశ్వాసానికి నిరసనగా గురువారం కార్పొరేషన్ కార్యాలయం ముందు కురుమ, యాదవ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మేయర్ కావ్య మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వ భూములను కాపాడుతుందని అన్నారు. కొంత మంది భూకబ్జాదారులకు సహకరించడం లేదనే అక్కసుతోనే కురుమ బిడ్డపై పెట్టిన అవిశ్వాసమన్నారు. అవిశ్వాసాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఇండ్ల ముందు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. బహుజన బిడ్డ మేయర్ కావడం అగ్రవర్ణాలు జీర్ణించుకోలేక కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కురుమ, జంటనగరాల ఉపాధ్యక్షుడు చేగూరి రాం మోహన్, సంఘం నాయకులు భాస్కర్, వినోద్, వెన్నెల, పర్వతాలు, గట్టయ్య, అంజయ్య, పాండు, నాగరాజు, మల్లేష్, రమేష్, ఐలయ్య, యాదవసంఘం అధ్యక్షుడు సత్యనారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కీసర గుట్ట జాతరలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి,
- కీసరలో ఆన్‌లైన్ వెబ్‌సైట్ ప్రారంభం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మహాశివరాత్రిని పురస్కరించుకొని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభోవేతంగా నిర్వహించాలని, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కీసరగుట్టలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆలయంలోని కార్యాలయంలో జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా అధికారులు, ఆలయ కమిటీతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనం కల్పించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వెబ్ సైట్‌ను మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్వామి వారి దర్శనానికి ప్రత్యేకంగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఏర్పాటు చేసి వారు కోరుకున్న రోజున కోరుకున్న సమయానికి శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనం కల్పిస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేయడం ఇది మొదటిసారి అని, దీని ద్వారా తమ టిక్కెట్లు బుక్ చేసుకొన్న భక్తులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున టిక్కెట్‌తో దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే దర్శనానికి బుక్ చేసుకొన్న భక్తులకు ఆర్జిత సేవలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశమిస్తారని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. జాతర సమయంలో దర్శనానికి ఎలాంటి పాస్‌లు, వీఐపీలకు సంబంధించిన లెటర్లు అనుమతించబోరని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కీసర గుట్టకు వచ్చే వృద్ధులు, చిన్నపిల్లలకు వెంటనే ప్రత్యేక దర్శనం కల్పించడం జరుగుతుందని దీనికి క్యూ లైన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గత రెండేండ్ల క్రితం కరోనా సమయంలో ఎక్కువ భక్తులు రాలేదని.. ప్రస్తుతం పరిస్థితులన్నీ బాగున్నందున జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని దీనిని దష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు. మహాశివరాత్రితో పాటు అంతకు ముందు, తర్వాత రోజుల్లో సైతం భక్తులు ఎక్కువగానే వస్తారని దీనిని దష్టిలో ఉంచుకొని ఆలయ సిబ్బంది సైతం ఎక్కువ మందికి స్వామి వారి దర్శనం కలిగేలా చూడాల్సిందిగా మంత్రి సమావేశంలో సూచించారు. జాతర రోజుల్లో కీసర ఆలయం వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పరిశుభ్రత ఉండాలని దీని కోసం జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులను నిర్వహించాలని సూచించారు. దీంతో పాటు జాతరలో భక్తులకు ఆయా చోట్ల మంచి నీటి సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. జాతరలో తొక్కిసలాట, ఇబ్బందులు తలెత్తకుండా బ్యారీకేడ్లను ఏర్పాటు చేయాలని, కరెంట్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకోవాల్సిందిగా సూచించారు. జాతరలో సరుకులు, ఇతర స్టాల్స్‌తో పాటు భక్తులకు అవసరమైన మేర టాయిలెట్లు ఉండేలా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ కీసరకు హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తారని తెలిపారు. భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయంలో ప్రతి ఒక్కరూ కృషి చేసి విజయవంతం చేయాలని అధికారులకు తెలిపారు. ప్రస్తుతం భక్తుల సౌకర్యార్థం నూతనంగా కల్పించిన ఆన్‌లైన్ విధానం ఎంతో మంచిదన్నారు. అంతకు ముందు ఆలయంలోని స్వామివారిని మంత్రి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆర్ డి ఓ రవి, డీఎస్పీ జానకీ ధరావత్, జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేశ్, ఆలయ కమిటీ చైర్మెన్ రమేశ్ శర్మ, కీసర సర్పంచ్ మాధురి, ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈవో) సుధాకర్ రెడ్డి, కీసర సహకార సొసైటీ చైర్మెన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కంటి వెలుగు డాక్టర్ ఎండి హర్షద్ అన్నారు. గురువారం కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని ఇసామియా బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విక్టోరియా ప్లే గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు సెంటర్‌కు ప్రజలు తరలివచ్చి ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు. వారికి వైద్యులు పరీక్షించి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, ఇసామియా బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు జయలక్ష్మి, కవిత, ఆశా వర్కర్లు పద్మావతి, జ్యోతి, కళ, సుధ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌నగర్‌లో అధునాతన మెగ్నీస్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/బంజారాహిల్స్



ఎస్సార్‌నగర్‌లోని యాక్సిస్ బ్యాంక్ లైన్, అమీర్‌పేట రోడ్డులో అధునాతన సౌకర్యాలతో మెగ్నీస్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డకొన్స్టిక్ సెంటర్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ సింగం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సార్ నగర్ అమీర్‌పేట పరిధిలో అందరికీ అందుబాటులో అన్ని రకాల పరీక్షలు చేయడానికి డయాగ్నస్టిక్ సెంటర్ అందుబాటులో లేదని తెలుసుకుని ఈ సెంటర్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. అన్ని రకాల పరీక్షలు చేయడానికి కావాల్సిన మిషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేష్ కుమారి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

- నాలుగు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు, ఫైర్ సిబ్బంది
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి తలసాని, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్
- షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్టు పోలీసుల ప్రాథమిక అంచనా

నవతెలంగాణ-ముషీరాబాద్



బాగ్‌లింగంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్ లింగంపల్లిలో భరత్ కుమార్ అగర్వాల్ కు చెందిన సుగుణ స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, హరి ఫెరో అలోయిస్ ప్రైవేట్ లిమిటెడ్, సుగుణ మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోదాములలో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఓ గోదాంలో భారీగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో దట్టంగా పొగ అలుముకుంది. పోలీసులు, ఫైరు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దాదాపు 4 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. సమాచారం తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నగర నాయకులు ఎం.ఎన్.శ్రీనివాసరావు, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవి చారి, విపత్తుల నిర్వహణ అడిషనల్ డైరెక్టర్ నారాయణరావు, రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య, సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, హిమాయత్ నగర్ తహసీల్దార్ వీవీఎల్ చంద్రకళ, ఏఎంఒహెచ్ మైత్రేయి తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయనీ, తగిన జాగ్రత్తలు పాటించని వ్యాపారులు, గోదాముల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి



ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఇటీవల ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా విశిష్ట ప్రచారం కల్పిస్తున్నామనీ, పరిశ్రమ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించని కారణంగానే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కనీస నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహ, బ్రాహ్మర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజస్, సీనియర్ నాయకులు ముదిగొండ మురళి, బీజేపీ నాయకులు గడ్డం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' ఎత్తివేత కుట్రలను ప్రతిఘటిద్దాం



- అమృత్ కాల్ బడ్జెట్‌లో కూలీలకు అన్యాయం
- వంద రోజుల పని కల్పించలేరా..?
- విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి

నవతెలంగాణ-ముషీరాబాద్

అమృత్ కాల్, సప్తరుషి, వందేండ్ల భారత్ బడ్జెట్‌గా చెబుతూ ఉపాధి హామీ కూలీలు ఆత్మగౌరవం అదాయం ఆహారభద్రతతో జీవించడాన్ని జీర్ణించుకోలేక మరింత ఆకలికి అసమానతలను నెట్టి వేస్తూ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం ముప్పేట దాడి చేస్తుందని ఉపాధిహామీ హక్కుల పరిరక్షణ సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది. దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్), తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ అధ్వర్యంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధి హామీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సోషల్ డెమోక్రాటిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్, వీఆర్ఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కూలీలకు అన్యాయం చేసిందన్నారు. రూ.3 లక్షల కోట్లు అవసరం ఉంటే రూ.35 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఉపాధి చట్టం అమలుపై ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దుర్మార్గపు పాలన చేస్తున్నారన్నారు. కనీసం 100 రోజుల పని కల్పించరా? అని ప్రశ్నించారు. కనీస వేతనాలు చెల్లించకపోవడం సిగ్గు చేటన్నారు. విశ్రాంత ఐఏఎస్ టి.గోపాల్ రావు మాట్లాడుతూ పని హక్కుల అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ హక్కుల పరిరక్షణకు డిల్లీలో ఈ నెల 6 నుంచి మే 15వ తేదీ వరకు జరిగే ఉపాధి హామీ పరిరక్షణ దీక్షలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేద్దామన్నారు. రెక్కల కష్టంపై అధారపడి జీవిస్తున్న ఉపాధి హామీ కూలీల పై కేంద్రం కత్తి దూస్తుందన్నారు.. పేదలు, కూలీలు ఆత్మగౌరవంతో జీవించడాన్ని జీర్ణించుకోలేని బీజేపీ కూలీల పొట్టగొడుతూ బడ్జెట్‌లో నిధుల కోత విధిస్తూ తన నైజాన్ని బయటపెట్టుకుందన్నారు. దేశవ్యాప్తంగా రూ.5.6 వేల కోట్ల కుటుంబాలకు 100 రోజుల పని కల్పించేందుకు రూ.3 లక్షల కోట్లు అవసరం ఉండగా.. రూ.35 వేల కోట్లు కేటాయించి కేంద్ర ప్రభుత్వం పేదలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. తెలంగాణ, బెంగాల్ రాష్ట్రాలకు సకాలంలో నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. విచారణ పేరుతో కేంద్ర బృందాలను దించి అవినీతి జరిగిందని అర్భాటం చేస్తూ పేదలకు అదాయం, అహార భద్రతను అందిస్తున్న ఉపాధి హామీ చట్టంలోనే అవినీతి జరుగుతుందని విష ప్రచారానికి దిగితుందన్నారు. ఇంకా ఏ పథకంలోనూ అవినితి జరగనట్టు చూపించడం తగదన్నారు ఉపాధి మామీ చట్టం అమలు పై ఏ పథకంలో లేని విధంగా సామాజిక తనిఖీ జరుగుతున్నదన్నారు. రాజకీయ కారణాల సాకుతో రాద్ధాంతం చేస్తూ సకాలంలో నిధులను సకాలంలో విడుదల చేయడం లేదన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ పద్ధతిని ప్రవేశ పెట్టి రోజుకు రెండు సార్లు పని ప్రదేశం నుంచి కూలీల పోటొలను ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయాలనే కఠిన నిబంధనల అమలు వల్ల కూలీలు నరకయాతన పడుతున్నారన్నరు. అవినీతిని అరికట్టేందుకు సామాజిక తనిఖీని బలోపేతం చేయడానికి నిధులను విడుదల చేయాలనీ, పనిదినాలను వంద రోజుల నుంచి 200 వందల రోజులకు పెంచి కూలీలకు ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలనీ, రవాణా సౌకర్యం అలవెన్సును పెంచాలని కోరారు.

ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్ వద్ద కార్మికుల రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

తమ వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌లో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ జిల్లా నాయకులు జె.స్వామి మాట్లాడుతూ కనీస వేతనం జీవో 60 ప్రకారం రూ.15,600 అమలు చేయాలనీ, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలనీ, పెంచే వరకూ ఈ దీక్ష కొనసాగుతుందన్నారు. జీతాలు పెంచని యెడల డీఎంఈ ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి.సాయి శేషగిరిరావు, ఎండీ అసిఫ్ పాల్గొని పెరిగిన ధరలు కనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నసిరిన్, శ్రీనివాస్, మాధవి, చంద్రకళ, అనిత, సంధ్య విటల్ రాపర్తి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలు.. భద్రత కట్టుదిట్టం..

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. సభలను, ర్యాలీలను నిషేధించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపే అవకాశం ఉండటంతో పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని చర్యలు చేపట్టారు.

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

అసెంబ్లీ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఖైరతాబాద్, బషీర్‌బాగ్, రవీంద్రభారతి, మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్, ఎంజే మార్కెట్, నాంపల్లిలో ట్రాఫిక్ మళ్లింపులున్నాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు చేరుకోవాలనీ, పరిస్థితులను బట్టి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని సీపీ తెలిపారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలివ్వాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంగయ్య అన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్ఎఫ్‌పీటీసీపీహెచ్‌సీ, కోఠి హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం హాస్పిటల్ హెల్త్ సూపర్ వైజర్ నర్సుబాయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అశాలకు ఇస్తున్నట్టు ఫిక్స్‌డ వేతనం వెంటనే నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2022 డిసెంబర్ 6 నుంచి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలన్నారు. 2023 జనవరి 18 నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి ఆశాలకు అదనంగా డబ్బులు చెల్లించాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ, ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. అశాల సమస్యలను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంగయ్య, ఆశా వర్కర్లు ఉమాదేవి, అమరావతి, పుష్పావతి, శ్రీదేవి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలి

- సీఎం, మంత్రివర్గ మండలి అనాథలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-అడిక్‌మెట్



అసెంబ్లీ సమావేశాల్లోనే అనాథ పిల్లల కోసం ప్రత్యేక చట్టం, ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేసి సీఎం కేసీఆర్, మంత్రి వర్గ మండలి అనాథలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 లక్షలకు పైగా అనాథల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలన్నారు. అనాథలు అందరినీ రాష్ట్ర ప్రభుత్వం తమ బిడ్డలుగా చూడాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో అనాథల కోసం ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ గురుకులాలు ప్రారంభించాలన్నారు. అనాథల ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తామనీ, జూన్ 23 2015న సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులు సమక్షంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏడేండ్లు దాటినా నేటి వరకు ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. అనాథల సంక్షేమంపై నియమించబడ్డ మంత్రివర్గ ఉప సంఘం జనవరి 8 2022న చేసిన సిఫార్సుల్లో కూడా ఏ ఒక్క హామీ అమలుల్లోకి రాలేదన్నారు. సీఎం కేసీఆర్ అనాథలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనాథలకు కేజీ టు పీజీ వరకు ఉన్నత చదువులకు ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేనివిధంగా అనాథ పిల్లలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అనాథ పిల్లలను అక్రమ రవాణాకు పాల్పడే వారిపై, వారితో బిక్షతను చేయించే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనాథల అవమాన నిరోధక చట్టాన్ని తీసుకురావాలన్నారు. అనాథల సంక్షేమంపై ప్రతి ఏడాదీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వారి కోసం ఖర్చు చేసే విధంగా గ్రీన్ ఛానల్‌లో పెట్టి మిగిలిపోయిన వాటిని మరుసటి ఏడాది వినియోగించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అనాథల సంక్షేమంపై అసెంబ్లీలో తీర్మానం చేసే ముందు మానవతా దృక్పథంతో కన్న తల్లిదండ్రుల వలె అనాథలకు సేవ చేస్తున్న అనాథ ఆశ్రమాల నిర్వాహకులకు అన్ని విధాలుగా ఆదుకుని వారి సలహాలు సూచనల ను పరిగణలోకి తీసుకొని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనాథ పిల్లలకు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే ఈనెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలలో అనాథల అరిగోస దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అనాథల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు నూనెట రాజు, సన్నంకి మున్న, తదితర నాయకులు పాల్గొన్నారు.

అమెజాన్ వెబ్ సర్వీసెస్.. సైన్యం నుండి అనువాద పాఠాలు

నవతెలంగాణ హైదరాబాద్: అమెజాన్‌లో, వందలాది మంది అనుభవజ్ఞులు కొత్త ఆవిష్కరణలు చేస్తూ, తమ అనుభవంతో వినియోగదారులకు మెరుగైన, ఉన్నత సేవలు అందిస్తున్నారు. అమూల్యమైన అనుభవాలతో సిద్ధంగా ఉంటూ, వారు తమ పరిజ్ఞానం, నైపుణ్యాలు మరియు నాయకత్వ సామర్థ్యాలను అనేక రకాల పాత్రలకు విస్తరిస్తున్నారు. సైనిక నిపుణలతో బలమైన నిర్మాణం, అంకితమైన ప్రోగ్రామ్‌తో, అమెజాన్ ఇండియా వారిని స్వాగతించింది ఇండియన్ ఆర్మీలో 22 ఏళ్లకు పైగా పోరాట, సాంకేతిక అనుభవం కలిగిన రవి రెడ్డి తన పదవీ విరమణ అనంతరం, 2020లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ వినూత్న వాతావరణంలోకి అడుగు పెట్టారు. సైన్యంలో పని చేసిన సమయంలో సియాచిన్, తూర్పు సిక్కింలో ఎత్తైన ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, రాజస్థాన్, పంజాబ్‌లో పశ్చిమ సరిహద్దులతో సహా వివిధ భౌగోళిక ప్రాంతాలలో ఆయన ఆర్మమెంట్ టెక్నాలజీ ఆఫ్ ఆర్టిలరీ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ మరియు ప్రధాన యుద్ధ ట్యాంకుల వినియోగంలో నైపుణ్యాన్ని ప్రదర్శించారు మరియు వివిధ హోదాలలో సేవలు అందించారు. భారతదేశంలోని అమెజాన్‌లో రవి ప్రస్తుతం AWS కమర్షియల్ సేల్స్ కోసం ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నారు.

విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలోనూ రాణించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలోనూ రాణించాలని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.బాల భాస్కర్ అన్నారు. సిటీ కాలేజీ లియో క్లబ్, చార్మినార్ లయన్స్ క్లబ్ సెంటినియల్ వారి సాజన్యంతో గోషామహల్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, ఎంజీబీఎస్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిరాశ్రయులైన పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ కూడా నేర్చుకున్నప్పుడే పేదరిక రహిత సమాజాన్ని చూడగలమన్నారు. విద్యార్థులు మానవసేవే మాధవసేవ అనే సేవాదృక్పధంతో ఉండాలన్నారు. సమాజహితం కోసం పాటుపడాలన్నారు. సిటీ కాలేజీలో పని చేసే నిరుపేద మహిళా వర్కర్లకు కూడా దుపట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ కాలేజీ లియో క్లబ్ ఫాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్.ఎల్.తిరుపతి, చార్మినార్ లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ సయ్యద్ అన్వర్, లియో క్లబ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ రామవత్ చంటి, రాకేష్, చతుర్వేద్, నరేష్, జైపాల్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

డాల్బీ అట్మాస్ దశాబ్ది వేడుకలు

నవతెలంగాణ హైదరాబాద్: మనస్సులీనమయ్యే వినోద అనుభవాలలో అగ్రగామిగా కొనసాగుతున్న డాల్బీ అట్మాస్ వేడుకలు ప్రారంభించింది. డిసెంబర్ 2012లో పరిచయమైన నాటి నుంచి, సినిమాలు, టీవీ కార్యక్రమాలు, క్రీడలు, గేమింగ్, సంగీతంలో చాలా కంటెంట్ అందుబాటులో ఉండటంతో డాల్బీ అట్మాస్ ఇంటి పేరుగా మారిందని నిర్వాహకులు తెలిపారు. బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హోటల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. భారతదేశంలోని వీక్షకులు 6భారతీయ భాషల్లో 1200 పైగా భారతీయ సినిమాలను, 850 పైగా డాల్బీ అట్మాస్ స్క్రీన్లపై, స్ట్రీమింగ్ సేవలలో పలు గంటల ఒరిజినల్ టీవీ షోలను, డాల్బీ అట్మాస్ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నారు. భారతదేశంలో వినియోగదారుల కోసం క్యాంపెయిన్ డాల్బీ మే సునా ఔర్ దేఖా క్యా ను డాల్బీ ప్రారంభించిందని పేర్కొన్నారు. ఇది మొబైల్లో, ఆడియో వేరబుల్స్ లేదా గదిలో అందుబాటులో ఉండే డాల్బీ మధ్య తేడా గురించి వినియోగదారులకు అవగాహన కల్పించే లక్ష్యాన్ని కలిగి ఉందన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకం

- రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి.రాజు

నవతెలంగాణ-ధూల్‌పేట్



ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లే కీలకమని రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. టీఎస్‌ఆర్టీసీ ఎండి సజ్జనార్ ఆదేశానుసారంగా రంగారెడ్డి రీజియన్ పరిధిలోని హైదరాబాద్-1 డిపోలో గురువారం మర్యాద, సురక్షిత డ్రైవింగ్ పై "హైర్ బస్ డ్రైవర్ల శిక్షణా కార్యక్రమం" డిపో మేనేజర్ బి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రయాణికుల సంస్థకు నిధి అనీ, వారిని మర్యాద పూర్వకంగా గౌరవించడం మన బాధ్యతని తెలిపారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమనీ, ప్రజలు నమ్మకాన్ని మరింత పెంపొందించేలా వాహనాలను నడిపించాలన్నారు. ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మత్తు సేవించి వాహనాలు నడుపకూడదని తగిన జాగ్రత్తలు పాటించాలనీ, పలు సూచనలు సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో హైర్ బస్సు డ్రైవర్లతోపాటు హైదరాబాద్ డిపో 1 డిపో మేనేజర్ బి.కృష్ణారెడ్డి, సీఐడీసీహెచ్.వెంకటేశ్వర్లు, సేఫ్టీ వార్డెన్ లక్ష్మణ్, ఎస్‌డీఐసీ.వెంకటరెడ్డి, ఎల్ఓ రఘు, డిపో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ఆశాల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, కృష్ణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చాంద్రాయణగుట్టలోని బార్కస్ క్లస్టర్, ఉప్పుగూడ యూపీహెచ్‌సీ, ఈదీబజార్ యూపీహెచ్‌సీ, బాలగంజ్ యూపీహెచ్‌సీ, బార్కాస్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, ఎస్పీహెచ్‌ఓలకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలనీ, ఈలోపు ఆంధ్రప్రదేశ్‌లో అశాలకు ఇస్తున్నట్టు ఫిక్స్‌డ వేతనం రూ.10వేలు వెంటనే నిర్ణయం చేయాలన్నారు. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. 2022 డిసెంబర్ 6 నుంచి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలనీ, 2023 జనవరి 18 నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి అశాలకు అదనంగా డబ్బులు చెల్లించాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ, ఏరియర్స్ వెంటనే చెల్లించాలనీ, టీఏ,డీఏ, బస్ పాస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశాల సమస్యలను 2023 ఫిబ్రవరి 3 నుంచి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రామమని, సంగీత, ఆసియా, ఆశాలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీలకు తీరని అన్యాయం

- సబ్కాసాథ్ సబ్ కా వికాస్ ఉత్తి మాట
- మైనార్టీ సంక్షేమ పథకాలకు భారీగా కోత
- ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్

నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశంలో మైనారిటీలకు కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆవాజ్ నగర కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. కేంద్ర బడ్జెట్ ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 2022-23లో రూ.5,020 కోట్లు కేటాయించగా ఈ ఏడాది 2023- 24లో కేవలం రూ.3,097 కోట్లు కేటాయించి 38 శాతం కోత విధించడం దారుణం అన్నారు. ఇది మైనారిటీల అభివృద్ధికి గొడ్డలి పెట్టు అన్నారు. సబ్కాసాథ్ సబ్ కా వికాస్ మోదీ చేసిన వాగ్దానాలు ఉత్త పదం ఊత పదం అని తేలిపోయిందన్నారు. మైనారిటీల విద్య వైద్యం అభివృద్ధి నిరోధక బడ్జెట్ ఇది అన్నారు. మైనార్టీలకు ఉపయోగపడే అనేక స్కీములను రద్దు చేశారన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ స్కీం రద్దుతో లక్షలాది మైనారిటీ విద్యార్థులు నష్టపోయారనీ, నయా ఉడాన్ స్కీం పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల తయారీ కోసం ఉండేదనీ, నేడు దీన్ని కూడా రద్దు చేశారన్నారు. ఉన్నత స్థాయి విద్య కోసం, మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ కోసం ఈ స్కీముని రద్దు చేశారన్నారు. 2023-24లో మోడీ ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కోసం బడ్జెట్ గతంలో రూ. 491 కోట్లు కేటాయించారనీ, ఈసారి తగ్గించి రూ.64 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. నయి మంజిల్ స్కీం కోసం గతంలో రూ.46 కోట్లు ఉండగా ఇది కూడా రూ.10 లక్షలకు తగ్గించడం సరికాదన్నారు. వస్తాద్ స్కిల్ డెవలప్మెంట్ స్కీంకు రూ.47 కోట్లు ఉండగా రూ.10 లక్షలు చేయడం ఏంటని ప్రశ్నించారు. లీడర్షిప్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఉమెన్స్ బడ్జెట్ రూ.2.5 కోట్లు అయితే తగ్గించి ఇది కూడా రూ.10 లక్షలు చేశారన్నారు. నేషనల్ మైనారిటీస్ డెవలప్మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు రూ.159 కోట్ల నుంచి కేవలం రూ.61 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. అన్నింటిలో తగ్గించి మైనార్టీలకు వివక్ష చూపుతుందన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



నవతెలంగాణ-అంబర్‌పేట

మొత్కూర్ నవతెలంగాణ విలేఖరి యాదగిరిపై దాడి చేసిన వ్యక్తులపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని డీజీపీ అంజన్ కుమార్ హామీనిచ్చారు. గురువారం వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులతో కలిసి యాదవ జర్నలిస్టు యూనియన్ నాయకులు కన్వీనర్ మేకల క్రిష్ణ యాదవ్, కో-కన్వీనర్ శెట్టి హరికృష్ణ యాదవ్ డీజీపీని కలిసి మేయర్ మేఘనారెడ్డితోపాటు ఆమె అనుచరులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఘటన జరిగిన తీరును డీజీపీకి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై సానుకూలంగా స్పందించిన డీజీపీ తక్షణమే విచారణకు ఆదేశిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రాజేష్, రవితేజ, రాఘవ, దోతి నాగరాజు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

బషీర్ బాగ్ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా అనురాధను కొనసాగించాలి



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో తొలి ఆదివాసీ గిరిజన మహిళా ప్రొఫెసర్‌గా నియమితులైన గుమ్మడి అనురాధ అనతి కాలంలోనే కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారనీ, ఈ క్రమంలో కళాశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక సంస్కరణలు తీసుకురావడంతో ఆ సంస్కరణలు కొందరి విద్యార్థులకు మింగుడు పడక ఉద్దేశ పూర్వకంగా వైస్ ఛాన్సలర్‌కు ఫిర్యాదు చేశారని అక్కడి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఓయూ పరిపాలన భవనం ఎదుట రెండవ రోజు ధర్నా చేపట్టారు. ఎలాంటి సమాచారం సేకరించకుండా ఒకే సైడ్ సమాచారంతో విధుల నుంచి గుమ్మడి అనురాధను ప్రిన్సిపాల్‌గా ఎలా తొలిగిస్తారని విద్యార్థులు తరగతులను బహిష్కరించి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బిల్డింగ్ ఎదుట ధర్నా చేపట్టారు. అనురాధను ప్రిన్సిపాల్ కొనగించే వరకు తరగతులను బహిష్కరిస్తామని బషీర్ బాగ్ లా కళాశాల విద్యార్థులు అన్నారు. ఈ ధర్నాకు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు పలికారు.

బీసీలను విస్మరించిన కేంద్రం

నవతెలంగాణ-అంబర్‌పేట



బీసీలను కేంద్ర బడ్జెట్‌లో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం విస్మరించినదని కాంగ్రెస్ ఓబీసీ సెల్ కో-ఆర్డినేటర్ రంగ ప్రదీప్ గౌడ్ అన్నారు. బీసీ ప్రధాని అయి ఉండి కూడా బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించ లేదన్నారు. ఇది పూర్తిగా బీసీ వ్యతిరేఖ బడ్జెట్ అన్నారు.

ఆవు, గేదె దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



నవతెలంగాణ-మేడ్చల్

మండల పరిధిలోని పూడూరు గ్రామ పశు వైద్య శాలలో గురువారం 4 నుంచి 8నెలల వయస్సు ఉన్న గేదె, ఆవు దూడలకు ఉచితంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు పశువైద్యాధికారి డాక్టర్ కురుమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారులు నవీన,సుధ సిబ్బంది గణేష్,శ్రీనివాస్,తిరుపతి,నవీన్,పాడి రైతులు బి.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పైప్ లైన్ పనులను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ బాలాజీ టవర్స్ అపార్ట్‌మెంట్స్ వద్ద రూ.98లక్షల వ్యయంతో నూతనంగా ప్రారంభిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను గురువారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ 8వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ యూజీడీ పైప్ లైన్ పనులను నాణ్యతతో, త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ రాఘవేంద్ర రావు, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, నాయకులు సాయి ముదిరాజ్, 8వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మధు, డీఈ దాసయ్య, ఇంజినీర్ అరుణ్, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో వెలుగుచూస్తున్న కొత్త విషయాలు

- ఫేక్ డాక్యుమెంట్లతో లిటిగేషన్ క్రియేట్ చేస్తు అందినంత కబ్జా
- కోర్టు వివాదంలో ఉండగానే అక్రమ నిర్మాణాలకు గల కారణాలేంటి?
- సూటిగా ప్రశ్నిస్తున్న భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి, కూకట్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 1007 భూ వివాదం విషయంలో తవ్విన కొద్ది కొత్త కొత్త విషయాలు బయటపడుతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల, ఉన్నతాధికారుల సహకారంతో దొరికినంత ఎవరికి వారే దోచుకుంటుండగా, మరోవైపు ఈ స్థలం తమదేనంటూ కొంతమంది హక్కుదారులు దొంగ పత్రాలు సృష్టించి కోర్టును సవాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా భూ యాజమాన్యపు హక్కులు తమవేనంటూ నకిలీ నవాబు వారసులను సృష్టించి మూడు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన సామాన్య మధ్యతరగతికి చెందిన 2000 మంది ప్లాట్ల కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయంలో భాగ్యనగర్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ తరఫున న్యాయస్థానంలో వ్యాజ్యాన్ని నడిపిస్తున్న ఎం.లక్ష్మీమాధవి విలేకరులకు వెల్లడించారు. గత 1955 నుంచి ఇప్పటివరకు సీసీఎల్ నుంచి కిందిస్థాయి రెవెన్యూ కార్యాలయంలోని రికార్డుల్లో కూడా కూకట్‌పల్లి గ్రామ శివారు 1007 సర్వే నెంబర్‌లోని 1500 ఎకరాల భూ యాజమాన్యపు హక్కులు అప్పటి నిజాం సర్కారులోని నవాబు రహియాజ్ జంగ్ కుమారుడు ఫజలత్ హుస్సేన్ కలిగి ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. కాగా 1970 దశకంలో అప్పటి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు కోసం ల్యాండ్ అక్రిజేషన్ కింద 1100 ఎకరాలను సేకరించి భూ యాజమాన్య హక్కులు కలిగి ఉన్న ప్రజలతో హుస్సేన్‌కు నష్టపరిహారం కూడా చెల్లించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో భాగంగా 49 ఎకరాలను మిగులు భూమిగా చూపించి ప్రభుత్వానికి ఫజిలత్ హుస్సేన్ అప్పగించారని పేర్కొన్నారు. అందులో ప్రస్తుతం జనప్రియనగర్, పర్వతనగర్ పేర్లతో వెలసిన బస్తీలలో ప్రభుత్వం పేదలకు పట్టాల రూపంలో ఇచ్చిందని వివరించారు. అయితే మిగతా 300 ఎకరాల భూమిని భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీతోపాటు బ్యాంకర్స్ కాలనీ తదితర సొసైటీలకు విక్రయించగా వారు ప్లాట్లు చేసి సామాన్య మధ్య తరగతికి చెందిన ఉద్యోగులకు చేయడం జరిగిందని ఆమె వివరించారు. పూర్తి యాజమాన్య హక్కులతో ఈ ప్రాసెస్ అంతా జరిగిన తర్వాత ఉన్నటువంటి కొత్తగా నవాబు మరొక వారసుడిని సృష్టించి అతనితో పాటు ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించి న్యాయస్థానాల్లో యాజమాన్య హక్కులు తమవేనని సొసైటీలకు చేసిన అగ్రిమెంట్ డీడీలను రద్దు చేయాలని కేసులు వేసి ఏళ్ల తరబడి వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. మొదట్లో న్యాయస్థానంలో కేసులు వేసినప్పుడు 1500 ఎకరాల స్థలం తమకే చెందుతాయని చెప్పి కేసు వేసిన సదరు సంస్థ, తర్వాత అంత మొత్తానికి స్టాంప్ డ్యూటీ చెల్లించాలన్న నిబంధన మేరకు ఏపీ హౌసింగ్ బోర్డుకు రైల్వే స్టేషన్లకు వదిలిన స్థలాలను స్వచ్ఛందంగా వదులుకొని కేవలం 300 ఎకరాలుకు సంబంధించి యాజమాన్య హక్కులు కావాలని వాజ్యం నడపడంలో అంతర్యం ఏంటో అర్థం చేసుకోవచ్చని దీనిద్వారా తెలుస్తుంది. అయితే ప్రైమ్ ప్రాపర్టీ అనే సంస్థ ఇక్కడి స్థల విషయంలో కన్వేసి హక్కులు తమవేనంటూ వ్యవహరించడం విడ్డూరంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఆధారాలు లేకుండా 300 ఎకరాల భూమిపై కోర్టులో యాజమాన్యం హక్కులు అడుగుతున్న వారు స్టాంప్ డ్యూటీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుమారు 100 కోట్ల రూపాయలకు పైగా ఎగవేశారని భాగ్యనగర్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి ఎం.లక్ష్మీ మాధవి విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. అయితే ఈ వ్యవహారంలో జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు రెవెన్యూ అధికారులు సైతం కోట్లలో ముడుపులు ముట్టజెప్పి ప్రభుత్వ ఖజానాకు భారీ మొత్తంలో గండి కొట్టారని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఇక్కడి భూమిపై ఏళ్లతరబడి వ్యాజ్యం నడిపిన ప్రైమ్ ప్రాపర్టీ సంస్థ ఇప్పుడు గ్రీన్ కో అనే సంస్థకు తమ వ్యవహారాలను బదలాయించినట్టు తమకు సమాచారం ఉందని వివరించారు. అంతేకాకుండా ప్రైమ్ ప్రాపర్టీ సంస్థలోని డైరెక్టర్లు ఒకరి నుంచి మరొకరు జీపీ ఎలా చేసుకొని లింకు డాక్యుమెంట్లు సృష్టించుకుని పోతున్నారని ఆరోపించారు. చట్టబద్ధంగా ఇక్కడి భూమిపై ఎలాంటి హక్కులు లేనప్పటికీ గ్రీన్కో అనే సంస్థలోని డైరెక్టర్లు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ డిజిపిఏ ఎలా చేశారని సేల్ డేట్ చేసుకునే అధికారాన్ని కల్పించి నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన 100 కోట్లకు పైగా స్టాంప్ డ్యూటీ ఎగవేశారని దీని ద్వారా తెలుస్తోంది. సామాన్య మధ్యతరగతి చెందిన ఉద్యోగులు ప్రజలు పైస పైసా కూడబెట్టుకొని ఇక్కడే స్థలాన్ని కొంతమంది కొనుగోలు చేసిన బాధితులకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కూకట్‌పల్లి హైటెక్ సిటీ మధ్య ఉన్న ఈ భూమి ఎంతో విలువైనదిగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో 1955 నుంచి ఇప్పటివరకు యాజమాన్యపు హక్కులు ఎవరికి కలిగి ఉన్నాయో ప్రభుత్వం స్పష్టత ఇచ్చి న్యాయస్థానికి నివేదిక అందిస్తే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని వ్యాపార సముదాయాలపై

చర్యలు తీసుకోండి

- కార్పొరేటర్ మహేందర్ కోడిచెర్ల



నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఫైర్ సేఫ్టీ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ, తమ సంపాదనే లక్ష్యంగా నిర్మాణాలు చేపట్టి, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా, తమ ఆస్తులను పెంచుకోవడమే లక్ష్యంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న వాణిజ్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతకు వినతి పత్రం అందజేసిన మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ కొడిచేర్ల, ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ, గతం లో కూకట్‌పల్లిలోని, స్క్రాబ్ గోదాంలు, శివపార్వతి సినిమా హాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదాలు, మొన్న సింద్రాబాద్ లో జరిగిన దక్కన్ మాల్ ప్రమాదం, చిక్కడపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదాలు కావచ్చు, వీటిని దృష్టిలో ఉంచుకొని కూకట్‌పల్లి నియోజక వర్గంలో ఉన్న మాల్స్, హాస్పిటల్స్, సినిమా హాల్‌లు, ఫైర్ సేఫ్టీ నియమాలను అతిక్రమించి నడుపుతు న్నారని, అనుకోని ప్రమాదాలు సంభవిస్తే దానికి పూర్తి బాధ్యత ఎవరు వహిస్తారని, ప్రాణ నష్టాన్ని నిలువరించేందుకు ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేని వాటిపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత యాజమాన్యాలపై కేసులు పెట్టాలని, అలాగే మూసాపేట్ డివిజన్‌లో ఉన్న లక్ష్మీకళ సినిమా హాల్ స్థలంలో గతంలో 2 రెండు స్క్రీన్‌లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు రెండు స్క్రీన్‌ల స్థానంలో 4 స్క్రీన్‌లను ఎలా పెంచారని, అలా చేయడం మూలంగా ప్రజలు ఎక్కువ మంది సినిమా వీక్షించేందుకు వస్తున్నారని, ఈ ప్రదేశంలో ఏ చిన్న ప్రమాదం జరిగినా అధిక ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని, కొత్త సినిమా విడుదల అయితే పార్కింగ్ వ్యవస్థ పూర్తిగా రోడ్డుపైనే నిలుపుతున్నారని, వాహనాదారులు సైతం ఇక్కట్లతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కావున ఇలాంటి వాటిపై చర్యలు తీసుకొని, లక్ష్మీకళ సినిమా హాల్ స్థలంలో పాత పద్ధతి కొనసాగించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి కిషోర్, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

ఖైత్లాపూర్ రోడ్డు విస్తరణ పనులకు మార్గం సుగమం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఖైత్లాపూర్ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయడానికి మార్గం సుగమం అయింది. ఖైత్లాపూర్ వెళ్ళే దారిలో శ్రీ ఉదాసిన మఠ్ వద్ద రోడ్డు విస్తరణ పనులు ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కొల్పోతున్న 10984.98 చదరపు గజాల స్థలాన్ని శ్రీ ఉదాసిన మఠ్ నిర్వాహకులు కమిషనర్ జీహెచ్ఎంసీ పేరుతో గిఫ్ట్ డీడ్ చేస్తూ జీహెచ్ఎంసీకి బదలాయించారు. అట్టి గిఫ్ట్ డీడ్ ఒరిజినల్ డాక్యూమెంట్‌ను గురువారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ మమతకు అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ అట్టి రోడ్డు విస్తరణ పనులను తొందరగా పూర్తి చేసి హైటెక్ సిటీకి వెళ్ళే దారిలో వాహనాలకు ఇబ్బందులను పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సహాయక పట్టణ ప్రణాళిక అధికారి డి.మల్లేశ్వర, శ్రీ ఉదాసిన్‌మఠ్ మేనేజర్ వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆశయాలతో యువత ముందుకు వెళ్లాలి

ఎమ్మెల్యే ఈటల రాజేందర్



నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే నైనా గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనతోపాటు ప్రముఖ శఫలాజిస్ట్, ఆరా సంస్థ ఛైర్మెన్ షేక్ మస్తాన్ ఆరా పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కరోనా సమయంలో భారత ప్రభుత్వం కరోనాని సమర్థవంతంగా ఎదుర్కొని, నేడు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, భారత సైంటిస్టులు మంచి వ్యాక్సిన్లు కనుగొన్నారని ప్రశంసించారు. అదేవిధంగా ఈ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం భారతదేశం అని, స్వామి వివేకానంద ఆశయాలతో ఈ దేశం యువత ముందుకెళ్లాలని తెలియజేశారు. వారు మాట్లాడుతూ యువత ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజానికి సేవ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ డాక్టర్ కొడదాల నరేష్, డైరెక్టర్ కెవి లావణ్య, డీన్ మౌనిక, ప్రిన్సిపల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు టీవీ సీరియల్స్ నటీనటులకు అవార్డులు

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు టీవీలోని సీరియల్స్ కాలక్షేపానికి కాక సందేశం, చైతన్యం కలిగించే విధంగా వుండాలని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వి.రమణ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ నిర్వహణలో ఉత్తమ తెలుగు టీవీ సీరియల్స్ కథానాయకి, నాయకులకు అవార్డు బహుకరణోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని, అవార్డులు బహుకరించి మాట్లాడారు. సీరియల్స్‌లో మహిళలను విలన్లుగా చూపటం ఎక్కువగా ఉందన్నారు. బి.సి.కమిషన్ ఛైర్మెన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మెన్ అనిల్ కూర్మచలం తదితరులు పాల్గొనగా సెల్వెల్ కార్పొరేషన్ ఛైర్మెన్ బండారు సుబ్బారావు అధ్యక్షత వహించిన సభకు సుధాకర్ స్వాగతం పలికారు. అవార్డులు అందుకున్న వారు.

ఉత్తమ సీరియల్ :

మనసంతా నువ్వే,
దర్శకుడు : రాధాకృష్ణ మలినేని,
ఉత్తమ నటుడు: హేమంత్ .ఎం,
ఉత్తమ నటి : గౌతమి, ప్రత్యేక ప్రశంస :
నవీన యాత, ప్రత్యేక ప్రశంస: ఉదయ్ భాగవతుల, ఉత్తమ సీరియల్ మా టీవీ జానకి కలగనలేదు, ఉత్తమ నిర్మాత: కోన రాము, ఉత్తమ నటుడు: నిరుపమ్, (కార్తీక దీపం), ఉత్తమ నటి: ప్రియాంక జైన్, ఉత్తమ సీరియల్ జీ తెలుగు, ఉత్తమ నిర్మాత: కె.వి శ్రీరామ్, ఉత్తమ నటుడు: సూర్యతేజ,
ఉత్తమ నటి: తనూజ (అగ్ని పరీక్ష)



ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణని నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ప్రజల మౌలిక సౌకర్యాలకు అనుగుణంగా మునిసిపల్‌లోని పలు అభివృద్ధి పనులపై పలువురితో చర్చించారు. మునిసిపల్‌లోని ప్రతి వార్డులో సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. శుభకార్యాలకు హాజరవ్వాలని ఆహ్వానపత్రికను అందజేశారు.

ప్రపంచ విజేతలకు జేజేలు

• ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికిన మంత్రి, శాట్స్ చైర్మెన్





నవతెలంగాణ-హైదరాబాద్

ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ విజేతలకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. మహిళల క్రికెట్ సర్క్యూట్‌లో భారత జట్టు ఓ ఐసీసీ ట్రోఫీని తొలిసారి సొంతం చేసుకుని చరిత్ర సృష్టించింది. ఈ చారిత్రక విజయంలో తెలంగాణ నుంచి ముగ్గురు భాగస్వామ్యం పంచుకున్నారు. అహ్మదాబాద్‌లో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, బీసీసీఐ ఆఫీస్ బేరర్ల నుంచి ఘన సత్కారం అందుకున్న అమ్మాయిలు గురువారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. జి. త్రిష రెడ్డి, యశశ్రీ సహా ఫిట్‌నెస్ ట్రైనర్ శాలీనిలకు గురువారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ ఈ. ఆంజనేయ గౌడ్ సహా రాష్ట్ర క్రీడాధికారులు, క్రీడాకారులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ విఐపి లాంజ్‌లో త్రిష రెడ్డి, యశశ్రీ, శాలినీ సహా కోచ్‌లు, కుటుంబ సభ్యులను అభినందించిన మంత్రి, శాట్స్ చైర్మెన్ శాలువాల సన్మానించారు.

'చారిత్రక ప్రపంచకప్ విజయంలో భాగం కావటం గర్వంగా ఉంది. టైటిల్ పోరులో విన్నింగ్ షాట్ కొట్టాలని అనుకున్నాను. కానీ కుదరలేదు. ప్రపంచ విజేతలమనే భావన ఎంతో గొప్పగా అనిపిస్తుందని' గొంగడి త్రిష ఆనందం వెలిబుచ్చింది. త్రిష, యశశ్రీలకు భవిష్యత్‌లో తెలంగాణ ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ హామీ ఇచ్చారు.



ధోని పాత్రకు సిద్ధమే

• టీ20 కెప్టెన్ హార్దిక్ పాండ్య

అహ్మదాబాద్ : స్వదేశంలో వరుసగా 25 ద్వైపాక్షిక సిరీస్‌లు (టెస్టు, వన్డే, టీ20) సాధించిన ఏకైక జట్టుగా టీమ్ ఇండియా చరిత్ర సృష్టించింది. అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్ 168 పరుగుల రికార్డు విజయంతో సొంతగడ్డపై పొట్టి ఫార్మాట్‌లో 50వ విజయం సైతం భారత్ ఖాతాలో వేసుకుంది. రికార్డులు బ్రేక్ చేసిన విజయానంతరం భారత టీ20 కెప్టెన్ హార్దిక్ పాండ్య మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా హార్దిక్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ' నేను అనుకుంటే మ్యాచ్‌లో ఏ సమయంలోనైనా సిక్సర్ కొట్టగలను' ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఓ ఆరేండ్ల కిందట హార్దిక్ పాండ్య మాట ఇది. నాయకుడిగా పగ్గాలు అందుకున్న తర్వాత హార్దిక్ పాండ్య కాస్త దూకుడు తగ్గాడు. జట్టు కోసం ఓ అడుగు వెనక్కి వేసేందుకు సిద్ధమేనని ప్రకటించాడు. స్ట్రయిక్‌రొటేట్ చేస్తూ ఎం.ఎస్ ధోని తరహాలో మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లే పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపాడు.

అది ఇష్టమైనా..!

'నిజాయితీగా చెబుతున్నాను. సిక్సర్లు కొట్టడం నాకు చాలా ఇష్టం. కానీ నేను ఎదగాల్సి ఉంది, అదే జీవితం. భాగస్వామ్యాలు నిర్మించటంలో భాగస్వామ్యం కావాలి. జట్టు సభ్యులకు, ఆవల ఎండ్‌లో ఉన్న ఆటగాడికి కాసింత ప్రశాంతత, దీమా అందించాలని అనుకుంటున్నాను. టీ20 ఫార్మాట్‌లో నాకు మంచి అనుభవం ఉంది. ఒత్తిడిని ఎలా ఎదుర్కొవాలి, ఒత్తిడిని ఎలా జయించాలనే అంశంలో ఇప్పుడు ఎంతో మెరుగ్గా ఉన్నాను. ఈ క్రమంలో నా స్ట్రయిక్‌రేట్‌ను తగ్గించుకోవాల్సి ఉంది. సరికొత్త అవకాశాలు, కొత్త బాధ్యతలు తీసుకోవాలి. జట్టుకు ఎం.ఎస్ ధోని పోషించిన పాత్రను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. నిజానికి, ఆ లక్షణం నాకు సహజసిద్ధంగా వచ్చింది. మహి ఉండగా నేను కుర్ర క్రికెటర్‌ను. మైదానం నలుమూలలా బౌండరీలు బాదేవాడిని. కానీ మహి నిష్క్రమణతో ఆ బాధ్యత నాకు వచ్చింది. అందుకు నాకు ఇబ్బంది లేదు. మేం అనుకున్న ఫలితాలు సాధిస్తున్నామని' హార్దిక్ పాండ్య అన్నాడు.

సరైన సమయంలో..

2019లో వెన్ను గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న హార్దిక్ పాండ్య ఆ తర్వాత మళ్లీ టెస్టు క్రికెట్‌లో కనిపించలేదు. చివరగా 2018 సౌతాంప్టన్ టెస్టులో ఆడాడు. రంజీ ట్రోఫీలో సైతం 2018లోనే చివరగా మెరిశాడు. గాయం నుంచి కోలుకున్న అనంతరం వైట్‌బాల్ క్రికెట్‌కే పరిమితయ్యాడు. సరైన సమయంలో రెడ్ బాల్ క్రికెట్‌లో ఎంట్రీ ఇస్తానని పాండ్య అన్నాడు. ' సరైన సమయం అనిపించినప్పుడు టెస్టు క్రికెట్‌లోకి పునరాగమనం చేస్తాను. ప్రస్తుతం నా ఫోకస్ వైట్‌బాల్ ఫార్మాట్‌పైనే ఉంది. సరైన సమయం వచ్చి, శరీరం సహకరిస్తే టెస్టు క్రికెట్‌లో మళ్లీ ఓ ప్రయత్నం చేస్తానను' అని పాండ్య తెలిపాడు. 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టీ20 ప్రపంచకప్ దిశగా హార్దిక్ పాండ్య ప్రణాళికలు ఉన్నాయని చెప్పవచ్చు.



క్వార్టర్స్‌లో సాయిప్రణీత్

• థాయ్‌లాండ్ మాస్టర్స్ టోర్నీ

బ్యాంకాక్ : తెలుగు తేజం బి. సాయిప్రణీత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో దక్షిణ కొరియా షట్లర్‌పై మూడు గేముల మ్యాచ్‌లో మెరుపు విజయం సాధించింది. వరల్డ్ నం.49పై గంట 18 నిమిషాల్లో విజయం నమోదు చేసిన సాయిప్రణీత్ క్వార్టర్‌ఫైనల్లో కఠిన సవాల్ ఎదుర్కొనున్నాడు. ఆరో సీడ్ చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో సాయి ప్రణీత్ నేడు పోటీపడనున్నాడు. 24-22, 7-21, 22-20తో దక్షిణ కొరియా షట్లర్ జెయాన్ హియోంగ్ జిన్ (క్వాలిఫయర్)ను సాయిప్రణీత్ మట్టికరిపించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన ప్రీ క్వార్టర్స్‌లో సాయిప్రణీత్ చెమటోడ్చాడు. తొలి గేమ్‌ను టైబ్రేకర్‌లో 24-22తో గెలుపొందగా.. నిర్ణయాత్మక గేమ్‌ను సైతం 22-20తో సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌ను దక్షిణ కొరియా ఆటగాడు 21-7తో అలవోకగా నెగ్గాడు. ఒత్తిడిలో మెప్పించిన సాయిప్రణీత్ చాన్నాండ్ల తర్వాత ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు.

థాయ్‌లాండ్ మాస్టర్స్‌లో భారత షట్లర్లకు నిరాశే మిగిలింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇషాన్ భట్‌నగర్, తానిషా క్రాస్టో జోడీ 19-21, 16-21తో ఇండోనేషియా ద్వయం చేతిలో పరాజయం పాలయ్యారు. మెన్స్ డబుల్స్‌లో ఇషాన్, సాయి ప్రతీక్ జోడీ 14-21, 21-18, 24-26తో థాయ్‌లాండ్ జంటతో పోరాడి ఓడారు. మూడు గేముల హోరాహోరీ మ్యాచ్‌లో భారత యువ జంటకు నిరాశే ఎదురైంది. మెన్స్ సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ 22-20, 15-21, 20-22తో హాంగ్‌కాంగ్ షట్లర్ చేతిలో పరాజయం చెందాడు.

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ. భారత్, ఆస్ట్రేలియా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకునే టెస్టు సమరం. గత రెండేండ్లలో వరుసగా ఆసీస్ గడ్డపై కంగారూ జట్టును ఓడించిన టీమ్ ఇండియా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఈ ఏడాది టెస్టుల్లో గొప్ప ప్రదర్శన చేసిన ఆస్ట్రేలియా అదే జోరులో భారత్‌పై విజయంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని స్వదేశం తీసుకెళ్లాలని భావిస్తోంది. అందుకోసం, ఆస్ట్రేలియా జట్టు కఠోర తపస్సు చేస్తుంది.

కంగారూ పడకుండా!


ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్, కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్

• స్పిన్ పిచ్‌లపై ఆసీస్ సాధన
• మ్యాచ్ పరిస్థితుల్లో కఠోర శ్రమ

నవతెలంగాణ క్రీడావిభాగం

స్పిన్ పిచ్‌లపై సాధన

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కొంత కాలంగా భారత్ ఆధిపత్యం నడుస్తుంది. స్వదేశంలో సహజంగానే ఓటమెరుగని టీమ్ ఇండియా.. గత రెండేండ్లలో అద్వితీయ రికార్డు నెలకొల్పింది. ఆస్ట్రేలియాలో వరుస పర్యటనల్లో టెస్టు సిరీస్ విజయం సాధించింది. స్వదేశంలో భారత్ చేతిలో బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌ను చేజార్చుకోవటం కంగారూ జట్టును కలవరానికి గురి చేసింది. ఆసీస్ అడ్డా గబ్బా (బ్రిస్బేన్) స్టేడియంలో సైతం భారత్ చారిత్రక విజయం సాధించి ఆస్ట్రేలియా అహం దెబ్బతినేలా చేసింది. భారత్‌కు ప్రతీకార బహుమతి అందించేందుకు ఆస్ట్రేలియా పకడ్బందిగా సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియా టెస్టు క్రికెటర్లు వారం రోజుల పాటు సిడ్నీలో ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. నాగ్‌పూర్, ఢిల్లీ, అహ్మదాబాద్, ధర్మశాలలో ఎదురయ్యే పిచ్‌లను సిడ్నీలో సిద్ధం చేశారు. ఆ పిచ్‌లపై ఆసీస్ క్రికెటర్లు సాధన చేశారు. టెస్టు మ్యాచ్‌లో నాలుగు, ఐదో రోజు భారత్‌లో పిచ్ ఎలా ఉంటుందో సరిగ్గా అటువంటి పిచ్‌పై కంగారూ క్రికెటర్లు ప్రాక్టీస్ చేశారు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసిన పిచ్‌లపై సాధనతో ఆస్ట్రేలియా జట్టు భారత్‌కు చేరుకుంది.

వార్మప్ వద్దు

విదేశీ పర్యటనల్లో, ప్రత్యేకించి టెస్టు సిరీస్ ముంగిట స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు వార్మప్, టూర్ మ్యాచులు ఆడటం సంప్రదాయంగా వస్తుంది. అయితే, ఆస్ట్రేలియా ఈ సారి వార్మప్ మ్యాచ్ అవసరం లేదని చెప్పేసింది. గత పర్యటనలో వార్మప్ మ్యాచ్‌లో పచ్చిక పిచ్‌ను అందించారు. మ్యాచ్ పరిస్థితులకు ఆ పిచ్ పూర్తి భిన్నం. వార్మప్‌లో ఆ పిచ్‌పై నాలుగు రోజుల ఆట వృథా. దీంతో ఆస్ట్రేలియా ఈసారి పర్యటనలో వార్మప్ మ్యాచ్‌కు దూరంగా ఉంది. అందుకు బదులుగా, బెంగళూర్‌లో నాలుగు రోజుల పాటు సెంటర్ పిచ్‌పై సాధన చేసేందుకు మొగ్గుచూపింది. బెంగళూర్‌కు చేరుకున్న ఆస్ట్రేలియా క్రికెటర్లు ఇక్కడ స్పిన్ ట్రాక్‌లపై సాధన చేయనున్నారు. ప్రధాన పిచ్‌పై మ్యాచ్ పరిస్థితులను తలపించేలా ఆసీస్ జట్టు సాధన చేయనుంది. ఫిబ్రవరి 9న తొలి టెస్టు కాగా.. ఓ రోజు ముందు నాగ్‌పూర్‌కు చేరుకోనుంది. ఆస్ట్రేలియా క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం బెంగళూర్ చిన్నస్వామి స్టేడియం అన్ని ఏర్పాట్లు చేశారు.


ఆసీస్ క్రికెటర్ల సాధన కోసం సిడ్నీలో ఏర్పాటు చేసిన స్పిన్ పిచ్

స్పిన్ దాడి వ్యూహం

భారత్‌లో భారత్‌పై నెగ్గాలంటే స్పిన్‌పై బాగా ఆడితే చాలదు, స్పిన్‌తో భారత్‌ను సైతం దెబ్బకొట్టాలి. దీంతో ఆస్ట్రేలియా ఆ దిశగా తుది జట్టు రూపకల్పనకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసింది. సీనియర్ స్పిన్నర్ నాథన్ లయాన్ (ఆఫ్ స్పిన్), మిచెల్ స్వెప్సన్ (లెగ్ స్పిన్)లకు తోడు యువ స్పిన్నర్లను రంగంలోకి దింపింది. 22 ఏండ్ల టాడ్ మర్ఫీ (ఆఫ్ స్పిన్), అష్టన్ ఆగర్ (లెఫ్మార్మ్ స్పిన్)లకు సైతం జట్టులో చోటు కల్పించింది. ఇటీవల కాలంలో భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారాలు స్పిన్ బౌలింగ్‌పై ఇబ్బందులు పడుతున్నారు. ఈ బలహీనతను వంద శాతం సద్వినియోగం చేసుకోవటంపై ఆసీస్ దృష్టి సారించింది. జీవం లేని పిచ్‌లపై స్పిన్నర్లతోనే వికెట్ల వేటకు రంగం సిద్ధం చేస్తుంది.

ఇదిలా ఉండగా, వీసా కారణంగా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుతో పాటు భారత్‌కు రాలేకపోయిన ఉస్మాన్ ఖవాజా గురువారం బెంగళూర్‌కు బయల్దేరాడు. ఆస్ట్రేలియా క్రికెట్ (సీఏ) వార్షిక అవార్డుల వేడుక నేపథ్యంలో ఆసీస్ క్రికెటర్లు రెండు బృందాలుగా భారత్‌కు చేరుకున్నారు. వీసా ఆలస్యం కావటంతో ఉస్మాన్ ఖవాజా గురువారం అక్కడ్నుంచి బయల్దేరాడు. పాకిస్థాన్‌లో పుట్టిన ఉస్మాన్ ఖవాజా ప్రస్తుతం ఆస్ట్రేలియా పౌరుడు. గతంలో ఖవాజాకు భారత వీసా ఆలస్యమైన సంఘటనలు ఉన్నాయి.

నాన్న ఆఖరి కోరికని తీర్చగలిగాను


సూర్య వశిష్ఠ

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నుంచి వస్తున్న మరో ఆసక్తికరమైన చిత్రం 'బుట్ట బొమ్మ'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ భాగస్వామ్యంతో సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ ఫీల్ గుడ్ రూరల్ డ్రామాకి సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈనెల 4న ప్రేక్షకుల ముందుకు ఈ చిత్రం రానున్న నేపథ్యంలో గురువారం హీరో సూర్య వశిష్ఠ సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు.

- మా నాన్నగారు 30 ఏళ్లకు పైగా సినీ పరిశ్రమలో ఉన్నారు. ఆయనను అందరూ సత్యం గారు అని పిలుస్తారు. రాఘవేంద్రరావు, రాజమౌళి, త్రివిక్రమ్ గారి దగ్గర కోడైరెక్టర్‌గా పనిచేశారు. నన్ను నటుడిగా చూడాలనేది ఆయన కోరిక. నాక్కూడా సినిమాలంటే చాలా ఇష్టం. అమెరికాలో చదువు పూర్తి చేసి, కొంతకాలం ఉద్యోగం చేశాక.. ఇక్కడికి వచ్చి సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టాను.
- ఒకసారి నాన్నగారు 'కప్పేల' సినిమాని చూపించి ఇందులోని ఆటో డ్రైవర్ పాత్ర నీకు సరిగ్గా సరిపోతుందని అన్నారు. ఆ తర్వాత ఆ మూవీ రీమేక్ రైట్స్ సితార సంస్థ తీసుకోవడంతో, మా వాళ్లే తీసుకున్నారు అంటూ ఎంతో సంతోషించారు. కానీ నాన్న కోవిడ్‌తో మరణించడంతో ఒక ఏడాది పాటు అసలు బయటకు రాలేదు. ఆ తర్వాత త్రివిక్రమ్‌గారి సూచన మేరకు సితారలో ఆడిషన్ ఇచ్చాను. అలా ఈ చిత్రానికి ఎంపిక అయ్యాను. మా నాన్నగారి చివరి కోరిక నెరవేరేలా చేసిన త్రివిక్రమ్‌కి, సితార సంస్థకి జీవితాంతం రుణపడి ఉంటాను.
- మలయాళ వెర్షన్ చూసినప్పుడు ఈ సినిమా నాకు చాలా నచ్చింది. ఈ సినిమాలో ఇంత అద్భుతమైన పాత్ర పోషించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. నాకు ఎప్పుడూ ఇలాంటి కొత్తదనం ఉన్న పాత్రలు పోషించాలని ఉంటుంది. ఈ సినిమాలో నా పాత్ర కొత్తగా, ఆకట్టుకునేలా ఉంటుంది. అనిఖా, అర్జున్ దాస్‌తో కలిసి పని చేయడం ఎంతో సరదాగా ఉండేది. అనిఖా మంచి మనసున్న అమ్మాయి. అర్జున్‌దాస్ అప్పటికే స్టార్. ఆయన తన గొంతుతో ఎందరో అభిమానులను సొంతం చేసుకున్నారు. దర్శకుడు రమేష్ ప్రతి సన్నివేశం, ప్రతి షాట్ మీద చాలా వర్క్ చేస్తారు.
- ఇటీవల మా దర్శక, నిర్మాతలు సినిమా చూసి నా నటనను మెచ్చుకోవడంతో చాలా ఆనందం కలిగింది. నాకు సహజత్వానికి దగ్గరగా ఉండే సినిమాలు అంటే ఇష్టం. అలాంటి సినిమాల్లోనే ఎక్కువగా నటించాలి అనుకుంటున్నాను. ఈ సినిమా టీజర్ విడుదలయ్యాక పలువురు నూతన దర్శకులు నన్ను సంప్రదించారు. మరికొన్ని కథలు విని, ఈ సినిమా విడుదల తర్వాత నిర్ణయం తీసుకోవాలి అని అనుకుంటున్నాను.

ఏ పాత్రలోనైనా మెప్పిస్తా..


క్రిష్ సిద్ధిపల్లి

గత 8 ఏళ్ళుగా ఇండస్ట్రీలో పలు సెగ్మెంట్స్‌లో వర్క్ చేస్తూ రామ్‌గోపాల్‌వర్మ దగ్గర దర్శకత్వశాఖలో మెళకువలు నేర్చుకుని, అడవి శేష్ 'క్షణం' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 'గూఢచారి, టైగర్‌నాగేశ్వరావు' వంటి సినిమాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా, 'నేను లేని నా ప్రేమకథ' సినిమాలో లీడ్ రోల్‌లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు క్రిష్ సిద్ధి పల్లి. ప్రస్తుతం మూడు ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్న క్రిష్ సిద్ధి పల్లి పుట్టినరోజు నేడు (శుక్రవారం).

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, '2014లో 'క్షణం'కి అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. ఇది నా లైఫ్‌కు ఒక టర్నింగ్ పాయింట్ . నా వర్కింగ్ స్టైల్ నచ్చి 'గూఢచారి' సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా అవకాశం ఇచ్చారు. అలాగే పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో కూడా కొన్ని సినిమాలకి, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌లో 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. నటనలో భాగంగా 'నేను లేని నా ప్రేమకథ'లో నవీన్ చంద్ర , నేను మెయిన్ లీడ్స్‌గా చేశాం. ఈ సినిమా నాకు మంచి పేరు తీసుకువచ్చింది. ప్రస్తుతం సుఖీభవ అనే ప్రాజెక్ట్‌లో ఒక విలేజ్ బాయ్ రోల్ ప్లే చేశాను. సెకండ్ ప్రాజెక్ట్ 'రమ్య, రాబర్ట్, రహీం' సినిమాలో బ్లైండ్ క్యారెక్టర్ చేస్తున్నాను. 'ఎంగేజ్‌మెంట్' అనే సినిమా నాలుగు లాంగ్వేజ్‌లో జరుగుతోంది. ఇది డిఫరెంట్ లవ్‌స్టోరీ. ఇవి కాకుండా 'లవ్ ఇన్ 65'లో యంగ్ రాజేంద్ర ప్రసాద్ రోల్ చేశాను. ఆహాకీ లావణ్య త్రిపాఠి ఫ్రెండ్ రోల్ చేస్తున్నాను. ఇలా మెయిన్ లీడ్స్‌లోనే కాకుండా డిఫరెంట్ రోల్స్‌లో కూడా నటిస్తున్నాను' అని అన్నారు.

నవచిత్రం

పదహారణాల తెలుగు పాట


రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్

రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలి ప్రసాద్ హీరోయిన్‌గా రూపొందుతున్న లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో ఎస్.వి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ ప్రై.లి, ఎ.జి.ఫిల్మ్ కంపెనీ పతాకాలపై సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ బెల్లంకొండ నిర్మిస్తున్నారు. త్వరలో సినిమా విడుదల కానుంది. తాజాగా డైరెక్టర్ హరీష్ శంకర్ టైటిల్ సాంగ్ విడుదల చేశారు. హరి చరణ్, చిన్మయి శ్రీపాద పాడిన ఈ 'శశివదనే' పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించారు.

ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ, 'సంగీత దర్శకుడు శరవణన్‌కు కంగ్రాట్స్. చాలా రోజుల తర్వాత మంచి శాస్త్రీయ సంగీతాన్ని విన్నాను. మంచి తెలుగు టైటిల్ పెట్టారు. నాకు బాగా నచ్చింది. 'శశివదనే' అంటే మంచి చంద్రబింబం లాంటి ముఖం ఉన్న అమ్మాయి అని అర్థం. ఆల్ ది బెస్ట్ టు రక్షిత్, కోమలి. వాళ్లిద్దరి కెమిస్ట్రీ బావుంది. నిర్మాత అహితేజ, అభిలాషకి అడ్వాన్స్ కంగ్రాట్స్. ఒక్క సంగీతమే కాదు, సినిమాలో కూడా తెలుగు నేటివిటీ ఉంది. విజువల్స్ బావున్నాయి. మంచి సాహిత్యం, మంచి సంగీతంతో కూడిన చిత్రమిది' అని తెలిపారు.

> హరిశశంకర్‌కి, మా సంగీత దర్శకుడికి థ్యాంక్స్. మంచి సాంగ్ ఇచ్చాడు. ఈ ఒక్క సాంగే కాదు, మిగతా పాటలు దీన్ని మించి ఉంటాయి. లిరిసిస్ట్ కిట్టు ప్రతి పదం అర్థం అయ్యేలా, ప్రతి పదానికి మీనింగ్ ఉండేలా రాశారు. కొత్త దర్శకుడైన నన్ను సపోర్ట్ చేసిన హీరో హీరోయిన్లు, నిర్మాతలకు ధన్యవాదాలు.
>
> - దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన

'మా సాంగ్‌ని విడుదల చేసిన హరీష్ శంకర్‌కి థ్యాంక్స్. సాంగ్ చాలా బాగా వచ్చింది. కోమలీ అద్భుతంగా చేశారు' అని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు.

కోమలీ ప్రసాద్ మాట్లాడుతూ, 'హరీష్ శంకర్ వండర్ ఫుల్ టెక్నీషియన్. ఆయనకు సాంగ్ నచ్చడం మా ఫస్ట్ సక్సెస్. దర్శకుడు, సంగీత దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, వీళ్ళందరినీ వెనుక ఉండి నడిపించిన నిర్మాతలు... ఎవరు లేకపోయినా ఇంత అందంగా సాంగ్ వచ్చేది కాదు. రక్షిత్ లేకపోతే సాంగ్ ఇలా వచ్చేది కాదు' అని అన్నారు. 'ఇళయరాజా గారి రేంజ్ కాకపోయినా ఆ టచ్ ఉన్న సాంగ్ ఇది. చాలా రోజుల తర్వాత ఇంగ్లీష్ పదం లేకుండా పూర్తిగా తెలుగు పదాలు ఉన్న సాంగ్ రాసిన కిట్టూ విస్సాప్రగడకి థ్యాంక్స్' అని నిర్మాత అహితేజ బెల్లంకొండ చెప్పారు.

సీనియర్ దర్శకుడు సాగర్ ఇకలేరు


సాగర్

ప్రముఖ దర్శకుడు సాగర్ (70) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.

గుంటూరు జిల్లా మంగళగిరిలో పుట్టిన సాగర్ అసలు పేరు విద్యాసాగర్ రెడ్డి. చదువుకుంది చెన్నైలో. చదువులో అంత చురుకైనవాడు కాదు. ఎట్టకేలకు ఎస్-ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. అయితే సినిమాపై ఉన్న ఆసక్తిని గమనించిన వాళ్ళ అమ్మగారు ఆయన్ని ఓ అసిస్టెంట్ ఎడిటర్ దగ్గర జాయిన్ చేస్తే, మీ అబ్బాయి ఈ ఇండస్ట్రీకి పనికి రాడు అని చెప్పాడు. దీంతో ఆమెకు కొడుకు విషయంలో బెంగపట్టుకుంది. అయితే ఆయన మాటల్ని మాత్రం సాగర్ సీరియస్‌గా తీసుకుని సినిమాల్లో ఎలాగైనా రాణించాలని నిర్ణయించుకున్నారు.

ఇందులో భాగంగా 1969లో శ్రీహరి దగ్గర ఎడిటింగ్ అసిస్టెంట్‌గా చేరారు. ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో దాదాపు 20 సినిమాలకు పని చేశారు. తర్వాత 'మహ్మద్‌బీన్ తుగ్లక్' చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా జాయిన్ అయ్యారు. పలు చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేసిన ఆయన నరేష్, విజయశాంతి ప్రధాన తారాగణంగా 'రాకాసి లోయ' చిత్రాన్ని తెరకెక్కించారు. అది మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత సుమన్, భానుచందర్‌తో 'డాకు' తీశారు. అది కూడా మంచి సక్సెస్ సాధించడంతో సాగర్‌ని అందరూ యాక్షన్ డైరెక్టర్ అని పిలవడం స్టార్ట్ చేశారు.

ఆ తర్వాత 'అమ్మదొంగ', 'ఖైదీబ్రదర్స్', 'స్టూవర్ట్‌పురం దొంగలు', 'రామసక్కనోడు', 'యాక్షన్ నెం.1', 'ఓసి నా మరదలా' వంటి తదితర ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించి, పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. అలాగే ప్రస్తుతం పరిశ్రమలో అగ్రస్థాయి దర్శకులుగా పేరొందిన వి.వి.వినాయక్, శ్రీనువైట్ల, జి.నాగేశ్వరరెడ్డి, రవికుమార్ చౌదరి వంటి వాళ్ళంతా సాగర్ శిష్యులే కావడం విశేషం. అలాగే మూడుసార్లు ఆయన తెలుగు దర్శకుల సంఘానికి అధ్యక్షుడిగానూ సేవలు అందించారు. అగ్ర దర్శకుడిగానే కాకుండా మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషిగానూ పేరొందిన సాగర్ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సూర్యాపేట జంక్షన్‌లో ఏం జరిగింది?


ఈశ్వర్, నైనా సర్వర్

'కొత్తగా మా ప్రయాణం' ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'సూర్యాపేట జంక్షన్'.

'కథనం' ఫేమ్ నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో యోగా లక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్.ఎస్‌రావు, విష్ణువర్ధన్ సంయుక్తంగా నిర్మిస్తున్న యూత్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్ ఇది.

ఈ చిత్ర టీజర్‌ని హీరో ఈశ్వర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ చూసిన మీడియా మిత్రులు, మా ఫ్రెండ్స్ చాలా బాగుంది అంటుంటే మా కష్టానికి ఊపిరి పోసినట్లు అనిపించింది. నా కథని నమ్మి రాజేష్ నాతో రెండున్నర సంవత్సరాలు జర్నీ చేశారు. ఈ అవుట్‌పుట్ రావడానికి కారణమైన మా డైరెక్టర్‌కి, మా టీమ్‌కి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈమూవీని ఒక యదార్థ కథతో సినిమాటిక్‌గా మలుచుకుని చేశాం. హీరోయిన్ నైన సర్వల్ బాగా సపోర్ట్ చేసింది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ వాళ్ళ పాత్రల్లో బాగా చేశారు. నటీనటులు, టెక్నీషియన్ల సమష్టి కృషితో సినిమా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు.

'తెలుగులో ఈ అవకాశం ఇచ్చిన మా రాజేష్‌కి, ఈశ్వర్‌కి చాలా థ్యాంక్స్. ఈ సినిమా టీజర్ చాలా నచ్చింది. ఇప్పుడు నాకు ఈ సినిమా మంచి సక్సెస్ అవుతుంది అని నమ్మకంగా ఉంది' అని హీరోయిన్ నైన సర్వార్ చెప్పారు.

దర్శకుడు రాజేష్ మాట్లాడుతూ,'టీజర్ చాలా బాగుంది అని అంటుంటే హ్యాపీగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన మా ఈశ్వర్‌కి కృతజ్ఞతలు మిగతా విషయలు ట్రైలర్ లాంచ్‌లో మాట్లాడతాను' అని అన్నారు. 'సినిమా బాగా వచ్చిందని మీకు టీజర్ చూస్తే అర్థం అయ్యే ఉంటుంది. ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు. ఈ చిత్రం చాలా మంచి సక్సెస్ అవుతుంది అని నమ్ముతున్నాను' అని ప్రొడ్యూసర్ నల్లపల్లి శ్రీనివాస్ తెలిపారు.

అభిమన్యు సింగ్, లక్ష్మణ్, భాషా, సూర్యహరీష్, చలాకీ చంటి,మున్న వేణు, చమ్మక్ చంద్ర, కోటేశ్వరరావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు : అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాసరావు, విష్ణువర్ధన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : పాండు అలిజాల, డైరెక్టర్ : యస్.రాజేష్, స్టోరీ : ఈశ్వర్, మ్యూజిక్ : రోషన్ సాలూరి, గౌర హరి, డి.ఓ.పి : అరుణ్ ప్రసాద్, ఎడిటర్ : ఎం.ఆర్.వర్మ, లిరిక్స్ : ఎ.రెహ్మాన్, రైటర్స్ : సత్య రాజేంద్ర భరద్వాజ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కేంద్ర ప్రభుత్వంలో 9.79 లక్షలకుపైగా పోస్టులు ఖాళీలు

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌ల్లో 9,79,327 పోస్టులు ఖాళీలు ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021 మార్చి 1 నాటికి 78 మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్‌ల్లో 9,79,327 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అందులో అత్యధికంగా రైల్వే శాఖలో 2,93,943, డిఫెన్స్ లో 2,64,706, హౌం శాఖలో 1,43,536, పోస్టల్లో 90,050, రెవెన్యూలో 80,243, ఆడిట్, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో 25,934 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

12 పెట్రోలియం పీఎస్‌యూల్లో 5,460 ఖాళీలు..కేంద్ర మంత్రి రామేశ్వర్ తేలీ

దేశంలో 12 పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్ యు)ల్లో 5,460 ఖాళీలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ తెలిపారు. వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జనవరి నాటికి దేశంలో 12 పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో 5,460 ఖాళీలు ఉన్నాయని అన్నారు. అందులో ఎగ్జిక్యూటివ్ 3,533 పోస్టులు కాగా, నాన్ ఎగ్జిక్యూటివ్ 1,927 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.

రాష్ట్రాల కాలుష్యం నియంత్రణ బోర్డుల్లో 5,873 పోస్టులు ఖాళీ

రాష్ట్రాల, కేంద్ర పాలిత కాలుష్యం నియంత్రణ బోర్డుల్లో 5,873 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మొత్తం 11,956 పోస్టులకు గాను, 5,873 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. అందులో ఆంధ్రప్రదేశ్ కాలుష్యం నియంత్రణ బోర్డు (ఏపీపీసీబీ)లో 182 పోస్టులు, తెలంగాణ కాలుష్యం నియంత్రణ బోర్డు (టీఎస్ పీసీబీ)లో 103 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది.

రెండున్నరేండ్లలో మూతపడ్డ 6,222 ఎంఎస్ఎంఈలు

దేశవ్యాప్తంగా రెండున్నరేళ్లలో 6,222 ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సహాయ మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2020 జులై 1 నుంచి 2023 జనవరి 30 మధ్య దేశంలో 6,222 ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయని తెలిపారు.

మోడీ సర్కారుది కోతల బడ్జెట్


- దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే యత్నం
- సంక్షేమానికి నిధుల తగ్గింపు
- సీఐటీయూ ఆన్‌లైన్ సభలో ప్రొఫెసర్ పాపారావు, ఎం.సాయిబాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ సర్కారు కోతల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందనీ, దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలను పరిష్కరించే దిశగా బడ్జెట్ లేదని ఆర్థికవిశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టి.రాజారెడ్డి అధ్యక్షతన 2023-24 కేంద్ర బడ్జెట్ సీపీఎస్‌యూ భవితవ్యం అనే అంశంపై ఆన్‌లైన్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ..మోడీ సర్కారు సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను తగ్గించిందని విమర్శించారు. దీంతో సమాజంలో అంతరాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులను తగ్గించిందనీ, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించే ప్రయత్నాన్ని ఏమాత్రం చేయలేదని విమర్శించారు. రైల్వేలు, పోర్టులను కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నాలను మరింత తీవ్రం చేసిందని తెలిపారు. ఎల్ఐసీ, బ్యాంకులను నిలువునా ముంచేసిన అదానిని కాపాడే యత్నంలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. ఓవైపు కార్పొరేట్ల అనుకూల విధానాలను తీవ్రరూపం చేస్తూ మరోవైపు జాతీయవాదం ముసుగుతో దేశ ప్రజలను, యువతను బీజేపీ రెచ్చగొడుతున్న తీరును ఎండగట్టారు. వాస్తవానికి బీజేపీ విధానాలతో ఎక్కువ నష్టపోతున్నది పేద, మధ్యతరగతి ప్రజలేనని చెప్పారు. కొత్తపన్ను విధానం లాభాల కంటే నష్టాలను ఎక్కువ చేసేలా ఉందని చెప్పారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌ను ఎక్కడా పట్టించుకోలేదన్నారు. ఎంప్లాయిమెంట్ సృష్టి ప్రస్తావనే లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడకపోగా వాటని మరింత నిర్వీర్యం చేసే దిశగా మోడీ సర్కారు వెళ్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించబోతున్నాయని హెచ్చరించారు. ప్రజల దగ్గర పొదుపు లేకుండా చేసే పనికి మోడీ సర్కారు పూనుకున్నట్టు ఈ బడ్జెట్ ద్వారా అర్థం అవుతున్నదన్నారు. ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు మాట్లాడుతూ.. ప్రజలు తాము దాచుకున్న సొమ్మును షేర్‌మార్కెట్‌లలో పెట్టేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. బంగారం కొనకుండా, డబ్బులను పొదుపు చేసుకోకుండా పేకాటలాగున్న షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేలా చేసే ఎత్తుగడలో భాగంగానే డీమానిటైజేషన్ చేసిందని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభాలన్నీ కలిసి ఓ పెద్ద సంక్షోభం వచ్చిందనీ, పెట్టుబడి దారీ వ్యవస్థపై అది తీవ్రస్థాయిలో ముట్టడిస్తున్నదని చెప్పారు. బడ్జెట్ అంటే అంకెలు, సంఖ్యలు కాదనీ, అదొక రాజకీయమని అన్నారు. ఉన్న వనరులేంటి? ప్రాధాన్యత అంశం ఏమిటి? ఎంత కేటాయించాలి? అనేది కీలకమన్నారు. అక్కడే వర్గదృక్పథం బయటపడుతుందన్నారు. మోడీ సర్కారు కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. పెట్టుబడిదారీ వ్యవస్థను నిలబెట్టే తోలు బొమ్మలాటలో మోడీ సర్కారు ఒకటని చెప్పారు. ధనికులకు మేలు చేయడం, పేదలను బానిసలుగా ఉంచడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలోనే దాగి ఉందని విమర్శించారు. అంతర్జాతీయ పెట్టుబడి దారుల ఒత్తిడి మేరకు ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు ఉందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, బి.మధు హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జె.రాఘవరావు పాల్గొన్నారు.

అప్పర్ భద్రతో రాయలసీమకు తీవ్ర నష్టం

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిఎం సమాధానం చెప్పాలి : టీడీపీ అధినేత చంద్రబాబు



అమరావతి : కర్నాటక రాష్ట్రం తలపెట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో సాగునీటి పరంగా రాయలసీమ ప్రాంతానికి తీవ్ర నష్టం జరగనుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జగన్ కనీస స్పృహ లేకుండా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో చంద్రబాబు పలు అంశాలపై ఆన్‌లైన్ విధానంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సీమ ప్రాజెక్టులను మూలన పడేసి ప్రభుత్వం నష్టం చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. జగన్ గతంలో చెప్పిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు. పోలవరం, నదుల అనుసంధాన ప్రాజెక్టులు పూర్తయి ఉంటే రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీళ్ల ఇచ్చే అవకాశం ఉండేదని తెలిపారు. రాష్ట్రాన్ని జగన్ ఎటుతీసుకెళ్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకు జిఓ 1 తేవడం, రాజకీయ పక్షాలపై ఆంక్షలు, కేసులు, ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాలు తప్ప ముఖ్యమంత్రికి రాష్ట్రం గురించి పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో జగన్ అడుగడుగునా రాజీ పడుతున్నారని అన్నారు. విభజన చట్టం ప్రకారం సాధించాల్సిన హక్కుల విషయంలో వైసిపి ప్రభుత్వ వైఫల్యం రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. విభజన హక్కుల సాధనలో కీలకమైన చివరి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పొందడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైసిపి ఎంపిలు సొంత లాబీయింగ్ కోసమే పనిచేస్తున్నారని, రాష్ట్రం కోసం కాదని అన్నారు.

అదానీకి బ్యాంక్‌ల ఉచ్చు అప్పులివ్వడానికి నిరాకరణ

- తాజాగా సిటీ బ్యాంక్ నిర్ణయం
- షేర్లు కొనడానికి దిక్కులేరు
- రూ.8.65 లక్షల కోట్లు ఫట్



న్యూఢిల్లీ : అదానీ గ్రూపు మోసాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్టును బ్యాంక్‌లు, రెగ్యులేటరీ సంస్థలు విశ్వాసంలోకి తీసుకుంటున్నాయి. అదానీ కంపెనీల బాండ్లు హామీలకు పనికిరావని ఇప్పటికే స్విస్‌కు చెందిన క్రెడిట్ సూస్సె ప్రకటించగా.. తాజాగా అమెరికకు చెందిన సిటీ గ్రూపు బ్యాంక్ అదే తరహా షాక్ ఇచ్చింది. అదానీ కంపెనీలు జారీ చేసిన బాండ్లను తనఖాగా పెట్టుకుని బ్రోకర్లకు అప్పులివ్వలేమని స్పష్టం చేశాయి. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ కూడా అప్రమత్తమయ్యింది. అదానీ గ్రూపునకు ఇచ్చిన అప్పులపై తమకు సమగ్ర వివరాలను ఇవ్వాలని బ్యాంక్‌లను కోరినట్టు రిపోర్టులు వస్తున్నాయి. క్రెడిట్ సూస్సె అదానీ కంపెనీల బాండ్ల విలువను సున్నాగా పేర్కొన్న విషయం తెలిసిందే. "అదానీ కంపెనీలు జారీ చేసిన సెక్యూరిటీల ధరల్లో ఇటీవల భారీ తగ్గుదలను చూశాం. ఆ గ్రూప్ ఆర్థిక పటిష్టంపై ప్రతికూల వార్తలను చూస్తున్నాం. అదానీ జారీ చేసిన అన్ని సెక్యూరిటీలకు తక్షణం అమలులోకి వచ్చేలా రుణ విలువను తొలగించాలని నిర్ణయించాం." అని సిటీ గ్రూపు బ్లూమ్‌బర్గ్ న్యూస్‌కు తెలిపింది. ఇప్పటికే తాకట్టు పెట్టుకున్న బాండ్ల స్థానంలో క్లయింట్లు సాధారణంగా నగదు లేదా మరొక్కటి తాకట్టు పెట్టాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. లేదంటే ఆ సెక్యూరిటీలను లిక్విడేట్ చేసుకునే హక్కు విత్త సంస్థలకు ఉంటుందన్నారు.

ఎఫ్‌పీఓ నిధులను తిరిగిస్తాం : అదానీ

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీఓ ద్వారా సమీకరించిన రూ.20,000 కోట్ల నిధులను తిరిగి ఇన్వెస్టర్లకు చెల్లిస్తామని గౌతమ్ అదానీ గురువారం స్పష్టం చేశారు. ఈ ఎఫ్‌పీఓను నిలిపివేయాలని తమ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారన్నారు. స్టాక్ మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

కుప్పకూలుతున్న షేర్లు..

అదానీ గ్రూపు పన్ను ఎగవేతలు, అక్రమాలు, మోసాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్ స్టాక్ మార్కెట్లలో పెను ప్రకంపనలు సష్టిస్తోంది. అదానీ గ్రూపు కంపెనీలతో పాటు ఆయా సంస్థలకు రుణాలిచ్చిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల షేర్లు కూడా నేలచూపులు చూస్తున్నాయి. అదానీ గ్రూపునపై వస్తున్న ఆరోపణలకు తోడు గ్లోబల్ విత్త కంపెనీల ఆంక్షలతో అదానీ కంపెనీల షేర్లు కుప్పకూలుతున్నాయి. ఈ దెబ్బకు వారం రోజుల్లో అదానీ గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.8.65 లక్షల కోట్లు లేదా 45 శాతం పైగా పతనమయ్యింది. గురువారం సెషన్‌లో అదానీ కంపెనీల షేర్లన్నీ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ విలువ 26.7 శాతం పతనమయి రూ.1,565కు క్షీణించింది. ఓ దశలో 35 శాతం క్షీణించి రూ.1,494 కనిష్ట స్థాయికి దిగజారింది. ఉదయం ఓ దశలో అమ్మేవారే కానీ.. కొనేవారు లేని దుస్థితి నెలకొంది. అదానీ ట్రాన్స్‌మిషన్ షేర్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ సూచీ 10 శాతం చొప్పున క్షీణించాయి. అదానీ పోర్ట్స్ 6.6 శాతం, అదానీ పవర్ 4.98 శాతం, అదానీ విల్మర్ 5 శాతం చొప్పున నేల చూపులు చూశాయి. ఈ వారం రోజుల్లోనే అనేక సూచీలు ఆల్‌టైం గరిష్ట స్థాయి నుంచి దాదాపు 60 శాతం మేర క్షీణించాయి. ఇన్వెస్టర్లలో విశ్వాసం కల్పించేందుకు గౌతం అదానీ స్వయంగా ప్రకటన జారీ చేసినప్పటికీ షేర్ల పతనం ఆగలేదు.

మరోవైపు బీఎస్ఈ సెన్సెక్స్ 224 పాయింట్లు రాణించి.. 59,932కు చేరగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ స్వల్పంగా 6 పాయింట్లు తగ్గి 17,610 వద్ద ముగిసింది.

18 కొలీజియం సిఫారసులు వెనక్కి ఇంకా పెండింగ్‌లో 64

- సుప్రీంకోర్టులో 7 ఖాళీలు ...హైకోర్టుల్లో 334 ... జిల్లా కోర్టుల్లో 5,767
- రాజ్యసభలో కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు కొలీజియం చేసిన 18 సిఫారసులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపినట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. గురువారం రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా అడిగిన రెండు ప్రశ్నలకు కేంద్ర లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. న్యాయమూర్తి పదవికి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన 18 సిఫారసులను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించిందనీ, ఆ ఫైళ్లను కొలీజియంకు తిరిగి ఇచ్చిందని తెలిపారు. కొలీజియం చేసిన 64 సిఫారసులు ప్రభుత్వం ముందు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. "జనవరి 31 నాటికి కొలీజియం సిఫారసు మొత్తం 18 ప్రతిపాదనలు ఉన్నాయి. వాటిలో 6 సిఫారసులను కొలీజియం పునరుద్ఘాటించింది. 7 సిఫారసులకు సంబంధించి హైకోర్టు కొలీజియంల నుంచి తదుపరి ఇన్‌పుట్‌లను కోరింది. 5 సిఫారసులను రద్దు చేయాలని నిర్ణయించింది" అని సమాధానంలో పేర్కొన్నారు.

హైకోర్టులో 333 న్యాయమూర్తి పోస్టులు ఖాళీ

వివిధ హైకోర్టుల్లో 1,108 మంది న్యాయమూర్తులు ఉండగా, ప్రస్తుతం 775 మంది న్యాయమూర్తులు ఉండగా, 334 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ ఖాళీలకు సంబంధించి హైకోర్టు కొలీజియాలు సిఫారసు చేసిన 142 ప్రతిపాదనలు ప్రాసెసింగ్‌లో వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. 2019 నుంచి జనవరి 2023 వరకు సుప్రీంకోర్టుకు 22 మంది న్యాయమూర్తులు, వివిధ హైకోర్టులకు 446 మంది న్యాయమూర్తులు నియమితులయ్యారని తెలిపారు. సుప్రీం కోర్టులో ప్రస్తుతం 7 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 5, తెలంగాణ హైకోర్టులో 10 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2023 జనవరి 30 వరకు దేశంలో జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,767 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏపీలో 76, తెలంగాణలో 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయని మల్లికార్జున ఖర్గే అడిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.

ప్రజలకు చేరువగా పాలన

- జాతీయ రక్షణ కళాశాల ప్రతినిధి బృందం సమావేశంలో సీఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజలకు చేరువగా పాలనను తీసుకెళ్తున్నామనీ, తెలంగాణ చిన్నరాష్ట్రమైనప్పటికీ వివిధ రంగాల్లో గుణాత్మక అభివృద్ధి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో జాతీయ రక్షణ కళాశాల ప్రతినిధి బృందంతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. వేసవిలోనూ పరిశ్రమలకు, వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. తద్వారా, వ్యవసాయంలో అద్వితీయమైన పురోగతి సాధించామనీ, ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తిలో గణనీయ వృద్ధి సాధించామని వివరించారు. రాష్ట్రంలో 2014 లో 5.05 లక్షల కోట్ల రూపాయలున్న జీఎస్‌డీపీ 2022 -2023 నాటికి రూ.13.27 లక్షల కోట్లకు చేరుకుందని తెలిపారు. అదేవిధంగా రూ.1 .24 లక్షలు ఉన్న తలసరి ఆదాయం రూ 3 .17 లక్షలకు చేరుకుందని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను విభజించామని తెలిపారు. పట్టణాభివృద్ధిని ప్రోత్సహించడానికి అనేక కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. మిషన్ భగీరథ పథకం తాగునీటి సమస్యను తగ్గించడమే కాకుండా అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలను పరిష్కరించడంలోనూ దోహదపడిందని తెలిపారు. ఆరోగ్య రంగంలో వివిధ అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలలో తెలంగాణా ఒకటన్నారు. హరితహారం ద్వారా 7.7 శాతానికి పచ్చదనం పెరిగిందని తెలిపారు. ఎన్‌డీసీ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి ప్రియాంక్ భారతి నేతత్వంలోని బృందసభ్యులు మాట్లాడుతూ.. పథకాల ద్వారా అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజలకు సాధికారత కల్పించడంతోపాటు టి-హబ్, ఇతర కార్యక్రమాల ద్వారా సాంకేతికతను వినియోగించుకోవడం అభినంద నీయమన్నారు. ఈ సందర్భంగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఇతర ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు.

పేదలకు ప్రపంచ స్థాయి విద్య అందించాలి

వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

- రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన



వసతి గృహ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-రాజేంద్రనగర్

రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి పేరుతో పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించడానికి అంతర్జాతీయ స్థాయిలో ఒక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆర్థిక మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ట్రస్టు సభ్యులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని సాగర్ హిల్స్‌లో 15 ఎకరాల్లో నిర్మిస్తున్న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి వసతి గృహానికి గురువారం మంత్రులు ప్రశాంత్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి వసతి గృహం నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ రూ.10 కోట్లు, 15 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక్కడ వసతి గృహంతోపాటు అంతర్జాతీయ ప్రమాణాల్లో యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. పేద పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడానికి కృషి చేయాలని ట్రస్ట్ సభ్యులకు సూచించారు. వసతి గృహ నిర్మాణానికి తక్షణం రూ.5 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వసతి గృహ నిర్మాణంతోపాటు పక్కనే ఎకరా స్థలాన్ని రహదారి కోసం ఇవ్వడానికి సీఎం కేసీఆర్‌తో చర్చిస్తానని చెప్పారు. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి అంటే సీఎం కేసీఆర్‌కు ఎంతో అభిమానం అన్నారు. పేద ప్రజలు చదువుకోవడానికి వసతి గృహాలు, కళాశాలలు కట్టించి ఎంతో మానవ తావాదిగా రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. ఆయన ఆశలకు అనుగుణంగా ట్రస్టు సభ్యులు పనిచేయాలని మంత్రి సూచించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి కళాశాలలో తాను కూడా చదువుకున్నానని చెప్పారు. అప్పట్లోనే బాలికల కోసం ప్రత్యేక వసతి గృహం నిర్మించడం ద్వారా తనలాంటి వాళ్ల ఎందరో అందులో చదువుకొని గొప్ప వాళ్ల అయ్యారని అన్నారు. ఈ సొసైటీకి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరో సానిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణిదేవి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితాలక్ష్మారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంత్ రెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.

రహదారుల సమస్యలు పరిష్కరించండి..

- గడ్కరిని కలిసిన ఎంపీ రవిచంద్ర

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం గుండా వెడుతున్న జాతీయ రహదారులపై నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గురువారం పార్లమెంట్ ఆవరణలో కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఖమ్మం మీదుగా వెళ్లే నాగపూర్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే అలైన్ మెంటును ఖమ్మం కలెక్టరేట్ వద్ద మార్చాలని కోరారు. ప్రతిపాదిత హైవే మార్గం సమీకృత కలెక్టరేట్ మధ్య నుంచి వెడుతుందనీ, అది రాకపోకలకు అసౌకర్యంగా ఉండటంతో దానిని కలెక్టరేట్ వెనుక నుంచి వెళ్లేలా సవరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇదే హైవేపై ఖమ్మం, విజయవాడ మార్గం నుంచి వచ్చే వాహనాలు సూర్యాపేట సమీపాన కలిసే చోట, జాతీయ రహదారి నంబర్ 65 పై యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్ వద్ద కూడా వాహనదారులు,పాదాచారుల సౌకర్యార్థం అండర్ పాసులను ఏర్పాటు చేయాల్సిన అవసరం గుర్తించారు.ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

మోడల్ టీచర్లకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్ల ఫెడరేషన్ (టీఎస్ఎంఎస్‌టీఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పదేండ్లుగా ఒకేచోట పనిచేస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలి పారు. బదిలీల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభు త్వ మండల, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతోపాటు మోడల్ స్కూల్ టీచర్లకు కూడా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి కొండయ్య, ఎస్ మహేష్, కార్యదర్శి రంజిత్‌కుమార్, సాయిచరణ్, యాదగిరి, ఐలయ్య..తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

ఐటీ వసూలుకు 57 పైసలు ఖర్చు

- రూ.100కు అయ్యే వ్యయం
- ప్రపంచంలోనే తక్కువ
- ఆదాయపు పన్ను అధికారి శిశిర్ అగర్వాల్ వెల్లడి



హైదరాబాద్ : భారతదేశంలో ఆదాయపు పన్ను వసూలుకు అయ్యే ఖర్చు ప్రపంచంలోనే అతి తక్కువని హైదరాబాద్ సర్కిల్ ఆదాయపు పన్ను ప్రధాన కమిషనర్ శిశిర్ అగర్వాల్ అన్నారు. ప్రతీ రూ.100 పన్ను వసూలు చేయడానికి కేవలం 57 పైసలు ఖర్చు అవుతుందన్నారు. కేంద్ర బడ్జెట్ తర్వాత వాణిజ్యం, పరిశ్రమలకు సంబంధించి ఉత్పన్న మయ్యే విషయాలను చర్చించడానికి ఎఫ్‌టీసీసీఐ గురువారం హైదరాబాద్‌లో ఓ ప్రత్యేక సెమినార్‌ని నిర్వహించింది. దీనికి 200 మందికి పైగా నిపుణులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిశిర్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యల్ప ఖర్చు చేసే దేశాలలో ఒకరిగా ఉన్నామన్నారు. " బ్రిటన్‌లో 73 పైసలు, జపాన్ 174 పైసలు, జర్మనీ 135 పైసలు, కెనడా 150 పైసలు, ఫ్రాన్స్ 111 పైసలు ఖర్చు చొప్పున వ్యయం అవుతోంది. మనకంటే తక్కువ ఖర్చు చేసే ఏకైక దేశం అమెరికా మాత్రమే." అని అగర్వాల్ తెలిపారు. " ప్రజలు అసహ్యించుకోవడానికి ఇష్టపడే విభాగం మాది. మా అధికారిక హోదాలో వారిని సందర్శించాలని ఎవరూ కోరుకోరు. కానీ, మేము నిజంగా బాగా పని చేస్తున్నాము. చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నాము. గణాంకాలు మా పనితీరును ప్రతిబింబిస్తున్నాయి. 2021-2022 సంవత్సరానికి మేము ఆల్ టైమ్ రికార్డ్ ట్యాక్స్ వసూలు చేశాము. నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు (ఆదాయపు పన్ను , కార్పొరేట్ పన్ను) రూ. 14.09 లక్షల ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో బాగానే ఉంది. 14.08 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది గత ఏడాది కంటే 24 శాతం కంటే ఎక్కువ. అని శిశిర్ అగర్వాల్ తెలిపారు. ఈ సెమినార్‌లో సికింద్రాబాద్ కమిషనరేట్ సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ డిపి నాయుడు, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

రాణించిన ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ

హైదరాబాద్ : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.293 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీపై ఆదాయం పెరగడం, మొండి బాకీలకు కేటాయింపులు తగ్గడంతో ఆ బ్యాంక్ రాణించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.34 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇదే సమయంలో రూ.154 కోట్లుగా ఉన్న నిర్వహణ లాభాలు.. క్రితం క్యూ3లో 153 శాతం పెరిగి రూ.389 కోట్లుగా నమోదయ్యాయి. గడిచిన త్రైమాసికంలో రూ.30వేల కోట్ల బ్యాలెన్స్ షీట్ మార్క్‌ను చేరామని ఆ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎట్టిర డావిస్ పేర్కొన్నారు. క్రితం క్యూ3లో విజయవంతమైన ఫలితాలను నమోదు చేశామన్నారు.

సీఎస్ ను కలిసిన నవీన్ మిట్టల్

నవతెలంగాణ - హైదరాబాద్



రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా, సీసీఎల్ఏ గా బాధ్యతలను స్వీకరించిన నవీన్ మిట్టల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సంధర్భంగా సమకాలీన అంశాలు చర్చకొచ్చాయి .దీర్ఘకాలికంగా రెవెన్యూ శాఖ , సీ సీ ఎల్ ఏ ఉన్నతాదికారులు లేని సంగతి తెలిసిందే .ఆ విషయాలపై కూడా చర్చ జరిగినట్టు సమాచారం .ధరణి సమస్యలపై దృష్టిపెట్టాలని సీఎస్ నవీన్ మిట్టల్ కు సూచించినట్టు తెలిసింది .

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు 7 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు ఈ నెల ఏడు నుంచి 14 వరకు హైదరాబాద్ వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్టు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) సభ్య కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీని, సెషన్ ను తెలుసుకునేందుకు బోర్డు వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు. వెరిఫికేషన్‌కు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది.

గిరిజన సంక్షేమ టీచర్లకు త్వరలో బదిలీలు, పదోన్నతులు : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు త్వరలోనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టే అవకాశముందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ తెలిపారు. ఈ మేరకు అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయాలంటూ గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి సర్వేశ్వర్‌రెడ్డిని గురువారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. త్వరలోనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేస్తామనీ, అందుకవసరమైన శాఖాపరమైన నిర్ణయాలు తీసుకున్నామని హామీ ఇచ్చారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలోని అన్ని ఖాళీలను ప్రకటించి నింపాలని కోరారు. బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న 50 ఏండ్లలోపు వయసున్న పురుష ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ చేయాల్సి వస్తే ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలని సూచించారు. రవాణా సౌకర్యం లేని కొండ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు బదిలీల్లో అదనపు (హెచ్ఆర్ఏ) పాయింట్లు కేటాయించాలని కోరారు. దీనిపై సర్వేశ్వర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు భరోసా : సజ్జల



అమరావతి : సంక్షేమ, అభివృద్ధి పథకాలను జగన్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అందిస్తోందని, వైసిపితోనే భరోసా ఉంటుందనే అంశాన్ని క్షేత్రస్థాయిలో చాటి చెప్పాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని శుభమస్తు కళ్యాణ మండపంలో హర్‌దిల్ మే వైఎస్ఆర్ -హమ్ సబ్ జగన్ కే సాథ్ అనే నినాదంతో వైసిపి మైనార్టీ సెల్ ఆధ్వర్యాన గురువారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. రాజకీయంగా ముస్లిములకు ఎన్నో పదవులను జగన్ కట్టబెట్టారని తెలిపారు. ఈ మూడున్నర ఏళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.21 వేలకోట్లను మైనార్టీల కోసం ఖర్చు చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థులు చదువుకునే స్కూళ్లను సిఎం జగన్ అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజకీయంగా ఎంతో మందికి అవకాశం కల్పించిన జగన్‌పై టిడిపి సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా కానమ్, ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- అసెంబ్లీలో ప్రజాసమస్యలపై నిలదీస్తాం : ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నట్టు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పులమయంగా మార్చాడనీ, ఇప్పుడు దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ ఉందని విమర్శించారు. కేంద్రంలోని తమ ప్రభుత్వం ఎన్నికల కోసం కాకుండా దేశ వాస్తవిక అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. కేసీఆర్‌లా మాయమాటలు చెప్పి మోసం చేయడం తమ ప్రభుత్వానికి తెలియదన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో తమకు ఎన్ని ఆస్తులున్నాయి? కేసీఆర్‌కు ఎన్ని ఆస్తులున్నాయి? ఉద్యమంలో ఎవరు ఆస్తులను పోగొట్టుకున్నారు? ఎవరు ఆస్తులను పోగేసుకున్నారు? అనే అంశంపై చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. తాను టీఆర్ఎస్‌కు రాజీనామా చేసి వెళ్లిపోలేదనీ, కేసీఆరే తనను పార్టీ వీడేలా చేశారని విమర్శించారు. ఎమ్మెల్యేల గౌరవానికి భంగం కలిగిస్తే శిలాఫలకాలను పగలగొడతామన్నారు.

కేసీఆర్‌తో తనకు గ్యాప్ లేదు

- జేడీ(ఎస్)నేత కుమార స్వామి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయాల్లో తన తండ్రి దేవేగౌడ తర్వాత అంతటి మార్గదర్శి కేసీఆరేనని జేడీ (ఎస్) నేత కుమారస్వామి తెలిపారు. గురువారం రాయచూర్‌లో జరిగిన పంచరత్న యాత్రలో నారాయణపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో 24 జిల్లాల రైతులకు మేలు జరుగుతున్నదని తెలిపారు. మిషన్ భగీరథ పథకంతో తెలంగాణ లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు లభిస్తున్నదన్నారు. కర్నాటకలో తాము అధికారంలోకి వస్తే కేసీఆర్ స్ఫూర్తితో పథకాలు అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు కర్నాటక అభివృద్ధిని వెనక్కు నెట్టాయని ఆరోపించారు.

పోలవరం నిర్వాసితులకు
నగదు బదిలీ కుదరదు

- కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్

న్యూఢిల్లీ : పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లింపుపై కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్ స్పష్టత ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతున్నందున నిర్వాసిత కుటుంబాలకు కేంద్రమే నేరుగా నగదు బదిలీ చేయడం కుదరదని తేల్చిచెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి అనుగుణంగా లేదని తెలిపారు. లోక్‌సభలో వైసిపి ఎంపి వంగా గీత విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపి ప్రభుత్వం చేసిన ఖర్చును ఎప్పటికప్పుడు తిరిగి చెల్లిస్తున్నామని షెకావత్ పేర్కొన్నారు. భూసేకరణ, పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగడం లేదని ఆయన తెలిపారు. భూసేకరణ కింద 2014 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ వరకు రూ. 3,779.05 కోట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిందని, వాటిలో రూ.3,431.59కోట్లు చెల్లించామని తెలిపారు. పరిహారం, పునరావాస ప్యాకేజీ కింద 2014 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ వరకు ఏపి ప్రభుత్వం రూ.2,267.29 కోట్ల బిల్లులు సమర్పించగా, ఇప్పటి వరకు రూ.2,110.23కోట్లు తిరిగి చెల్లించామని షెకావత్ పేర్కొన్నారు.

75.3 కిలో మీటర్ల విశాఖ మెట్రోకు ప్రతిపాదనలు అందలేదు

75.3 కిలో మీటర్ల విశాఖ మెట్రోకు ప్రతిపాదనలు అందలేదని కేంద్ర పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌషల్ కిశోరే తెలిపారు. లోక్‌సభ ఎంపి ఎంవివి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలచే రూపొందిస్తాయి. మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది. అయితే, అటువంటి ప్రాజెక్టుల ఆమోదం ప్రతిపాదన సాధ్యత, వనరుల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సెప్టెంబరులో కొరియన్ ఎక్సిమ్ బ్యాంక్ నుండి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడ్‌లో ఆర్థిక సహాయం కోసం రూ. 8,300 కోట్ల అంచనా వ్యయంతో విశాఖపట్నంలో 42.55 కిలో మీటర్ల పొడవుతో లైట్ మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం ప్రతిపాదనను సమర్పించింది.

అయితే ప్రతిపాదనను పరిశీలించిన తరువాత ప్రాజెక్ట్‌కు ఆర్థిక సహాయం చేయడంలో కొరియన్ ఎక్సిమ్ బ్యాంక్ విముఖత వ్యక్తం చేసింది. రూ. 15,993 కోట్ల అంచనా వ్యయంతో 75.3 కిలో మీటర్ల పొడవుతో వైజాగ్ మెట్రో ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్వీకరించలేదు" అని తెలిపారు. "అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ నగరాల కోసం సవివరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్, సమగ్ర మొబిలిటీ ప్లాన్‌ల తయారీతో సహా వివిధ రవాణా అధ్యయనాలను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు.

ఎపిలో 1,92,290 ఇళ్లు నిర్మాణం పూర్తి

2022-23లో ఏపిలో 1,92,290 ఇళ్లు నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద 2023 జనవరి 23 వరకు 1,92,290 ఇళ్లు పూర్తి అయినట్లు పేర్కొంది. ఇళ్లు నిర్మాణానికి రూ.31,622.09 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.17,803.47 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది.

కొవ్వాడ అణు విద్యుత్‌పై వెస్టింగ్‌హౌస్‌తో చర్చలు

కొవ్వాడలో ఆరు అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం వెస్టింగ్‌హౌస్ కంపెనీ (అమెరికా)తో చర్చలు జరుపుతున్నట్లు ప్రధాన మంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. వెస్టింగ్‌హౌస్ కంపెనీతో చర్చలు ముగిసిన అనంతరం అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అయ్యే ఖర్చు, నిర్మాణానికి పట్టే సమయం వంటి వివరాలతో ప్రాజెక్ట్ ప్రతిపాదనలు ఖరారు అవుతాయని మంత్రి వివరించారు. ప్రస్తుతానికి ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందు జరిగే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. భూసేకరణ, ప్రాజెక్ట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు పొందడం, ప్రాజెక్ట్ స్థలంలో భూమి స్వరూప స్వభావాలపై అధ్యయనం వంటి పనులు జరుగుతున్నాయి. కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్ట్ కోసం 2,079 ఎకరాల భూమి అవసరం ఉంది. ఇప్పటికి 2061 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఈ భూమిని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ పేరిట బదలాయించడం కూడా పూర్తయిందని మంత్రి తన జవాబులో పేర్కొన్నారు. అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం ఊపుగా జరిగే సమయంలో సుమారు 8 వేల మందికి కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రంలో ఉపాధి లభిస్తుంది. ఈ కేంద్రం నిర్మాణం పూర్తి చేసుకుని విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిన అనంతరం ప్రతి యూనిట్‌లో 2 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్లాంట్‌లలో వచ్చే ఉపాధి అవకాశాలతోపాటు విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమైన అనంతరం కంట్రాక్టర్లు, వెండర్ల వ్యాపారం వలన జరిగే ఆర్థిక కార్యకలాపాలతో ఇంకా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి జితేంద్ర సింగ్ వివరించారు.

564 మంది విద్యార్థులకు కెవిపివై ఫెలోషిప్‌లు

కిషోరీ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కెవిపివై) పథకం కింద గడచిన 5 ఏళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో 564 మంది విద్యార్థులకు ఫెలోషిప్ అందించినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా బదులిస్తూ ఈ విషయం తెలిపారు. కెవిపివైకి ప్రత్యేకించి నిధులు కేటాయింపు ఏదీ ఉండదని, ఇన్‌స్పైర్, ఇన్స్పైర్-షి బడ్జెట్ కింద కేటాయించిన నిధులతోనే కేవీపీవై ప్రోగ్రాం అమలు చేస్తారని తెలిపారు. కెవిపివై ఫెలోషిప్ కింద 2023-23 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 1 వరకు 843.80 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. కిషోరీ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన కింద 2019-20లో 17.34కోట్లు, 2020-21లో 20,71 కోట్లు, 2021-22 లో 13.45 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు భారీ బందోబస్తు

- రెండు వేల మందికి పైగా పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలు నిషేధం
- పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటానికి భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి దాదాపు పది రోజులకు పైగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే.

దీంతో అసెంబ్లీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెండు వేల మందికి పైగా పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ప్రవేశ ద్వారం ఎదుట బారీ కేడ్లను ఏర్పాటు చేసి అడుగడుగునా సాయుధ పోలీసులను నియమించారు. రెండు ప్రధాన గేట్ల వద్ద అదనపు ఎస్పీ స్థాయి అధికారులను ఇంచార్జీలుగా నియమించి కేవలం పాసులున్నవారికి మాత్రమే లోనికి అనుమతించేలా ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ లాబీ ప్రవేశ ద్వారం వద్ద ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా సోదా చేసి లోనికి ఒదిలేలా భద్రతా అధికారులను ఆదేశించారు. అలాగే, అసెంబ్లీకి కిలో మీటర్ దూరం వరకు ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, పికెటింగ్‌లు, రాస్తా రోకోలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నిషేధాజ్ఞలు విధించారు. అలాగే, అసెంబ్లీ ప్రాంగణంలో మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి అందులో నుంచి ప్రతి ఒక్కరూ వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగానికి చెందిన బాంబ్ సెర్చింగ్ స్క్వాడ్‌లతో అసెంబ్లీ ప్రాంగణంతో పాటు లోపల సెక్యూరిటీ అధికారులు సోదాలను నిర్వహించారు. అలాగే, అసెంబ్లీ వైపునకు వచ్చే మార్గాలలోని చౌరస్తాలలో ఆందోళన కారులెవరూ శాసనసభ వైపునకు చొచ్చుకురాకుండా చూడటానికి సాయుధ బలగాలతో పికెట్లను ఏర్పాటు చేశారు.

ఫెలోషిప్‌ను పెంచండి

- పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు
- బెంగళూరులోని ఐఐఏ పీహెచ్‌డీ విద్యార్థుల నిరసన



బెంగళూరు : కర్నాటకలోని కేంద్ర విద్యా సంస్థ అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఐఏ) పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు మెరుపు నిరసన ప్రదర్శనలకు దిగారు. తమ ఫెలోషిప్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణంతో పెరుగుతున్న ఖర్చుల కారణంగానే తాము ఈ డిమాండ్‌ను చేస్తున్నట్టు చెప్పారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో డిమాండ్ల సాధనకు విద్యార్థులు నిరసనకు దిగారు. తమకు వచ్చే స్టైఫండ్‌లో రూ. 5 వేలు హాస్టల్ వసతికే కట్ అవుతున్నాయనీ, దీంతో తమ చేతుల్లో మిగిలే కొద్ది పాటి మొత్తంతో నెలంతా గడవటం కష్టంగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మరికొందరు విద్యార్థులైతే పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారు ఉన్నారు. వీరిలో చాలా మంది తమకు వచ్చే స్టైఫండ్‌లో కొంత భాగాన్ని తమ వద్ద ఖర్చులకు ఉంచుకొని మిగతా మొత్తాన్ని వారి తల్లిదండ్రులకు ఇళ్లు గడవటానికి పంపుతున్నారు.

ఎన్నో ఆశలతో.. ఉన్న లక్ష్యాలను అధిరోహించాలన్న లక్ష్యంతో తాము ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో చేరామనీ, ఫెలోషిప్‌ల సాయంతోనే తాము ముందుకెళ్లగలమని పరిశోధక విద్యార్థులు తెలిపారు. "మాది బీహార్. మాది వ్యవసాయ కుటుంబం. అయితే, వ్యవసాయంతో మాకు పూట గడవటమే కష్టంగా మారింది. సాగు నుంచి వచ్చే మొత్తం.. తర్వాత పంటకు తిరిగి పెట్టుబడి పెడతారు. అంతగా లాభం లేదు. అయితే, ఈ సారి వరదల కారణంగా పంట నష్టం ఏర్పడింది. దీంతో వారు (కుటుంబీకులు) నా స్టైఫండ్‌పై ఆధారపడ్డారు. నేను వారికి ప్రతి నెలా రూ. 20 వేలు పంపుతాను. నేను నా ఖర్చుల కోసం నా దగ్గర రూ. 5 వేలు ఉంచుకుంటాను. ఇంత మొత్తంతో ఖరీదైన నగరంలో మనుగడ సాగించటం కష్టం" అని రెండో సంవత్సరం చదువుతున్న పీహెచ్‌డీ స్కాలర్ సుశాంత్ కుమార్ (25) ఆందోళన వ్యక్తం చేశారు. ఫెలోషిప్ మొత్తాన్ని పెంచితే, ఇది అందరు పరిశోధక విద్యార్థులు, వారి కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుందని నాలుగో సంవత్సరం చదువుతున్న పీహెచ్‌డీ విద్యార్థి శుభం ఘతుల్ తెలిపారు. కేంద్రం బడ్జెట్ నేపథ్యంలో స్కాలర్‌షిప్‌లకు సంబంధించి దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో నిరసనలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే.

వేతన జీవులకు మొండి చేయి : సీసీజీజీఓఓ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ సర్కారు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీసీజీజీఓఓ) తెలిపింది. గురువారం ఈ మేరకు ఆ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి.కృష్ణమోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పన్ను విధానాన్ని ఎత్తేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందని తెలిపారు. పరోక్ష పన్నుల ద్వారా వేతనాల నుంచి ఆదాయాన్ని రాబట్టుకుంటున్న ప్రభుత్వం వాటిపై భారీగా పన్ను వేయటమే అర్థరహితమని విమర్శించారు. కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించలేదని పేర్కొన్నారు. కొత్త పన్ను విధానం అధికాదాయ వర్గాలకు మాత్రమే కొంతమేర ఉపయోగపడుతుందని తెలిపారు. తక్కువ వేతనాదాయ వర్గాలు వినియోగించుకుంటున్న పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.2.50 లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచటం నామ మాత్రమేనని తెలిపారు. పొదుపు మొత్తాలపై రాయితీని రూ.1.50 లక్షలను అలాగే కొనసాగించారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలో లేనప్పుడు దాన్ని రూ.3 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదని వివరించారు. కేంద్రం ఎన్నికలకు ముందు ప్రతిపాదించిన ఆఖరి పూర్తి బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తిని కలిగించలేదని విమర్శించారు.

ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఆస్థులపై
మూడో రోజూ కొనసాగిన ఐటీ దాడులు

- మరో ఇద్దరు బిల్డర్ల పైనా కొనసాగిన సోదాలు

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

కోట్ల రూపాయల్లో ఆదాయపు పన్నును ఎగవేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఆస్థులపై ఐటీ దాడులు గురువారం మూడో రోజూ కొనసా గాయి. దీంతో పాటు ముప్పా బిల్డర్స్, వర్టెక్స్ బిల్డర్స్, వసుధ ఫార్మాస్యూటికల్ కంపెనీ లపై కూడా ఐటీ దాడులు జరిగాయి. ముఖ్యంగా, వెంకట్రామిరెడ్డికి చెందిన రాజ్‌పుష్ప ప్రధాన కార్యాలయంతో పాటు ముప్పా బిల్డర్స్ కార్పొరేటు కార్యాలయంలో క్షుణ్ణంగా సోదాలు సాగాయి. మంగళవారం నాడు ప్రారంభమైన ఐటీ దాడుల్లో 50 మందికి పైగా ఐటీ అధికారులు పాల్గొనగా.. బుధ, గురువారాల్లో కొనసాగిన సోదాలలో మరికొందరు అధికారులు అదనంగా చేరారు. ముఖ్యంగా, ముప్పా బిల్డర్స్‌కు సంబంధించి సాగిన నిర్మాణాలు, గడించిన ఆదాయాలు, జరిపిన ఐటీ పన్ను చెల్లింపుల్లో భారీ ఎత్తున వ్యత్యాసాలు తేలినట్టు ఐటీ అధికారులు గుర్తించారని తెలిసింది. అలాగే, రాజ్‌పుష్ప, వసుధ ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో సైతం పన్ను చెల్లింపు వ్యత్యాసాలు కోట్ల రూపాయల్లో ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. కార్పొరేటు సంస్థల కార్యాలయాల నుంచి వాటి ఆస్థులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, నూతనంగా నిర్మించిన విల్లాలు, వాటి విక్రయాలు సంబంధించిన పలు డాక్యుమెంట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అంతేగాక, ఈ సంస్థల నుంచి ఇతర వ్యాపారాలలో సాగిన పెట్టుబడుల గురించి కూడా ఐటీ అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. నగర అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు లు సిటీ సెక్యూరిటి వింగ్‌కు చెందిన అధికారులతో కలిసి అసెంబ్లీ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను గురువారం సమీక్షించారు.

అంబేద్కర్ పుట్టిన రోజునే సచివాలయం ప్రారంభించేలా చర్యలు తీసుకోండి

- హైకోర్టులో ప్రజాశాంతి అధ్యక్షులు కేఏ పాల్ పిల్

నవతెలంగాణ -హైదరాబాద్



తెలంగాణ నూతన సచివాలయాన్ని కేసీఆర్ పుట్టినరోజైన ఈ నెల 17న ప్రారభించడాన్ని సవా లు చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షు లు కేఏ పాల్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సీఎం కేసీఆర్ వ్యక్తిగత ప్రతిష్ట కోసం ఆయన పుట్టినరోజున కొత్త సచివాల యాన్ని ప్రారంభించాలనే నిర్ణయం తీసుకోవడాన్ని తప్పు బట్టారు. నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టారనీ, అంబేద్కర్ పుట్టినరోజైన ఏప్రిల్ 14న ప్రారంభించాలని కోరా రు. ఈమేరకు రాష్ట్ర ప్రభు త్వానికి ఆదే శాలు ఇవ్వాలని సీఎంఓను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పిల్‌లో చేర్చారు.

ఎంవీ యాక్ట్‌లో సవరణపై హైకోర్టు విచారణ

మోటార్ వెహికిల్ చట్టంలోని ఆరు మాసాల నిబంధన విధించడాన్ని సవాల్ చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారణ జరిపింది. రోడ్డు ప్రమాదం జరిగితే ఏడాదిలోగా దావా వేయాలన్న నిబంధనను ఆరు నెలలకు తగ్గించడం సరికాదని అభిప్రాయ పడింది. ఇదిప్రజలకు సంబంధించిన అంశమని పేర్కొంది. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం అమ్రాడ్ గ్రామానికి చెందిన అయిటి నవనీత అక్కడి కోర్టులో దావా వేశారు. ఆరు నెల్ల గడువు ముగియడంతో అక్కడి కోర్టు విచారణను నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అమికస్ క్యూరీగా నియామకం అయిన న్యాయవాది పి.శ్రీరఘురామ్ తన అభిప్రాయా కోర్టుకు నివేదించారు. 'పరిహారం పొందే హక్కును ఓ పౌర చట్టంగా పరిగణించాలన్నారు. దీనిపై హైకోర్టు .. ఇది ఈ ఒక్క కేసుకు సంబంధించిన అంశం కాదనీ, పెద్ద ఎత్తున ప్రజలతో ముడిపడిందని చెప్పింది. ప్రతివాదుల వాదనల నిమిత్తం విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

ఈసీఐఎల్ మాజీ ఉద్యోగులకు ఎదురుదెబ్బ

ఈసీఐఎల్ యాజమాన్యానికి అందులో పనిచేసే ఉద్యోగుల సంఘానికి మధ్య జరిగిన ఒప్పందంలో తాము జోక్యం చేసుకోబోమని హైకోర్టు స్పష్టం చేసింది. ఒప్పందం ప్రకారం 2007 నుంచి పెన్షన్‌తో పాటు ఇతర ప్రయోజనాలను కల్పించాలని ఈసీఐఎల్ మాజీ ఉద్యోగుల వినతిని తోసిపుచ్చింది. 2009లో కుదిరిన ఒప్పందం ప్రకారం 2007లో రిటైర్ అయిన ఎగ్జిక్యూటీవ్‌లకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ మాజీ ఉద్యోగి సీహెచ్ నాగేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.మాధవీదేవి కొట్టేస్తూ తీర్పు వెలువరించారు.

ఒప్పంద అమలుకు చట్టబద్ధత లేనందున ఈ వ్యవహారం లో హైకోర్టు తన విచక్షణాధికారాన్ని వినియోగించలేదని చెప్పారు. ఈసీఐఎల్ లాభాల్లో ఉన్నందున ఇప్పుడు రిటైర్ అయ్యే ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా పెన్షన్ ఇవ్వాలని పిటిషనర్ వాదన. రిటైర్మెంట్ ప్రయోజనాలతో పాటు వైద్య సౌకర్యాల కల్పన ఉందనీ, పిటిషనర్ల వాదనను ఆమోదిస్తే సంస్థ మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుందని ఈసీఐఎల్ వాదించింది.

బైరి నరేష్ భద్రత కోసమే..
హైకోర్టుకు నివేదిక

మత మనోభావాల్ని దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారనే కేసులో అరెస్టై జైల్లో ఉన్న బైరి నరేష్ భద్రత కోసమే పరిగి జైలు నుంచి చర్లపల్లి జైలుకు తరలించినట్టుగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి హైకోర్టుకు నివేదిక అందజేశారు. ఈ విషయం నరేష్‌కు తెలియదని చెప్పారు. నరేష్‌ను చర్లపల్లి జైల్లో ఏకాంతంగా నిర్బంధించడం హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలని కోరుతూ అతని భార్య సుజాత హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. వాస్తవ పరిస్థితి పరిశీలించి నివేదిక ఇవ్వాలని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గత ఆదేశాలకు అనుగుణంగా కార్యదర్శి నివేదిక సమర్పించారు. జనవరి 30న జైలు సూపరింటెండెంట్, నరేష్‌లను విచారించినట్టు తెలిపారు. పరిగి జైల్లో భద్రత కష్టమని అక్కడి అధికారులు చెప్పడం వల్లే చర్లపల్లికి తరలించారనీ, విచారణ ఖైదీలు 20 మందితో నరేష్ ఉన్నాడనీ, 14 రోజులపాటు సెల్‌లోనే అన్నం పెట్టారనీ, ఇప్పుడు అందరి ఖైదీలతో కలిపి పెడుతున్నారని చెప్పారు. మానస సరోవర్ బ్యారక్‌లో ఉన్నాడనీ, ములాఖత్‌పై ఫిర్యాదులు ల్లేవనీ, వైద్య పరీక్షలు కూడా చేస్తున్నారనీ, అదే బ్యారెక్‌లో రేప్,మర్డర్ కేసు నిందితుడు నాగేశ్వరరావు కూడా ఉన్నాడని తెలిపారు. ఈ నివేదికను పరిశీలించిన హైకోర్టు, దానిపై వివరణ ఇవ్వాలని పిటిషనర్‌ను ఆదేశించింది.

జప్తు సబబే-ఈడీ అప్పీల్

ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జ్యుయల్స్‌లో జప్తు చేసి సీజ్ చేసిన నగలు, నగదు తిరిగి అప్పగించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డివిజన్ బెంచ్ వద్ద సవాల్ చేసింది. దీనిపై చీఫ్ జస్టిస్ ఉజ్జల్‌భూయాన్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించింది. ఆ కంపెనీ ప్రతినిధులకు బోగస్ కంపెనీలతో సంబంధాలు ఉన్నందున సింగిల్ జడ్జి ఆర్డర్ అమలును నిలిపివేయాలని ఈడీ కోరిన అప్పీల్‌పిటిషన్‌పై విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

ప్రయివేటు టీచర్లు, లెక్చరర్ల
సమస్యలను పరిష్కరించాలి

- వాకాటి కరుణకు టీపీటీఎల్ఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు టీచర్లు, లెక్చరర్లను రిజిస్టర్ చేసి గుర్తింపు కార్డులివ్వాలనీ, వారి సమస్యలను పరి ష్కరించాలని తెలంగాణ ప్రయివేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి అరుణకు ఆ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా టీపీ టీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎ.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 11వేలకు పైగా ప్రయవేటు పాఠశాలలుండగా అందులో 4 లక్షల మంది వరకు టీచర్లు పనిచేస్తున్నారని తెలి పారు. వారు 35లక్షల మంది విద్యార్థు లకు బోధన చేస్తున్నారని చెప్పారు. అయినా వారి సేవలకు సరైన గుర్తింపు దక్కడం లేదని వాపోయారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మెడి కల్, ఫార్మసీ, అగ్రి కల్చర్, ఫార్మా మెడికల్ కాలేజీలు అనేకం ఉన్నాయనీ, వాటిలో కూడా దాదాపు మరో నాలుగు లక్షల మంది పైగా లెక్చరర్లు చదువులు చెబుతున్నారని వివరిం చారు. వారి శ్రమకు కూడా గుర్తింపు దక్కట్లేదన్నారు. రాష్ట్రంలో ప్రయివేటు విద్యాసంస్థల్లోని టీచింగ్ ఫ్యాకల్టీనం తా రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వారికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయా లని డిమాండ్ చేశారు. ప్రయివేటు టీచింగ్ స్టాఫ్‌కి బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ అమ లయ్యేలా చూడాలన్నారు. ప్రయివేటు టీచర్లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం వేజ్ ప్రకారం తప్ప నిసరిగా జీతాలిచ్చే లా చర్యలు తీసుకో వాలన్నారు. విద్యా సంవత్సరం మధ్య లోనే టీచర్లను తీసేసే పద్ధతిని అరికట్టాలని కోరారు.

కంటి వెలుగు బృందానికి సీఎస్ అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సచివాలయంలో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించిన బందాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అభినందించారు. హైదరాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో వైద్య బందం గత 10 రోజులుగా 1,240 మందికి కంటి పరీక్షలు నిర్వహిచారు. 550 మందికి రీడింగ్ గ్లాసెస్, 404 మంది కి రెఫరల్ కండ్లద్దాలకు సిఫారసు చేశారు. కంటి పరీక్షలు ముగిసిన సందర్భంగా గురువారం నిర్వహించి న సమావేశంలో డాక్టర్లు దీప్తి ప్రియాంక, మనోజ్ రెడ్డి, మాధురి తోపాటు సందీప్, దాసీ రెడ్డి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైరాబాద్

మహారాష్ట్రకు చెందిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. బోకర్ మండలం రాఠీ సర్పంచ్ మల్లేష్ పటేల్‌తో సహా 100 మంది మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకులు బామిని రాజన్న ఆధ్వర్యంలో కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బామిని రాజన్న, మాజీ డీసీసీబీ చైర్మెన్ రాంకిషన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై
సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం

- మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించేందుకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ,బీసీ సంక్షేమ, పర్యాటక శాఖల ఉన్నతాధికారులతోపాటు గౌడ సంఘాల ప్రతినిధులతో కలిసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఉమ్మడి రాష్ట్రంలో గత పాలకులు తెలంగాణకు చెందిన వైతాళికుల చరిత్రను కనుమరుగు చేశారని తెలిపారు.తెలంగాణ వైతాళికులను, కవులను, కళాకారులను, చరిత్రకారులను, సామాజికవేత్తలను గౌరవించి వారి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలిసేలా వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఈటల గాలిమాటలొద్దు :ఎమ్మెల్సీ భానుప్రసాద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గాలిమాటలు మాట్లా డటం మానుకోవాలని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్ హితవు పలికారు. గురువారం హైదరా బాద్‌లోని బీఆర్ఎస్ఎల్పీ కార్యా లయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసి ఉత్పాదక రంగంపై పెడుతుంటే, కేంద్రం అప్పులు చేసి కార్పొరేట్ల ను పెంచి పోషిస్తుందన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 59,909 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 59,909 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్లో సవరణ ప్రక్రియను 13,710 మంది అభ్యర్థులు వినియోగించుకున్నారు. ఈ మేర కు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3,649 మంది, నిజా మాబాద్‌లో 3,426 మంది, రంగారెడ్డి జిల్లాలో 3,256 మంది, సంగా రెడ్డిలో 3,202 మంది, ఖమ్మంలో 3,065 మంది, అత్యల్పంగా ములుగు జిల్లాలో 423 మంది, జయశంకర్ భూపాలపల్లిలో 546 మంది, హన్మ కొండలో 696 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారని వివరించారు.

విద్యుత్ ఒప్పందాన్ని పున:పరిశీలించాలి

- అదానీ సంస్థను కోరిన బంగ్లాదేశ్

ఢాకా : అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని బంగ్లాదేశ్ విద్యుత్ సంస్థ పున:పరిశీలించాలని కోరింది. ఈ మేరకు జార్ఖండ్‌లోని అదానీ పవర్‌ప్లాంట్‌కు బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డ్ (బిపిడిబి) లేఖ రాసింది. అదానీ పవర్ లిమిటెడ్ నుండి విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై 2017లో బంగ్లాదేశ్ సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కోసం కొనుగోలు చేయాల్సిన బొగ్గు ధరను అదానీ పవర్‌ప్లాంట్ అధికంగా డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. జార్ఖండ్‌లోని 1600 మెగా వాట్ల ప్లాంట్‌కు ఇంధనంగా వినియోగించే బొగ్గును దిగుమతి చేసేందుకు ఎల్‌సిలను ప్రారంభించడానికి సంబంధించి వచ్చిన అభ్యర్థనల మేరకు తాము అదానీ సంస్థకు లేఖ రాశామని బిపిడిబికి చెందిన ఓ అధికారి తెలిపారు.

ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్ బంగ్లాదేశ్‌కు ఎగుమతి అవుతుందని, దీంతో బొగ్గు రవాణా సహా కొనుగోలుకయ్యే ఖర్చులన్నీ బంగ్లాదేశ్ భరించాల్సి వుంది. ఈ బొగ్గు ధరను విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో చేర్చాల్సి వుంది. స్థానిక మీడియా ప్రకారం.. బొగ్గు దిగుమతికి సంబంధించి ఎల్‌సిలను ప్రారంభించే ముందు భారత అధికారుల కు అదానీ పవర్ డిమాండ్ నోట్‌ను సమర్పించాల్సివుంది. దీంతో డిమాండ్ నోట్‌ను ఇవ్వాల్సిందిగా బిపిడిబిని కోరినట్లు తెలిపింది. అయితే డిమాండ్ నోట్ బొగ్గు ధరను మెట్రిక్ టన్ను 400 డాలర్లుగా పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రస్తుత పరిస్థితులను అనుసరించి ఇది చాలా ఎక్కువని బంగ్లాదేశ్ అధికారులు వాదిస్తున్నారు. ఇతర ప్లాంట్‌లకు మెట్రిక్ టన్ను బొగ్గుకు 250 డాలర్లు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.